
మధుబాబు
MB
PUBLICATIONS

# బర్మా డాల్

ఆరు మూరల బాణా కర్రను గట్టిగా పట్టుకొని రెండు అడుగులు ప్రక్కకు వేశాడు శ్రీకర్.

మూడో అడుగు వేయబోతున్నట్లు నటించి ఒక్కసారిగా స్టడీ అయ్యాడు.

తన చేతిలోని కర్రను కత్తిలా ముందుకు జాచి చూపు తోనే అతని కదలికల్ని అనుసరిస్తున్నది బిందు. క్షణం కూడా ఆలస్యం చేయకుండా ఒక్క గంతులో ముందుకు దూకి కర్ర మొనతో బలంగా పొడిచింది అతని గుండెల మీద.

కుడిచేతిని కొంచెం కూడా కదిలించకుండా ఎడమ చేత్తో తన బాణా కర్రను అవలీలగా పైకి ఎత్తాడు శ్రీకర్. బిందు ప్రొజెక్ట్ చేసిన పోటును సునాయాసంగా ప్రక్కకు నెట్టి, అదే వూపులో లాగిపెట్టి కొట్టాడు ఆమె తొడల మీద.

బలమైన దెబ్బే తగిలింది బిందుకు.

కళ్ళ వెంట నీళ్ళు తిరిగే బాధను పళ్ళ బిగువున భరిస్తూ ప్రక్కకు తూలి ఒక పూపొద మీద పడి పోయింది.

ఆ పొదకు రెండు అడుగుల దూరంలో వున్న గార్డెన్ ఛైర్లో కూర్చుని కుతుహలం నిండిన కళ్ళతో పరిశీలిస్తున్నది పెడ్రో ఆ ఫైటింగ్ని.

అంతకు ముందు వరకూ బిందు చూపించిన ఎగ్రెసివ్‌నెస్ దానికి ఎంతో ఆనందాన్ని కలిగించింది. ఇప్పుడు ఆమెకు దెబ్బ తగిలేసరికి ముంచుకు వచ్చింది దానికి పట్టరాని వుక్రోషం.

"బాణా కర్రల్ని పట్టుకొని బరిలోకి దిగినప్పుడు ఎదుటి మనిషి జిత్తులకు లొంగిపోకూడదు. ఏమాత్రం ఏమరిపాటుగా వున్నా కాలో చెయ్యో విరిగిపోవటం ఖాయం... ఇప్పుడు అర్థం అయిందా నా మాట?" తన చేతిలోని కర్రను క్రిందికి దించి, బిందుకు హెల్ప్ చేయటానికి వస్తూ అన్నాడు శ్రీకర్.

జానెడు పొడుగు కూడా లేని తనతోకను నిఠారుగా ఎత్తి చిన్న చిన్న కోరలు బయటికి కనపడేలా గుర్రుమని శబ్దం చేస్తూ గార్డెన్ ఛైర్లోనుంచి క్రిందికి దూకింది పెడ్రో. రెండు గంతుల్లో పోయి అతనికి అడ్డుగా నిలబడింది.

"వాటీజ్ దిస్? వాటీజ్ దిస్ యూ బ్లడీ రోగ్??" ఆశ్చర్యంగా చూస్తూ కసురుకున్నాడు శ్రీకర్.

మరికొంచెం నోటిని తెరిచి ఇంకొంచెం బిగ్గరిగా అరుస్తూ ఛెంగున ఎగిరింది పెడ్రో.

అదిరిపడి వెనక్కి జరిగాడు శ్రీకర్. బాణాకర్రను అడ్డుగా పట్టుకొని దాన్ని అవతలికి నెట్టటానికి ప్రయత్నించాడు.

సమురాయ్ జాతికి చెందిన హంటింగ్ డాగ్ ఆ పెడ్రో.

సిలెబిసీ దీవుల్లో ఒక ఎస్సైన్‌మెంట్ పూర్తి చేయటానికి పోయినప్పుడు దాన్ని, దాని తల్లి జూజీని తీసుకువచ్చాడు షాడో. తీసుకు వచ్చింది అతనే

అయినా, వాటి బాగోగుల్ని చూసేది బిందు మాత్రమే. తన అల్లరితో ఆమెను ఎన్ని విధాల విసిగించినా, పెడ్రోకి ఆమె తన యజమాని.

మరి యజమాని ఆపదలో వుంటే చూస్తూ వూరుకుంటుందా సమురాయ్ జాతికి చెందిన ఏ డాగ్ అయినా??

శ్రీకర్ అడ్డుపెట్టిన బాణాకర్రను తప్పించుకొని గుండెల మీద దూకనే దూకిందది. దూకిన వెంటనే అతని మెడను పట్టుకోవటానికి ప్రయత్నించింది.

"మైగాడ్! దీనికి పిచ్చి ఎక్కింది... కాల్ బాక్ సిస్టర్... కాల్ దిస్ బాస్టర్డ్..." బాణాకర్రను వదిలేసి రెండు చేతులతోను దాన్ని గట్టిగా పట్టుకుంటూ ఖంగారుగా అన్నాడు శ్రీకర్.

"బాణాకర్రను తిప్పటంలో మెలుకువల్ని చూపిస్తానని చెప్పి, దొంగదెబ్బ తీసినప్పుడు ఏమయిపోయింది ఆ ఖంగారు? నువ్వు అరిచి పీక్కున్నా దాన్ని వెనక్కి పిలవను..." ముక్కును ఎగబీల్చి లేచి నిలబడుతూ ఎనౌన్స్ చేసింది బిందు.

"మన సమస్యల్ని మనలో మనమే శాంతియుతంగా పరిష్కరించుకోవాలిగాని యిలా భూతాల్ని, పిశాచాల్ని పంపకం చేయటం బాగుంటుందా? చేయి వదిలితే నా పీక కొరికి నెత్తురు తాగేటట్లుంది ఈ ఇడియట్... ప్లీజ్ బిందూ... నీకు దణ్ణం పెడతాను..." ఉడత పిల్లలా కొట్టుకుంటూ కూడా తన మెడ మీదినుంచి దృష్టిని మరలించని పెడ్రోని దూరంగా వుంచటానికి ప్రయత్నిస్తూ జాలి గొలిపే కంఠంతో వేడుకున్నాడు శ్రీకర్.

"శాంతియుత పరిష్కారాలు, సామరస్య సమాలోచనలు నాకు నచ్చవు. చేతనయితే దాన్ని అవతలికి విసిరేసి పిక్కబలం చూపించు..." తన చేతిలోనే వున్న

కర్రను అవతల పడేసి, పమిటె చెంగుతో ముఖం అద్దుకుంటూ సలహా యిచ్చింది బిందు.

అక్షరాలా ఆచరణలో పెట్టాడు శ్రీకర్ ఆ సలహాని.

బేస్‌బాల్‌ని విసిరినట్లు పెడ్రోని ఒక పొద మీదికి విసిరి ప్రక్కకు పరుగుతీశాడు.

రెట్టించిన క్రోధంతో గుండెలు అవిసేలా అరుస్తూ అతన్ని వెంబడించింది పెడ్రో. పదిక్షణాల్లో అతన్ని సమీపించి ఎడమకాలిని పట్టుకోవటానికి ప్రయత్నించింది.

మూడు అడుగుల ఎత్తున గాలిలోకి ఎగిరి దాన్ని తప్పించుకున్నాడు శ్రీకర్.

"రక్షించు గురూ... ఈ లిటిల్ డెవిల్ బారినుంచి నన్ను రక్షించు..." అని షాడోని పిలుస్తూ ఎడమ చేతివైపు తిరిగాడు.

అతనితో పాటు తను కూడా షార్ప్‌గా టర్న్ కొట్టి, కాళ్ళకు బంధాలు పడినట్లు సడన్‌గా ఆగిపోయింది పెడ్రో.

అక్కడికి పది అడుగుల దూరంలో వత్తుగా పెరిగి వున్న పచ్చిగడ్డి మీద కూర్చుని ఎవరితోనో సీరియస్‌గా మాట్లాడుతున్నాడు షాడో.

అతను అటువంటి మూడ్‌లో వుండగా ఎదుటికి పోయి అల్లరి చేయటం అత్యంత ప్రమాదకరమని పెడ్రోకి అనుభవం నేర్పిన పాఠం.

షాడోని దాటి మరికొంచెం అవతలికి పోయాడు శ్రీకర్. ఎత్తుగా ఎదిగి వున్న ఒక మామిడిచెట్టు మొదలుకు అనుకుంటూ చిరునవ్వు నవ్వాడు.

ఆ నవ్వును చూసేసరికి మరింతగా మండిపోయింది పెడ్రో హృదయం. ఒక్క గంతులో ముందుకు దూకబోయి ఆఖరి క్షణంలో వాయిదా వేసేసుకుంది ఆ ప్రయత్నాన్ని కూడా.

షాడో పాదాల ముందు పడుకొని వుంది పెద్ద పులి వంటి దాని తల్లి జూజీ. అతని ఏకాంతానికి అడ్డు వచ్చిన ఏ ప్రాణినైనా సరే చీల్చి చెండాడేస్తుంది.

షాడోని తప్పించుకోగలిగినా, తన తల్లిని ఎదుర్కునే ధైర్యం లేక గుర్రుగా చూస్తూ అక్కడే బిచాణా వేసింది పెడ్రో. అవకాశం దొరికిన మరుక్షణం తన పంతాన్ని నెగ్గించుకోవటానికి సిద్ధంగా కూర్చుంది ముంగాళ్ళ మీద.

* * * *

"....కత్తిలాంటి పప్పీ అది... పెరిగి పెద్దది అయితే దగ్గిర దగ్గిరగా లక్ష రూపాయలు విలువ చేస్తుంది.." తన ముందు వున్న రమ్ బాటిల్‌ని ఎత్తి పెదవులకు ఆనించుకుంటూ అన్నాడు సిమోగా.

ముందుకు రాలేక, శ్రీకర్‌ని వదిలి పెట్టటానికి యిష్టం లేక పెడ్రో పడుతున్న బాధలనన్నిటినీ కనులచివరనుంచి చూస్తున్న షాడో చిన్నగా నవ్వి తల వూపాడు.

ప్రపంచంలో ఏ మూల ఎటువంటి విచిత్రం జరిగినా వెంటనే ఆ వివరాలు సేకరించి అవసరమైన పార్టీలకు అమ్ముతూ వుండే ఫాక్స్‌కి రైట్ హాండ్ వంటివాడు ఆ సిమోగా.

మనుష్యుల గురించి, వారి మనస్థత్వాల గురించి పూర్తిగా అధ్యయనం చేయవలసిన బిజినెస్ వాళ్ళది.

మానవులతో పాటు వాళ్ళ దగ్గిర మసిలే పెంపుడు జంతువులను గురించి కూడా తెలుసుకోవటంలో వింత ఏముంది?

“ఆల్‌రైట్ మై ఫ్రండ్... మా పెడ్రో గురించి, జూజీని గురించి మాట్లాడేందుకు యిక్కడికి వచ్చావని నేను అనుకోవటం లేదు... అసలు విషయం ఏమిటో ఇప్పటికైనా బయటపడితే బాగుంటుందని భావిస్తున్నాను... మీ బాస్ క్షేమంగానే వున్నాడు గదా!” సిమోగా చేతుల్లో నుంచి రమ్ బాటిల్‌ని అందుకొని తను కూడా రెండు గ్రుక్కలు వేస్తూ అన్నాడు షాడో.

సన్నగా, పొడుగ్గా వున్న టర్కిష్ సిగార్ నొకదాన్ని వెలిగించుకుంటూ ముసి ముసి నవ్వులు నవ్వాడు సిమోగా.

“మా బాస్ నిక్షేపంగానే వున్నాడు షాడో సాబ్... మా దగ్గిర పనిచేసే లఫూట్‌లు అందరూ కులాసాగానే వున్నారు. ఎటు తిరిగీ చక్రూ సిటీలో వుండే నీ ఫ్రెండ్ అహూజా వ్యవహారమే కొంచెం బాగున్నట్లు కనిపించటం లేదు...” సిగార్ పొగను ఆకాశం కేసి వదులుతూ చెప్పాడు.

ఉలికిపాటును కప్పి పెట్టుకోవటానికి విఫల ప్రయత్నం చేస్తూ, పాంటు జేబులో నుంచి పనామా పాకెట్‌ని బయటికి తీశాడు షాడో.

సి.బి.ఐ.లో చేరక ముందు తను దొంగగా జీవితం గడిపిన నాటినుంచి పరిచయం వున్న ఆప్తుడు సిమోగా చెపుతున్న ఆ అహూజా. అవసరం అయితే తన కోసం ప్రాణాలు వదలటానికి కూడా వెనుతీయని దమ్ముగల మనిషి.

“వాటీజ్ ఇట్ మై ఫ్రండ్? ఏమయింది మా అహుజాకి?” హృదయంలోని ఆతృత కంఠంలో ప్రతిధ్వనించకుండా జాగ్రత్తపడుతూ అడిగాడు.

“ఇంతవరకూ ఏమీ కాలేదు షాడో సాబ్... మొన్న సాయంకాలం రంగూన్ సిటీలో వుండే మా రిప్రజెంటేటివ్ దగ్గిరికి వచ్చి షాడో సాబ్‌ని అర్జంటుగా చక్రూ సిటీకి పంపించమని మెస్సేజి యిచ్చాట్ట... మీ పర్సనల్ మేటర్ కావటంతో నేనే స్వయంగా బయలుదేరి వచ్చాను...” రమ్ బాటిల్‌ని దగ్గిరికి తీసుకుంటూ చెప్పాడు సిమోగా.

రకరరకాల అనుమానాలు మనస్సును ఆవరించుకోవటం మొదలు పెట్టేసరికి, ఇబ్బందిగా తల విదిలిస్తూ సిగరెట్ వెలిగించుకున్నాడు షాడో.

బర్మా దేశంలోని చక్రూ సిటీలో మంచి హోటల్ వ్యాపారం చేస్తూ హాయిగా కాలం గడుపుతున్నాడు అహూజా... ఉన్నట్లుండి తనను కలుసుకోవాల్సినంత అవసరం అతనికి ఎందుకు కలిగింది??

“ఆ విషయాన్ని గురించి తెలుసుకునేటందుకు నేను విశ్వప్రయత్నం చేశాను షాడో సాబ్... ప్రయోజనం లేకపోయింది. చక్రూ సిటీకి ఫోన్ చేసి అతన్ని కంటాక్ట్ చేద్దామని చూశాను. ఎన్నిసార్లు రింగ్ చేసినా పలకలేదు. హోటల్‌కి కబురు పంపితే మూడు రోజుల నుంచీ గయిర్ హాజరని తెలిసింది” సిగార్ పొగను రింగులు రింగులుగా పైకి వదులుతూ చెప్పాడు సిమోగా.

మరింతగా అల్లకల్లోలం అయిపోయింది షాడో హృదయం. సగం కూడా కాలని పనామాను అవతలికి విసిరి మరో ఫ్రెష్ సిగరెట్‌ని వెలిగించుకుంటూ, ఎందుకో తలతిప్పి పెడ్రోవంక చూశాడు.

బర్మా దేశంలో పుట్టి పెరిగిన సిమోగా రూపం, అతని మాటలు విచిత్రంగా వుండటంతో శ్రీకర్‌ని మర్చి పోయింది పెడ్రో. సిమోగా కాలుస్తున్న సిగార్‌ని, అతను ఆకాశం కేసి పొగ వూదుతున్న విధానాన్ని ఆశ్చర్యంగా గమనిస్తోంది.

అలా తలను కొంచెం కొంచెంగా పైకి ఎత్తుతున్న సమయంలోనే, శ్రీకర్ నిలుచున్న మామిడి చెట్టు పై భాగంలోనుంచి దాని సునిశిత నేత్రాలకు, కనిపించింది ఒక వస్తువు.

సిమోగా కాలుస్తున్న సిగార్ మాదిరిగానే గుండ్రంగా వుందది. రెండు జానల పొడవు, అరంగుళాల మందం కలిగి, రాకెట్ మాదిరిగా పొగలు విడుస్తూ వస్తోంది.

మెడమీది చిన్ని చిన్ని వెంట్రుకలు వెంట్రుకలు కత్తుల్లా లేచి నిలబడుతుండగా చటుక్కున లేచి చెవులు చిల్లులు పడిపోయేటట్లు అరిచింది పెడ్రో. అరుస్తూనే ఛెంగున ఎగిరి షాడో దగ్గరికి దూకింది.

రెండో ఆలోచన చేయలేదు షాడో. అది అలా ఎందుకు ప్రవర్తిస్తున్నదో, అందుకు కారణం ఏమిటో తెలుసుకోవాలని కూడా అనుకోలేదు.

"జంప్... జంప్ ఎవ్రీబడీ....జంప్..." అని కమాండ్ చేస్తూ కూర్చున్నవాడు కూర్చున్నట్లుగానే వెనక్కి పల్టీ కొట్టి పది అడుగుల దూరం వెళ్ళిపోయాడు.

రెండోసారి ఆ కమాండ్ ని వినాలన్న కోరిక అక్కడ ఎవరికీ కలుగలేదు.

నేలకు చేతులు ఆనించి ఫ్రాగ్ స్కిప్పింగ్ చేస్తూ కన్నుమూసి తెరిచేటంతలో ఒక పూలచెట్టు చాటుకు పారిపోయాడు సిమోగా.

దగ్గిరికి వచ్చిన తన బిడ్డను అమాంతం నోట కరుచుకొని మామిడి చెట్టు క్రింద నిలబడి వున్న శ్రీకర్ కేసి జంప్ చేసింది జూజీ.

దాన్ని పెడ్రోతో సహా గుండెలకు అదుముకొని చెట్టు వెనక్కి దొర్లాడు శ్రీకర్.

దీపావళినాడు వదలబడే తారాజువ్వలా రివ్వున వచ్చి అంతవరకూ సిమోగా కూర్చున్న ప్రదేశంలో నేలను తాకింది ఆ వస్తువు. తాకుతూనే భూనభోంతరాలు దద్దరిల్లి పోయే శబ్దంతో బ్రద్దలైంది.

సుడులు తిరుగుతూ గాలిలోకి లేచింది నల్లటి పొగ.... కనులు మిరుమిట్లు గొలిపేటట్లు ప్రత్యక్షమయింది పెద్ద వెలుగు.

ఆటంబాంబు పడినట్లు అదిరిపోయింది ఆ ప్రదేశం...

ఆ వస్తువును నేలను తాకిన చోట ఏర్పడింది నిలువు లోతున్న గొయ్యి.

* * * *

"ఎందుకు జరిగింది ఇది? ఎవరు చేశారు ఈ పని?" ఆరిపోయిన సిగార్‌ని అలాగే పంటిక్రింద నొక్కిపట్టి వుంచుతూ,ఆ గోతిని చూసి గుర్రుగా అడిగారు కులకర్ణి – సరిగ్గా ఒక అరగంట తరువాత.

యాక్సిడెంట్ జరిగిందని హెడ్ క్వార్టర్స్‌కి రిపోర్ట్ చేసిన బంగ్లా సెక్యూరిటీ గార్డులు తలలు వంచుకొని దూరంగా జరిగి నిలబడ్డారు.

"కనురెప్ప కూడా కదిలించకుండా కాపలా కాయమని చెపితే, ఆర్డర్స్‌ని నిర్లక్ష్యం చేసి నిద్రలు పోతున్నారా?" మరికొంచెం వేడిగా ప్రశ్నించారాయన.

ప్రాణాల మీద ఆశలు వదిలివేసుకున్నారు గార్డులు. బిక్కముఖాలతో షాడో వంక చూశారు.

వారి బాధల్ని గమనించటంలేదతను. అప్పుడే బంగ్లాలో నుంచి వేడివేడి కాఫీ కప్పులతో అటుకేసి వస్తున్న బిందు కేసి చూస్తున్నాడు.

"ముందు కాస్త కాఫీ తీసుకొని ఆ తర్వాత ఎంక్వయిరీలు కంటిన్యూ చేయండి... పాము పారిపోయిన తర్వాత పుట్టను తవ్వినట్లుంది మీ పని..." అంటూ ఒక కప్పును కులకర్ణి గారి చేతిలో పెట్టి షాడోకేసి తిరిగింది.

"సిమోగాని పంపించేశావా?" పెదవుల కదలిక కనిపించకుండా, శబ్దం బయటికి రాకుండా ప్రశ్నించాడు షాడో.

"వాసు వెంటబెట్టుకు పోయాడు... ఎయిర్‌పోర్ట్ దాకా వెళ్ళి విమానం ఎక్కించి గాని తిరిగిరానని చెప్పాడు..." అదే విధంగా సమాధానం యిచ్చింది బిందు, అతనికి కూడా ఒక కప్పును అందిస్తూ.

"సమ్ థింగ్ ఈజ్ రాంగ్ సమ్ వేర్...నాకు అర్థం కాని అంశం ఏదో ఇక్కడ వున్నట్లు అనుమానం కలుగుతోంది...యూ బెటర్ కమవుట్ విత్ ఇట్..." ఉన్నట్లుండి వారికేసి తిరుగుతూ అన్నారు కులకర్ణి.

"నథింగ్ సర్! అటువంటిదేమీ లేదు... బిందు, నేను కాస్త ఏకాంతంగా కూర్చుందామనిపించింది. గార్డుల్ని దూరంగా వెళ్ళిపొమ్మని చెప్పాను... అదును చూసుకొని ఎటాక్ చేశారు శత్రువులు. రెండు మూడు రోజుల్లో వారి జాడల్ని ట్రాక్ చేసి తీరతాను మన వాసు అదే పనిమీద వెళ్ళాడు" గబగబా సమాధానం యిచ్చాడు షాడో.

"నీ మాటల మీద నాకు నమ్మకం లేదు మిస్టర్ షాడో... వేరార్ యువర్ పెట్స్? మీ జూజీ ప్రైడోలు ఎక్కడ??" చుట్టూ చూస్తూ అడిగారు కులకర్ణి.

“షికారుకు వెళ్ళాయి సార్... అవి రోజు ఈ సమయములో రోడ్డు మీద చక్కర్లు కొట్టిరావడం వాటికి అలవాటు. అవే గనక వుండి వుంటే అసలు ఇంతవరకూ వచ్చి వుండేదికాదు కథ...” తడుముకోకుండా వెంటనే బదులు పలికింది బిందు.

కాఫీ త్రాగటం పూర్తిచేసి కోటు జేబులోంచి ఫ్రష్ సిగార్ నొకదాన్ని తీశాడు కులకర్ణిగారు.

“నాలుగు ఫర్లాంగుల దూరం నుంచి ప్రయోగించినా గురి తప్పకుండా టార్గెట్‌ని ఛేదించే హైపవర్ బజూకా మూలకంగా ఏర్పడింది ఆ గొయ్యి. పండుగల సమయంలో కాల్చుకునే బాణసంచా వలన ఏర్పడినట్లు మాట్లాడుతున్నారు మీరు” సిగార్‌ని వెలిగించుకుని గుప్పు గుప్పున పొగను వదులుతూ అన్నారాయన.

సమాధానం యివ్వలేదు షాడో. పెదవి విప్పితే గుండె ల్లోకి రహస్యం ఆయనకు అవగతం అయిపోతుందన్న భయంతో మౌనంగా వుండిపోయాడు.

“ఆల్‌రైట్ మిస్టర్ షాడో! ఈ క్షణం నుంచీ బంగ్లా కాపలాను డబుల్ చేయిస్తాను... నాకు తెలియకుండా ఒక్క గార్డుకూడా తనకు ఎలాట్ చేయబడిన స్థానాన్ని వదిలి అవతలికి వెళ్ళకూడదు” ఉన్నట్లుండి ఎనౌన్స్ చేసి వేగంగా అడుగులు వేశారాయన రోడ్డు మీద నిలబడిన తన అంబాసిడర్ వైపు.

డోర్‌ని తెరిచి పట్టుకుని రెడీగా నిలబడ్డాడు డ్రయివర్ చంద్ర... ఆయన వెనుక సీట్లో ఆశీనులు కాగానే స్టీరింగ్ ముందు కూర్చుని వేగంగా ముందుకుపోనిచ్చాడు.

పోనిస్తూ.... ఒక సెకనులో పదో వంతు కాలం షాడో వంక చూసి, బంగ్లాకు ఎడమ భాగంలో వున్న పెద్ద మర్రి చెట్టుకేసి సైగ చేసి మరీ వెళ్ళిపోయాడు.

అంబాసిడర్ దృష్టిపథం నుంచి దూరం కాగానే పరుగులాంటి నడకతో మర్రిచెట్టు చాటుకు పోయాడు షాడో.

మీద పడబోయిన బజూకాను తప్పించుకోవటానికి ఫ్రాగ్ స్కిప్పింగ్ చేసిన సిమోగా ఫాంటు జేబులోంచి జారి పడిపోయాయి రెండు టర్కి ష్ సిగార్లు.

వాటిని స్వంతం చేసుకుని సిమోగా మాదిరిగానే కాలుస్తూ ఆకాశం కేసి పొగల్ని వదులుతున్నాడు మర్రి చెట్టు వెనుక కూర్చున్న శ్రీకర్. జూజీతోపాటు తన ఎదుట కూర్చున్న పెడ్రోకి ఆనందాన్ని కలిగిస్తున్నాడు.

"వాట్ హేపెన్డ్ యు బ్లడీ ఇడియట్?" అంటూ అతన్ని సమీపించి చిరునవ్వు నవ్వాడు షాడో.... ఆ దృశ్యాన్ని చూసి.

ప్రేలుడు సంభవించిన మరుక్షణం జూజీని కమాండ్ చేసి బజూకా వచ్చిన దిశలోకి పరిగెత్తాడు శ్రీకర్... తమతోపాటు ఎత్తు పల్లాల్లో వేగంగా పరిగెత్తలేని పెడ్రోని చంకలో పెట్టుకొని మరీపోయాడు.

రెండు వందల గజాల దూరం పోయిన తరువాత ఒక పొదచాటున ఆగిపోయింది జూజీ. చిన్నగా అరిచి అతన్ని అటుకేసి పిలిచింది.

బజూకాను ప్రయోగించిన వారెవరోగాని, సరయిన అవకాశం కోసం చాలాసేపు ఓపికగా వెయిట్ చేశారు ఆ పొద దగ్గిర. వాళ్ళు కాల్చిపడేసిన సిగరెట్ పీకల్ని జాగ్రత్తగా హేండ్ కర్చీఫ్ లోకి తీసుకుని తిరిగి వచ్చాడు శ్రీకర్.

“కథ అటు తిరిగి ఇటు తిరిగి బర్మావైపే బయలుదేరుతోంది గురూ... ఇవి ఇండియాలో తయారు చేయబడినవి కావు. బర్మా బ్రాండ్లు...” వాటిని షాడోకి చూపిస్తూ అన్నాడతను.

“సో... అహూజా పంపిన మెస్సేజి మనకు అందించకుండా సిమోగాని ఖతం చేయటానికి ప్రయత్నించారన్న మాట!” సాలోచనగా అన్నాడు షాడో.

“అలా ఎందుకు అనుకోవాలి? సిమోగా మాటలు విని మనం బయలుదేరకుండా ముందు జాగ్రత్తలు తీసుకోబడ్డాయని ఎందుకు అనుకోకూడదు??” సిగార్‌ని కాల్చి సిమోగా మాదిరి పొగ వదలమని మారాం మొదలు పెట్టిన పెట్టిన పెడ్రోని అవతలికి నెడుతూ ఎదురు ప్రశ్నవేశాడు శ్రీకర్.

“ఎలా అనుకున్నా అర్థం ఒక్కటే! అహూజా ఏదో పెద్ద ప్రమాదంలోనే చిక్కుకున్నట్లు అవగతం అవుతోంది” వెంటనే కల్పించుకుంది అప్పుడే అక్కడికి వచ్చింది బిందు.

రెండు నిమిషాలు ఆలోచించి ఆర్డర్స్ యిచ్చాడు షాడో.

“ముఖేష్ దగ్గిరికి వెళ్ళి చక్రూ సిటీకి టిక్కెట్స్ బుక్ చేయించమని చెప్పు. మన ప్రయాణం సంగతి బాస్‌కి తెలియకూడదు.. ఎయిర్ పోర్ట్ నుంచి బెట్టీకి మాత్రం ఫోన్ చేసి అసలు విషయం మెల్లిగా వివరించు... నేను అరగంటలో బయలుదేరి వస్తాను.”

మీద మీదపడి ఫాంటును పట్టుకుని లాగుతున్న పెడ్రోని బిందు కేసి నెట్టి పరుగులాంటి నడకతో పొదల్లోకి వెళ్ళిపోయాడు శ్రీకర్....ఆ ఆజ్ఞలను అక్షరాలా అమలు పరచటానికి.

* * * *

చెవులు చిల్లులుపడేలా హారన్ మ్రోగిస్తూ సడన్ బ్రేకుతో ఆగిపోయింది టాక్సీ. ఓట్టి డబ్బాలో గులకరాళ్ళు వేసి మ్రోగించినట్లు శబ్దం చేస్తున్న ఇంజన్ చటుక్కున మౌనం వహించింది.

టాక్సీ సడన్‌గా ఆగేసరికి, తల్లక్రిందులుగా పల్టీ కొట్టి ముందు సీట్లో పడ్డాడు ఏమరిపాటుగా కూర్చున్న శ్రీకర్.

"వచ్చిన పనిని మరిచిపోయి దిక్కులు చూస్తూ కూర్చుంటే జరిగేది ఇదే. టాక్సీలో కూర్చోవటం కూడా చేతకాని వాళ్ళను వెంటబెట్టుకుని రావటం మనదే బుద్ధితక్కువ" కోపంగా అంటూ అతనికి చేతిని అందించి మళ్ళీ వెనుక సీట్లోకి లాగాడు ముఖేష్.

"ఈ డొక్కు టాక్సీ ఇలా అర్ధాంతరంగా ఆగిపోతుందని నేనేమైనా కలగన్నానా? అసలు ఎందుకు ఆగిందట??" డాష్ బోర్డుకు పోడుచుకుని బొప్పికట్టిన తలను తడుముకుంటూ విసురుగా అడిగాడు శ్రీకర్.

"ఇంజన్ చెడిపోయింది సార్! ఇక ఒక్క అడుగు కూడా ముందుకు కదలదు" ప్రక్కలకు చూడకుండా సమాధానం ఇచ్చాడు డ్రైవరు.

"ఇంజన్ చెడిపోయిందా? చెప్పా పెట్టకుండా ఎలా చెడిపోతుంది? ఏది చూద్దాం??" ఆశ్చర్యంగా అంటూ డాష్ బోర్డుకేసి వంగబోతున్న శ్రీకర్‌ని చూపులతోనే వారించి క్రిందికి దిగాడు షాడో.

"నాటకం గురూ! బండికి ఏమీ కాలేదు... అబద్దం చెబుతున్నాడు దొంగనాయాలు" అతనితోపాటు దిగుతూ రహస్యంగా చెవిలో అన్నాడు శ్రీకర్.

పెదవి విప్పలేదు షాడో. మీటరు ఛార్జీ చెల్లించవ ముఖేష్‌కి సైగ చేసి ముందుకు అడుగు వేశాడు.

అంతవరకూ రోడ్డుకు ఆవలివైపున ఎత్తుగా ఎదిగి వున్న చెట్ల చాటున వెయిట్ చేస్తున్నారు కాబోలు, పరుగు పరుగున వచ్చి వారిని చుట్టేశారు అరడజనుమంది ఆగంతకులు.

"మైగాడ్! మనం ఈ ఏరియాకు కొత్త అని వీళ్ళకు తెలిసిపోయినట్లుంది. దారికాచి మనల్ని దోచుకోవటానికి ప్రత్యక్షం అయ్యారు. కొట్టు గురూ... కొట్టు..." పిడికిళ్ళు బిగించి ఫైటింగ్‌కి రెడీ అయిపోతున్న శ్రీకర్‌ని వారించి వారి ముఖాన్ని పరికించాడు షాడో.

చిరుగులుపడిన దుస్తులు ధరించి, అసహ్యకరమైన అవతారాలతో యాచకుల మాదిరి కనిపిస్తున్నారు వాళ్ళు. దారికాచే దొంగల మాదిరిగా కాదు....

రెండు క్షణాలు కూడా గడవకముందే యదార్థం అయింది అతని వూహ.

"బొమ్మలున్నాయి సార్! బ్రహ్మాండమైన బొమ్మలు ... కారుచౌక సార్! మాతో వస్తే రేటులో కొంచెం కన్సెషన్ యిప్పిస్తాం..." అతని భుజం మీద చేయి వేస్తూ అన్నారు వారిలో యిద్దరు.

అతనికంటే ముందుగా ఆ చేతుల్ని విదిలించికొట్టి ముందుకు జరిగారు మిగిలిన వాళ్ళు.

"వీళ్ళ మాటలు విని అడుగు కదిపారంటే ప్రపంచములో వున్న రోగాలన్నీ మీకే అంటుకుంటాయి. మాతో రండి సార్! పందెపు జింకల దగ్గరికి

తీసుకుపోతాం... జింకలంటే వట్టి జింకలు కాదు... ఇప్పుడే వేయించిన జంతికలు...” అంటూ చేయి పట్టుకొని చెట్ల చాటుకు లాగారు.

ఇంజన్ చెడిపోయిందనే సాకుతో టాక్సీ డ్రయివర్ బండిని ఎందుకు ఆపేశాడో అప్పుడు అర్థమై నెత్తిమీద టపటపా చరుచుకున్నాడు శ్రీకర్.

రకరకాల మోసాలకు పెట్టింది పేరు చక్రూ సిటీలోని ఆ నారంగ్ ఏరియా! కబుర్లు చెప్పినట్లే చెప్పి నెప్పి తెలీకుండా జేబులు ఖాళీ చేయగల వీరాధివీరులతో నిండి వుంటుంది అది.

ఆ సంగతి తెలిసి కూడా అతనెందుకు ముందుకు కదులుతాడు??

శ్రీకర్ ఆలోచనలు పూర్తికాకముందే, పరుగు పరుగున పోయి చెట్ల చాటునుంచి ఒక అందాల బొమ్మను వెంటబెట్టుకు వచ్చాడు రెండవ బాచ్‌లోని సన్నపాటి వ్యక్తి ఒకతను.

“చూడండి సార్! బాగా చూడండి. దశ తిన్నగా లేక ఇలా వీధుల వెంట తిరుగుతోంది గాని, రోల్స్ రాయిస్ కార్లలో తప్ప మరెక్కడా కాలు పెట్టకూడని చిన్నది యిది...! సింగపూర్ చక్కెరకేళి...” ఆమెను షాడో మీదికి నెడుతూ అన్నాడతను.

చటుక్కున ప్రక్కకు తొలిగి ఆమెను మళ్ళీ అతని మీదికే నెట్టాడు షాడో. నెడుతూ నెడుతూ తన వెనుకే వున్న ముఖేష్ కి సైగ చేశాడు.

“మేము జింకల కోసం, జంతికల కోసం యిక్కడికి రాలేదు బ్రదరూ...! ఇంకో పదినిమిషాల సేపు మమ్మల్ని యిక్కడే నిలబెట్టారంటే నిర్మొహమాటంగా వచ్చేస్తారు తాచిన్ పోలీస్ స్టేషన్ కి చెందిన పోలీసులు అందరూ... మాతోపాటు

మిమ్మల్ని కూడా పట్టుకుపోయి లాకప్ గదులలో బొమ్మలు గీయిస్తారు... సింగపూర్ చక్కెరకేళీలు తినిపిస్తారు...” సీరియస్‌గా ముఖం పెట్టి నమ్మకం చెప్పాడతను.

తాచిన్ పోలీస్ స్టేషన్ పేరు వినబడేసరికి అదిరిపడ్డారు వాళ్ళు. ఒకరి ముఖాలు ఒకరు చూసుకుంటూ ఒకేసారి వెనుతిరిగి పిక్కబలం చూపించారు అందాల బొమ్మతో సహా.

పాంటు జేబులోనుంచి పనామాను తీసి వెలిగించుకుంటూ రోడ్డును దాటి చీకటిగా వున్న ఒక పెద్ద సందులోకి అడుగు పెట్టాడు షాడో. వందగజాల దూరం వెళ్ళి ఒక పెద్ద కాంక్రీట్ బిల్డింగ్ ముందు ఆగి చుట్టూ చూశాడు.

“కళ్ళు పొడుచుకున్నా ఏమీ కనిపించని ఈ చీకటి సందులో నిలబడటం దేనికి? కాస్తంత ముందుకుపోయి మంచి హోటల్ ఏదయినా కనిపిస్తుందేమో చూడకూడదూ?” చక్రూ నగరంలో విమానం దిగిన దగ్గర్నించీ ఏమీ పుచ్చుకోకపోవడంవల్ల ఆకలితో నకనకలాడిపోతూ అన్నాడు శ్రీకర్.

ఆ మాటల్ని పట్టించుకోకుండా మరో రెండు నిమిషాలపాటు చుట్టూ వున్న పరిసరాలన్నిటినీ జాగ్రత్తగా పరికించి, ఎదుట వున్న బిల్డింగు వెనుక భాగంలోకి దారితీశాడు షాడో. ఆరు అడుగుల ఎత్తున్న ఒక కిటికీని చేరుకున్నాడతను.

తిండీ తిప్పలు లేకుండా మాడ్చి చంపుతున్న వారిమీద తనకు ఏర్పడుతున్న అభిప్రాయాన్ని సవివరంగా ముఖేష్ చెవిలో చెపుతూ తను కూడా అతన్ని అనుసరించాడు శ్రీకర్.

ఓరగా తెరిచివున్న కిటికీ తలుపును మరికొంచెం తెరిచి లోపలికి తొంగిచూశాడు షాడో. తమ దారికి అడ్డుపడే ప్రమాదం ఏదీ లోపల పొంచిలేదని నిశ్చయం కాగానే ముఖేష్ వైపు తిరిగాడు.

భుజానికి వ్రేలాడుతున్న ఎయిర్ బేగ్‌ని క్రింద పెట్టి, అందులోనుంచి జానెడు పొడుగు కూడా లేని ఒక విచిత్రమైన సాధనాన్ని బయటికి తీశాడు ముఖేష్. పాంటు జేబులోనుంచి రెండు పెన్ టార్చి సెల్స్‌ని ఆ సాధనం ప్రక్కనే వున్న అరలో ఇన్‌సర్ట్ చేశాడు.

వెంటనే పరనిచేయటం మొదలు పెట్టిందది... కొండ రాళ్ళకు చిల్లులు పెట్టే డ్రిల్ వంటి ఇనుప వూచను ముందుకు నెట్టి గిర్రున తిప్పసాగింది.

కిటికీ ఫ్రేమ్‌కి ఆ వూచను ఆనించి వంచిన తల ఎత్తకుండా రెండు నిమిషాల సేపు వర్క్ చేశాడతను. మూడవ నిమిషంలో కిటికీకి వున్న వూచలన్నిటినీ వరుసగా తొలగించి తన సాధనాన్ని ఆఫ్ చేశాడు.

కిటికీ అంచుల్ని పట్టుకుని నిశ్శబ్దంగా లోపలికి జారాడు షాడో. అడుగులో అడుగు వేస్తూ క్రింది భాగంలో వున్న గదులన్నిటినీ గాలించాడు.

"పడుతూ లేస్తూ మనం పరిగెత్తుకొచ్చింది అహూజాని కలుసుకోవటానికి గాని, ఇలా ఇళ్ళలో జొరబడి గాలింపు చర్యలు చేపట్టడానికి అని నేను అనుకోలేదు. ఈ ఇంట్లో వాళ్ళు ఎవరైనా మనల్ని చూస్తే ఏమౌతుందో కొంచెం ఆలోచించారా...?" రెండవ అంతస్థు వైపు అడుగులు వేస్తున్న షాడోని అనుసరిస్తూ, ముఖేష్ చెవిలో గుసగుసలాడబోయి మధ్యలోనే ఆగిపోయాడు శ్రీకర్.

ముందుకు వేస్తున్న పాదాన్ని చటుక్కున వెనక్కి లాక్కుని అతనికేసి తిరిగాడు షాడో ప్రశ్నార్థకంగా చూస్తూ.

"సిగరెట్లు కాల్చి కాల్చి నీ నాసికారంధ్రాలు మొద్దుబారి పోయాయేమో నాకు తెలియదుగాని, సిగరెట్స్ కాల్చబడ్డాయి యిక్కడ. మన రాకను గమనించి హడావుడిగా ఆర్పివేయబడ్డాయి..." ఒక గోడ దగ్గిరికి జరుగుతూ లోగొంతుకతో కామెంట్ చేశాడు శ్రీకర్.

రెండవ అంతస్థులో అడుగు పెడుతుండగానే గ్రహించాడు షాడో ఆ విషయాన్ని శ్రీకర్ అభిప్రాయాన్ని వింటూ ముఖేష్ కేసి చూశాడు.`

"సిగరెట్లను గురించి, సిగార్లను గురించి తరువాత ఆలోచించుకోవచ్చు. ముందు ముంచుకు రాబోతున్న ప్రమాదాన్ని గమనించండి..." పది అడుగుల దూరంలో వున్న ఒక గది వైపు చూపిస్తూ అన్నాడు ముఖేష్.

అతనా మాట అంటుండగానే భళ్ళున తెరుచుకున్నాయి ఆ గది తలుపులు. పొడుగాటి ఐరన్ రాడ్స్‌ని పట్టుకొని బిలబిలలాడుతూ బయటికి వచ్చారు అరడజనుమంది ఆగంతకులు.

ఎవరు, ఏమిటి అనే ప్రశ్నలు వేయలేదు వాళ్ళు. లోపలికి వస్తూనే చేతుల్లోని రాడ్స్ ని గాలిలోకి ఎత్తి స్నేహితుల్ని కమ్ముకున్నారు.

ఒకరి నొకరు హెచ్చరించుకునే వ్యవధికాని, రెండు అడుగులు వెనక్కి వేసి డిఫెన్సివ్ పొజిషన్స్ తీసుకునే అవకాశంగాని లభించక వట్టి చేతులతోనే వారిని ఎదుర్కున్నారు స్నేహితులు ముగ్గురూ.

మీదికి వచ్చిన ఒక వ్యక్తి గుండెల మీద పిడికిలితో పొడిచి వెనక్కి నెట్టాడు షాడో. అదే వూపులో ప్రక్కకు తిరిగి ఫెడీమని డెలివర్ చేశాడు ఒక సైడ్ కిక్‌ని.

ముఖేష్ తలను పట్టుకొని గోడకేసి కొట్టటానికి ప్రయత్నిస్తున్నాడొక ఆగంతకుడు. పది హేను పౌండ్ల హేమర్లా పోయి అతని భుజానికి తగిలిందా దెబ్బ.

కెవ్వున అరిచి ముఖేష్‌ని వదిలేశాడతను... దెబ్బతిన్న భుజాన్ని రెండో చేత్తో నొక్కుకుంటూ షాడో ముందున్న మరో వ్యక్తికి అడ్డం వచ్చాడు.

అతను వదిలేసిన ఐరన్ రాడ్‌ని అందుకొని అడ్డంగా విసిరాడు ముఖేష్. ఇద్దరి నడుముల్ని విరగట్టినంత పని చేశాడు.

చేతికి అందిన ఇంకో వ్యక్తిని అమాంతం గాలిలోకి ఎత్తాడు షాడో. గిరగిరా తిప్పి ఒక కిటికీ కేసి విసిరాడు.

"చచ్చాను...చచ్చిపోయాను... నేను చచ్చిపోయాను" అని అరుస్తూ కిటికీకి కొట్టుకొని క్రింద పడ్డాడతను. పడిన వాడు తిరిగి ఫైటింగ్ లోకి రాలేదు. లేచినట్లే లేచి పిక్క బలం చూపిచాడు.

"వీళ్ళెవరోగాని రన్నింగ్ రేసుల్లో స్పెషలిస్టుల మాదిరి కనిపిస్తోంది... జాగ్రత్త రాజూ... మిగిలిన వాళ్ళు జాగ్రత్త...." అంటూ మిగిలినవారికి అడ్డుపడటానికి ప్రయత్నించాడు ముఖేష్.

మోచేతులతో అతని ముఖం మీద పొడిచి వెనక్కి దూకారు వాళ్ళు . వచ్చిన దారినే లోపలి గదుల్లోకి పోయి అదృశ్యం అయినారు.

"అనుకుంటూనే వున్నాను....వీళ్ళు అన్నంత పనీ చేస్తారని నాకు తెలుసు" అంటూ పట్టుదలగా వారిని వెన్నంటాడు ముఖేష్. పది నిముషాలపాటు పై అంతస్థులోని గదులన్నిటినీ గాలించి వట్టి చేతులతో తిరిగొచ్చాడు.

"మగధాన్ ఏరియాలో నివశించే అహూజా విశ్రాంతి కోసం ఈ బిల్డింగ్‌ని కట్టించుకున్నాడు. దాని అడ్రస్ చాలా రహస్యంగా వుంచాడు. ముక్కు ముఖం తెలియని ఆగంతకులు మన కోసం యిక్కడ వెయిట్ చేస్తున్నారంటే పరిస్థితి మనం అనుకున్న దానికంటె కాంప్లికేటెడ్ అనిపిస్తోంది" ఫైటింగ్ సమయంలో ఒక గోడకు పొడుచుకొని పోటెత్తిపోతున్న భుజాన్ని తడుముకుంటూ సాలోచనగా అన్నాడు షాడో.

"ఊరికే వెయిట్ చేయటం కాదు.. అవరమయితే అతివేగంగా మాయం కావటానికి మార్గాన్ని సిద్ధం చేసుకొని మరీ ఎదురు చూస్తున్నారు దుర్మార్గులు..." అంటూ శ్రీకర్ తమతో లేడని గ్రహించి ఖంగారు పడ్డాడు ముఖేష్.

"వేరార్యూ శ్రీకర్? ఆర్ యూ ఆల్ రైట్?" కనులు చిట్లించి చుట్టూ చూస్తూ అతన్ని పిలిచాడు.

"ఆల్‌రైట్‌గా వుండక ఏమైపోతానని మీ వుద్దేశ్యం? గంటనుంచీ ఎదురుచూస్తున్నాను మీ కోసం రండి రండి – తొందరగా రండి" వెంటనే వినవచ్చింది శ్రీకర్ కంఠం మెట్ల క్రింది నుంచి.

అడుగుకు ఆరు మెట్ల చొప్పున దిగుతూ క్రిందికి చూశారు షాడో, ముఖేష్.

"వెనకాల్నించి దొంగ దెబ్బ కొట్టి పారిపోయాడు ఒక రాస్కెల్... వీడు కూడా శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నాడు అతన్ని అనుసరిచటానికి..."

మెట్లకు అడ్డముగా పడున్న ఒక ఆగంతకుడి గుండెల మీద కూర్చొని వారికేసి తిరుగుతూ అన్నాడు శ్రీకర్.

నిజంగానే పారిపోయే అవకాశం కోసం శక్తివంచన లేకుండా ఎదురు చూస్తున్నాడా ఆగంతకుడు. అనుకోని విధంగా లభించిందది శ్రీకర్ ప్రక్కకు తిరిగేసరికి.

అడ్డంగా వున్న కాళ్ళను చటుక్కున పైకి ఎత్తి ఫెడీమని తన్నాడు శ్రీకర్ వెన్ను మీద. అదే వూపులో ఒక చేతిని పైకి ఎత్తి అతని ముఖం మీద పొడిచాడు.

ఎదురుచూడని ఆ ఎటాక్ కి తడబడి తల్లక్రిందులై పోయాడు శ్రీకర్. అతని మీది నుంచి ఎగిరి ఒక గోడకు గుద్దుకున్నాడు.

“మైగాడ్! పట్టుకో... పట్టుకో శ్రీకర్...” అని అరుస్తూ మెట్లమీది నుంచి జంప్ చేసి ఆ వ్యక్తి మీద పడటానికి ప్రయత్నించాడు ముఖేష్.

అప్పటికే అవతలికి దొర్లి లేచి నిలుచున్నాడతను. ఒకసారి చుట్టూ చూసి వింటినుంచి వెలువడిన బాణంలా వారు తయారుచేసిన మార్గం గుండా బయటికి జారుకున్నాడు.

“చేతికి దొరికిన మనిషిని గట్టిగా పట్టి వుంచలేని బచ్చాలు కూడా వీరాధి వీరుల మాదిరిగా కాలర్లు ఎత్తుకు తిరగటమే... దొంగ దెబ్బల తాకిడికి తల్లక్రిందులై పోయేవాళ్ళు కూడా పెద్ద పోటుగాళ్ళ మాదిరి పోజులు వెయ్యటమే” అంటూ పట్టిన పట్టు వదలకుండా కిటికిలో నుంచి బయటికి దూకాడు ముఖేష్.

ఆ సరికి ప్రహరీ గోడమీది నుంచి అవతలికి చేరుకున్నాడు ఆ ఆగంతకుడు. పాదాలకున్న హవాయ్ స్లిప్పర్స్‌ని విదిలించికొట్టి వేగంగా పరుగులు తీయటానికి రెడీ అవుతున్నాడు.

"వదిలి పెట్టకూడదు... వాడిని వదిలిపెట్టటం అంటూ జరిగితే కథ పూర్తిగా అడ్డం తిరుగుతుంది... బై హుక్ ఆర్ క్రూక్ వాడిని పట్టుకొని తీరాలి..." ఎడమ చేతిని ప్రహరీకి ఆనించి ఎగురుతూ, తన వెనుకే వస్తున్న శ్రీకర్‌ని హెచ్చరించాడు ముఖేష్.

బిల్డింగ్ వెనుక భాగంలో నుంచి ముందుకు పోయి, భుజాల మీది నుంచి వారిని గమనించాడా ఆగంతకుడు.

పది గజాల దూరం పరిగెత్తినట్లే పరిగెత్తి వున్నట్లుండి నోటిని తెరిచాడు – "దొంగలు.. దొంగలు... రక్షించండి నన్ను దొంగలు తరుముకొస్తున్నారు... రక్షించండి..." అంటూ.

పెదవులు బిగించి బిల్డింగు ముందుకొస్తున్న స్నేహితులు ముగ్గురూ అదిరిపడ్డారు కరెంట్ షాక్ కొట్టినట్లు.

"దొంగలు బాబోయ్ దొంగలు... రక్షించండి... నన్ను రక్షించండి..." పరుగు ఆపకుండా మరింత పెద్దగా అరిచాడతను.

నిశబ్దంగా వున్న ఆ సందులో చెవులు చిల్లులు పడేటట్లు ప్రతిధ్వనించిందా అరుపు. అటూ ఇటూ వున్న బిల్డింగులకు తగిలి.

పది క్షణాలు కూడా గడవకముందే కిరకిరమని శబ్దాలు చేస్తూ తెరుచుకున్నాయి ఇళ్ళ తలుపులు.

“ఎవరు? ఎవరలా అరుస్తోంది? అని ప్రశ్నిస్తూ సందులోకి వచ్చేశారు అనేకమంది పౌరులు.

ముందుకే పోవాలని చూస్తున్న శ్రీకర్, ముఖేష్‌ల చేతులు పట్టుకొని బలవంతంగా వెనక్కి లాగాడు షాడో.

“అరుగో... అరుగరుగో...” పరిగెత్తటం మాని వెనక్కి చేయి చూపిస్తూ ఇంకోసారి తన బాధను వెళ్ళబోసుకున్నాడా ఆగంతకుడు.

పళ్ళు కొరుకుతూ వెనక్కి తిరిగారు పౌరులందరూ... పిడికిళ్ళు బిగించి కొందరు క్రింద కనిపించిన రాళ్ళను అందుకొని మరికొందరు వేగంగా పరిగెత్తుకొచ్చారు స్నేహితులవైపు.

“నీట్‌గా ప్లేట్ ఫిరాయించాడు దొంగరాస్కెల్... ఇప్పుడు మనం ఏం చెప్పినా వీళ్ళ బుర్రలకి ఎక్కదు... చేతులకు దొరికితే మన కాళ్ళు చేతులు మనకి దక్కవు...” నెత్తిమీద చరుచుకొని వాపోతున్న శ్రీకర్ భుజాన్ని పట్టుకొని ముందుకు నెడుతూ వేగంగా పరిగెత్తి, ఎదుట కనిపించిన ఒక చిన్న మలుపులోకి తిరిగాడు షాడో.

మలుపును ఆనుకొని వున్న ప్రహరీగోడ మీదినుంచి ఒక ఆవరణలోకి దూకి, తనతోపాటు జంప్ చేసిన శ్రీకర్, ముఖేష్‌లను గోడవారగా కూర్చోమని సైగచేశాడు.

అరుపులతో, కేకలతో ఆ ఏరియా మొత్తాన్ని నిద్రలేపుతూ గుంపు కట్టి అటుగా వచ్చేశారు జనం.

ముందు వరుసల్లో వున్నవారిని పదిగజాల దూరం పోనిచ్చి, వెనుక వరుసల్లో వున్నవారు మలుపులోకి తొంగిచూడకముందే, వారందరికంటే పెద్దగా గొంతుచించుకొని అరిచేశాడు షాడో.

"దొంగలు... దొంగలు... గోడ ప్రక్కగా పడి పారిపోతున్నారు... పట్టుకోండి పట్టుకోండి..." అని హెచ్చరిస్తూ, అసలు విషయం అర్థం అయ్యేలోపుగా గోడను దాటి వారిలో కలిసిపోయాడు.

మరింత గగ్గోలుగా అరుస్తూ రెట్టించిన వేగంతో ముందుకు కదిలిపోయింది గుంపు....

అహూజా బిల్డింగ్ వరకూ ఆ గుంపుతో కలిసి వెనక్కి వచ్చాడు ఆ ఆగంతకుడు. సందు చూసుకొని చల్లగా వెనక్కి తిరిగాడు, వెంటపడిన శత్రువులను ఏమార్చగలిగిన తన తెలివితేటలకు తనే మురిసిపోతూ పెద్ద పెద్ద అడుగులతో ప్రయాణం కొనసాగించాడు.

తన తెలివితేటల ముందు తలవంచిన శత్రువులు వంద గజాల దూరంలో నిశ్శబ్దంగా అనుసరించి వస్తున్నారని గ్రహించటం చేతకాక, రెండు గంటల తరువాత దీదాన్ ఏరియాలో వున్న ఒక పెద్ద భవంతిలోకి పోయి అదృశ్యం అయినాడు.

** ** **

"ఎవరు మీరు? ఇక్కడ ఏం చేస్తున్నారు??"

ఖంగుమంటున్న కంఠంతో ప్రశ్నిస్తూ ఒక వ్యక్తి ఎదుట ప్రత్యక్షం అయ్యేసరికి అదిరిపడి ఎక్కడివారక్కడ ఆగిపోయారు స్నేహితులు.

“ఎవరు మీరని అడుగుతుంటే వినిపించటం లేదా?” మరికొంచెం ముందుకు జరుగుతూ కరుకుగా ఇంకోసారి ప్రశ్నించాడతను.

తాము అనుసరించి వచ్చిన ఆగంతకుడు వందగజాల దూరంలో వున్న భవంతిలోకి పోవటాన్ని చూసి వేగంగా అడుగులు వేస్తున్నారు వాళ్ళు. భవంతి సమీపంలోకి చేరుకోకముందే అడ్డంకులు ఎదురవుతాయని వూహించలేదు.

“ఇక్కడ... ఇక్కడ... నాలుగో నెంబర్ ఇంట్లో మా బావమరిది వుంటున్నాడు... అతనికి వంట్లో బాగోలేదని కబురు వచ్చింది...” తమ ఉలికిపాటు ఆ వ్యక్తి కనులపడకుండా సమాధానం యిచ్చాడు శ్రీకర్.

“నాలుగో నెంబర్ ఇంటిని దాటి ఆరఫర్లాంగు వచ్చేశారు... వెనక్కి వెళ్ళండి... ఇక్కడినుంచి పబ్లిక్ రోడ్డు లేదు...అనుమతి లేకుండా ఎవరూ ఇటుగా రాకూడదు...” వారు. వచ్చిన దారివైపు చేయి చూపిస్తూ చెప్పాడతను.

“చాలా థేంక్స్ సార్... ఈ చీకట్లో అడ్రసులు చెప్పటానికి మనిషి దొరకటం మా అదృష్టం... థేంక్యూ వెరీమచ్...” అంటూ వెనక్కి తిరిగినట్లే తిరిగి పడికిలితో అతని ముఖంమీద పెడిచాడు శ్రీకర్.

ఎదురుచూడని ఆ దెబ్బకు విస్తుబోయి పెద్దగా అరవటానికి నోరు తెరిచాడా వ్యక్తి.

పిడికిళ్ళు రెంటినీ కలిపి అతని శిరస్సుమీద మోదాడు షాడో.

తెరిచిన నోటినుంచి శబ్దం బయటికి రాకముందే మొదలు నరికిన చెట్టులా విరుచుకు పడిపోయాడా వ్యక్తి.

క్రింద పడకుండానే గట్టిగా పట్టుకొని చీకటితో నిండి వున్న ఒక డస్ట్‌బిన్ చాటుకు లాక్కుపోయాడు ముఖేష్ అతన్ని. బయటికి కనిపించకుండా డస్ట్‌బిన్ లోని చెత్తా చెదారాన్ని అతని మీదికి విదిలించి చేతులు దులుపుకుంటూ వచ్చాడు.

నడకలో ఎటువంటి తొట్రుపాటు కనిపించకుండా సూటిగా ముందుకు పోయాడు షాడో.

భవంతి ప్రక్కభాగంలో కూర్చుని కునికిపాట్లు పడుతున్నారు మరో ఇద్దరు గార్డులు. అడుగుల చప్పుడు వినబడగానే చటుక్కున లేచి వారికి అడ్డం వచ్చారు.

పళ్ళు కొరుకుతూ కనులు ఎర్రచేసి ఫెడీమని కొట్టాడు షాడో ఒకతని చెంపమీద.

"వళ్ళు దగ్గిర పెట్టుకొని కాపలా కాయమని చెపితే హాయిగా పడుకుని నిద్రలు పోతున్నారా? ఎంత ధైర్యంమీకు? బ్రతకాలని లేదా?" కరకరలాడుతున్న కంఠంతో ప్రశ్నించాడు.

ఎర్రగా వాతలు తేలిన చెంపను తడుముకుంటూ నోరు తెరుచుకొని నిలబడిపోయాడా గార్డు.

"నిద్ర ముఖాలతో నిలబడటమే కాకుండా మీ సుపీరియర్స్‌కి విష్ చేయటం కూడా మరిచిపోయారన్నమాట! పెద్ద గదిలో పడేసి పది కొరడా దెబ్బల్ని రుచి చూపించక పోతే ఇక లాభం లేదు... కమాన్... బ్రింగ్ దీజ్ బాస్టర్డ్స్..." రెచ్చిపోయి అరుస్తూ తన వారికి సైగచేశాడు షాడో.

అక్కడికి అతనేదో కొమ్ములు తిరిగిన పెద్ద సుప్రీమ్ లీడర్ అయినట్లు, తాము అతనికి ఫెయిత్ ఫుల్ అసిస్టెంట్స్ అయినట్లు, ఫోజు పెడుతూ ముందుకు

దూకారు వాళ్ళు. చెంపదెబ్బ తిన్న గార్డుతో పాటు అతని సహచరుడి చేతుల్ని కూడా విరిచిపట్టుకొని భవంతివైపు లాగారు.

నెత్తి నోరు కొట్టుకున్నంత పని చేస్తూ చేతుల్ని వదిలించుకొని మోకాళ్ళ మీదికి వాలిపోయారు వాళ్ళిద్దరూ. చీకటి మూలకంగా సరిగ్గా చూడలేక పోయామని, ఈ ఒక్కసారికి క్షమించమని అర్థం వచ్చే మాటలతో లభలాడుతూ కన్నీరు పెట్టుకున్నారు.

రెండు నిముషాల పాటు సీరియస్‌గా ఆలోచించి తల వూపాడు షాడో.

"చీకటిగా వుంది గాబట్టి ఈసారికి వదిలేస్తాను... ఇంకోసారి యిలా జరిగితే ఎముకలు చూర్ణం చేస్తాను... లోపల ఎవరెవరున్నారు??" మాటలో మాటగా తనకు కావాల్సిన సమాచారం కోసం వల విసిరారు.

పోతూ పోతూ వున్న ప్రాణాలు తిరిగి వచ్చినంత పని కాగా, సంబరపడిపోతూ లేచి నిలబడ్డారు గార్డులు .

"మజ్దార్ సాబ్ ఒక్కరే వున్నారు... నిన్న పట్టుకొచ్చిన ప్రిజనర్ దగ్గిర్నించి ఏదో సమాచారాన్ని రాబట్టటానికి ప్రయత్నిస్తున్నారు...." రెండోసారి అడిగించు కోకుండానే గబగబా చెప్పాడు రెండో గార్డు.

ఎగిరి గంతులు వేసి తన వీపును తనే చరుచుకోవాలన్నంత ఆనందంతో ఉక్కిరి బిక్కిరి అవబోతూ, సడన్ గా ఆగిపోయాడు షాడో.

"ఏమన్నావ్ బే? మజ్దార్ సాబ్ లోపల వున్నారా? లోపలే వున్నారా??" తన చెవులు తనను ఏమారుస్తున్నాయేమోనన్న అవమానంతో మరోసారి రెట్టించి అడిగాడు.

“అవును సార్! ఈ రోజు ఉదయం నించీ ఎక్కడికీ కదలకుండా లోపలే వున్నాడు. తనను ఎవరూ డిస్టర్బ్ చేయొద్దని ఆర్డర్స్ కూడా యిచ్చారు” తడుముకోకుండా సమాధానం యిచ్చాడా గార్డు.

లావుపాటి గులకరాయి గొంతుకు అడ్డం పడినట్లు గుటకలు వేస్తూ తల విదిలించి భవంతి గోడకు ఆనుకున్నాడు షాడో.

ఇండియన్ స్పెషల్ బ్రాంచిలో పెద్ద పేరున్న సీనియర్ ఆఫీసర్ ఆ మజ్దూర్. ఎక్కడో ఇండియాలో వుండాల్సిన అతను బర్మాలో ఏం చేస్తున్నట్లు?

స్పెషల్ బ్రాంచి సీనియర్ ఆఫీసర్ను కదిలి రావాల్సినంత నేరం ఏం చేశాడు అహూజా?

షాడో మనసులో మెదులుతున్న ఆలోచనల్ని గమనించి అర్జంటుగా అతని పాదాన్ని తన బూటు కాలితో నొక్కాడు ముఖేష్. అర్థం పర్థంలేని ఆలోచనలతో సతమతం అవుతూ అక్కడే నిలబడిపోతే తమ గుట్టు రట్టు అవుతుందని అతని భయం.

కందిరీగల్లా ముసురుకుంటున్న అనుమానాల్ని అతి ప్రయత్నం మీద ప్రక్కకు నెట్టి ముందుకు అడుగులు వేశాడు షాడో. ముఖద్వారంలోనుంచి ముందు గదిలోకి పోయి ఒక్క ప్రక్కగా నిలబడుతుండగా కనిపించారతనికి రెస్ట్ హౌస్ దగ్గిర్నించి పారిపోయి వచ్చిన హీరోలు అందరూ.

* * *

“అహూజాని మనం మాయం చేసి తీసుకువచ్చినట్లు మనకి తప్ప మరెవరికీ తెలియదు. అతన్ని కలుసుకోవటానికి ఎవరైనా ప్రయత్నిస్తే, ఆ

ప్రయత్నించిన వారందర్నీ బంధించి తీసుకురమ్మని మిమ్మల్ని పంపించాను... చెప్పిన పనిని సజావుగా చేస్తారని మీరు అడిగినంత సొమ్ము యిచ్చాను. ఇప్పుడు మీరు చేసిందేమిటి?" ఎర్రబడిన కనులతో కోపంగా చూస్తూ అడుగుతున్నాడు మజ్దూర్ వారందర్నీ.

"క్షమించాలి సార్....! వచ్చినవాళ్ళు సామాన్యులు కాదు... మేము బంగ్లా లోపల మాటువేసి వున్న సంగతి ముందుగానే తమకు తెలిసినట్లు ఫైట్ చేశారు. చుట్టుపట్ల వున్న పౌరుల్ని రెచ్చగొట్టి వారిని దొంగలుగా చిత్రించటానికి మా వాడు చేసిన ప్రయత్నాన్ని కూడా అతి సులువుగా ఛేదించారు. అటువంటి వాళ్ళని ఎదుర్కోవడం మాకు చేతకాదు... మీరు అనవసరంగా మమ్మల్ని తిట్టటం మర్యాద కాదు..." నిబ్బరంగా నిలబడి మాటకు మాటగా సమాధానం యిచ్చాడు హీరోల నాయకుడు.

పెదవులు బిగించి పిడికిళ్ళను మూస్తూ తెరుస్తూ తన కోపాన్ని తనలోనే అదుముకొని తల వూపాడు మజ్దూర్.

"ఆల్‌రైట్...ఈ ఏరియాలో ఎదురులేని మొనగాళ్ళని భావించి మిమ్మల్ని రిక్రూట్ చేసుకోవటం నాదే తప్పు.... వెళ్ళండి.... వెళ్ళి మీ పనులు చూసుకోండి..." అంటూ గిరుక్కున ప్రక్కకు తిరిగి యింకో గదిలోకి వెళ్ళిపోయాడు.

తమలో తాము గుసగుసలాడుకుంటూ వెనుతిరిగిన హీరోల కంటపడకుండా, తమకు కుడిచేతి ప్రక్కన వున్న ఒక తలుపు చాటుకు జరిగారు స్నేహితులు ముగ్గురూను.

వాళ్ళు ముఖద్వారాన్ని దాటి బయటికి పోగానే షాడో వైపు చూశాడు ముఖేష్.

"వీళ్ళ అభిమానం దెబ్బతిన్నది. కాస్సేపు బయట నిలబడి మళ్ళీ తిరిగి వస్తారు. తమ సత్తాను నిరూపించుకునేందుకు యింకో అవకాశం యివ్వమని మజ్దూర్‌ని ప్రాధేయపడతారు...." సాలోచనగా అన్నాడు షాడో.

"పడితే మనకు పోయేదేముంది? మళ్ళీ ఆ రెస్ట్‌హౌస్ దగ్గిరికి పోయి నాలుగు గంతులు వేసి తిరిగి వస్తారు ఈ లోపల వచ్చిన పని పూర్తిచేసుకొని మనం మాయం అయిపోతాం..." అనబోతూ వులిక్కిపడి ఆ మాటల్ని మింగేశాడు శ్రీకర్.

వాళ్ళు రెస్ట్‌హౌస్ దగ్గిరికి పోతే తమకు ఎటువంటి ప్రమాదమూ రాదు. బయట నిలబడి తర్జన భర్జనలు పడేసమయంలో భవంతి ముందున్న గార్డులు తమ రాకను వెల్లడిస్తే?

గుబగుబలాడుతున్న గుండెల్ని చిక్కబట్టుకొని ముఖద్వారం కేసి చూసిన అతన్ని గమనించి చిరునవ్వు నవ్వుతూ ముందుకు అడుగు వేశాడతను.

బయటికి వెళ్ళినవాళ్ళు తిరిగి లోపలికి రావటం అంటూ జరిగితే ఖచ్చితంగా పది నిముషాల్లో జరిగిపోతుంది... ఈ లోపలే పూర్తి కానిచ్చుకోవాలి తాము వచ్చిన పని!

ముందు గదిని ఆనుకొని వున్న పెద్ద హాలు చివర ఒక టేబుల్ దగ్గిర నిలబడి టెలీఫోన్‌లో మాట్లాడుతున్నాడు మజ్దూర్.

"...రమ్మనండి... రంగూన్‌లో వున్న మన వాళ్ళందర్నీ చక్రూ సిటీకి వచ్చేయమని చెప్పండి... సమ్ థింగ్ ఫిషీ యీజ్ గోయింగ్ ఆన్ హియర్..." అంటూ రిసీవరుని క్రెడిల్ చేసి హాలు వెనుక వున్న గదిలోకి వెళ్ళాడతను.

అతనితోపాటు ముందుకు కదిలి ఆ గదిలోకి తొంగిచూసి ముఖం మీద బలమైన దెబ్బ తగిలినట్లు వులిక్కిపడి వెనుకంజ వేశాడు షాడో.

గది మధ్యలో వున్న ఒక కుర్చీలో బంధించబడి వున్నాడు అహూజా. ఇరవై టన్నుల బరువుకు పైగా ట్రాన్స్‌పోర్ట్ చేసే మిలటరీ ట్రక్కు ఏదో గుద్దుకున్నట్లు దారుణంగా తయారైంది అతని అవతారం...

రక్తపు చారికలతో అసహ్యకరంగా తయారయిన ముఖాన్ని అటూ ఇటూ కదిలిస్తున్న అతన్ని సమీపించి ఫెడీ ఫెడీమని చెంపలమీద కొట్టాడు మజ్దూర్.

"నిన్నటినుంచీ నేను అడిగిన ప్రశ్నలకు సమాధానాలు తెలియవంటూ మొండిగా కాలక్షేపం చేస్తూ వచ్చావ్... నీ కోసం మీ మనుష్యులు వెతుక్కుంటూ వస్తారని, నిన్ను రక్షించి తీరతారనీ విపరీతమైన నమ్మకం పెట్టుకున్నావు" అతని జుట్టు పట్టుకొని తలను వెనక్కి వంచుతూ క్రూరముగా అన్నాడు జ్దూర్.

"నీ మనుష్యులు రావటం, వట్టి చేతులతో వెనక్కి తిరగటం జరిగిపోయింది. ఇక నిన్ను రక్షించగలవాడు యీ భూమి మీద లేడు. కమాన్ మిస్టర్ అహుజా... నా ప్రశ్నలకు సమాధానం చెప్పు..." తలను రఫ్‌గా కదిలిస్తూ ప్రశ్నించాడు.

తన కోసం ఎవరో వచ్చారన్న మాటను వినగానే క్షణంలో పదోవంతు కాలం విచిత్రంగా మెరిశాయి అహూజా కనులు. ఆ కాంతి మజ్దూర్ కంటపడకముందే స్పృహ తప్పిపోయిందతనికి.

పట్టరాని కోపంతో పళ్ళు కొరుకుతూ కుర్చీ ప్రక్కన పెట్టి వున్న ఐరన్ రాడ్ నొకదాన్ని అందుకున్నాడు మజ్దూర్.

అతని ఉద్దేశ్యం అవగతమై ఛెంగున ముందుకు దూకబోయిన శ్రీకర్ భుజాన్ని చటుక్కున పట్టుకున్నాడు షాడో.

"వాడు... వాడు... ఆ దొంగనాయాలు అహూజాకి స్పృహ లేదని తెలిసి కూడా చిత్రహింసలు పెడుతుంటే యింకా చూస్తూ వూరుకోవాలా?" కోపంగా అతన్ని ప్రశ్నించబోయి ఆఖర క్షణంలో ఆగిపోయాడు శ్రీకర్.

శ్రీకర్ భుజం మీది నుంచి చేతిని కదిలించకుండా చుట్టూ చూస్తున్నాడు షాడో.

"ఏమిటి గురూ? ఏమయింది?" రహస్యంగా అడిగాడు శ్రీకర్.

"సమ్ థింగ్ యీజ్ రాంగ్... మనకు అర్థం కాని ప్రమాదం ఏదో ముంచుకు రాబోతున్నదని అనిపిస్తోంది" అదే మాదిరి సమాధానం యిస్తూ, వున్నట్లుండి ఎగిరి వెనక్కి దూకాడు షాడో.

"గెట్ డౌన్... గెట్ డౌన్ ఎవ్రీబడీ..." పెద్ద గొంతుతో వారిని హెచ్చరించాడు.

అనుక్షణం ప్రమాదాల్లో తిరుగుతూ దినదినగండంగా బ్రతికే అతనికి సామాన్యమైన మానవులెవరికీ అర్థంకాని ఒక విచిత్రమైన సిక్స్త్ సెన్స్

అలవడింది. కంటికి కనిపించకపోయినా ముందుగానే అవగతం అవుతాయి ముంచుకొచ్చే ప్రమాదాలు... తప్పించుకొనే అవకాశాన్ని యిచ్చి తీరతాయి.

ఆ సంగతి పూర్తిగా తెలిసిన ముఖేష్, శ్రీకర్ క్షణం కూడా ఆలస్యం చేయకుండా అతనితోపాటు ఎగిరి ఇంకో ప్రక్కకు డైవ్ చేశారు.

వాళ్ళు నేల మీద పడటం నల్లటి రబ్బర్ బంతి వంటి వస్తువు ముఖద్వారం దగ్గర పడి చెవులు చిల్లులుపడే శబ్దంతో బ్రద్దలవటం ఒకేసారి జరిగింది.

* * * *

పది బుల్ డోజర్లు ఒకేసారి వచ్చి గుద్దుకున్నట్లు తీవ్రముగా కంపించింది ఆ భవనం. ప్రేలుడు అదటుకు నామరూపాలు లేకుండా నాశనం అయింది ముందు గది... గాలిలో ఎగురుకుంటూ వచ్చి మధ్య గది నిండా పరుచుకున్నాయి పెద్ద పెద్ద కాంక్రీట్ అచ్చులు.

"ఇక్కడి గోలను ఆలకించి చుట్టుపట్ల వున్న పౌరులందరూ వచ్చి పడేలోపల పూర్తి అయిపోవాలి మన పని...పదండి...లోపలికి పదండి..." ఖంగుమంటున్న కంఠంతో ఆజ్ఞలు జారీ చేస్తూ శిథిలమైన ముఖ ద్వారం దగ్గిర ప్రత్యక్షం అయ్యాడు లావుగా, ఎత్తుగా వున్న ఆగంతకుడు ఒకతను.

నల్లని దుస్తులు ధరించి అతని వెనుకే ప్రత్యక్షం అవుతున్న మరో పదిమంది వ్యక్తుల్ని చూసేసరికి చీమలు పాకినట్లు జలదరించింది ఒక గోడను ఆనుకొని బోర్లా పడి వున్న షాడో శరీరం.

"మజ్దూర్ చేతిలో బంధింపబడి వున్న అహూజా కోసం తామే కాదు... తమకు తెలియని మరో పార్టీ కూడా బయలుదేరి వచ్చింది... ఏ మాత్రం ఆలస్యం చేసినా తమ కళ్ళముందే తమ స్నేహితుడిని ఎగరేసుకుపోతుంది.

ఆ ఆలోచన అతని మనస్సులో మెదలుతుండగానే అతన్ని, మిగిలిన యిద్దర్నీ గమనించారా ఆగంతకులు.

"ఫైర్... ఫైర్..." పెద్ద కంఠంతో ఆర్డర్ యిస్తూ తన చేతిలోని రివాల్వర్‌ని షాడో కేసి తిప్పాడు వారి నాయకుడు.

అదిరిపడి ఒక్క గంతులో లేచాడు షాడో. తల్లక్రిందులుగా పల్టీకొట్టి అహూజా వున్న గదిలో పడ్డాడు.

ప్రేలుడు అదటుకు తల్లక్రిందులై అప్పుడే లేచి నిలబడుతున్నాడు మజ్దూర్. సడన్‌గా ప్రత్యక్షం అయిన పర్సనాలిటీని గమనించి వెర్రిగా అరుస్తూ, పాంటు బెల్టు వెనుక నుంచి తను కూడా లాగాడు ఒక రివాల్వర్‌ని.

"ముందు నుయ్యి వెనుక గొయ్యి అనే మాటకు అర్థం యిదే కాబోలు... కొట్టు గురూ పళ్ళు రాలిపోయేటట్లు కొట్టు" అని అరుస్తూ షాడో వెనుకే ఆ గదిలో జంప్ చేశాడు శ్రీకర్. షాడో కొట్టేదాకా వెయిట్ చేయకుండా తానే కొట్టాడు లాగిపెట్టి – అతని ముఖం మీద.

చేతిలోని రివాల్వర్ ఎగిరి అవతల పడిపోయింది. బాధగా అరిచి తను కూడా ఎగిరి ఒక గోడకు గుద్దుకున్నాడు మజ్దూర్.

బయటి గది దగ్గిర్నించి వస్తున్న బుల్లెట్స్‌కి అందకుండా అటూ ఇటూ జంప్ చేస్తూ తన రివాల్వర్‌తో ఆగంతకుల్ని అడ్డుకున్నాడు ముఖేష్. ముందుకు పరిగెత్తుకుంటూ రాకుండా ఆపాడు.

ఆ కాస్త వ్యవధిలోను బూటు ప్రక్కన బిగించి వున్న డాగర్ని బయటికి లాగి అహూజా కాళ్ళు చేతుల్ని బంధించి వుంచిన తాళ్ళను కోసేశాడు షాడో, స్పృహలేని అతన్ని ఎత్తి భుజం మీద వేసుకుంటూ వెనుక భాగంలో కనిపించిన ఒక ద్వారం వైపు పరిగెత్తాడు.

"మైగాడ్! పారిపోతున్నారు... మనకి కావల్సిన మనిషిని తీసుకొని యిక్కడినుంచి పారిపోతున్నారు...పట్టుకోండి... వాళ్ళని పట్టుకోండి..." ప్రేలుడు అదటుకు పడిపోకుండా వున్న గోడలు అదిరిపోయేలా అరుస్తూ చేతిలోని రివాల్వర్ని వదిలి, వీపుకు వ్రేలాడదీసుకున్న మిషన్ గన్‌ని అందుకున్నాడు ఆగంతకుల నాయకుడు.

చటుక్కున తన రివాల్వర్ని పాంటు జేబులోకి నెట్టేశాడు ముఖేష్. తన పాదాల దగ్గిర కనిపించిన రెండు కాంక్రీట్ అచ్చుముక్కల్ని వారి మీదికి విసిరి ఒక్క సారిగా వెనక్కి తిరిగాడు. అహూజాతో పాటు షాడో శ్రీకర్ బయటికి పోయిన ద్వారం గుండా తను కూడా చీకట్లలోకి పరుగు తీశాడు.

* * * *

"అర్ధరాత్రి సమయంలో అందరూ నిద్రలు పోయే అదనులో బాంబులు ప్రయోగించి దొంగతనాలకు దిగే వాళ్ళని వదిలి పెట్టకూడదు. పట్టుకోండి...

పట్టుకొని కాళ్ళు చేతులు విరగతీసేయండి..." తెల్లటి మీసాల్ని దువ్వుకుంటూ అన్నాడు ఒక పౌరుడు.

ఆగంతకుల నాయకుడు భవనంలోకి ఎంటర్ అవుతూ అనుమాన పడినట్లే జరిగింది. ప్రేలుడు శబ్దాన్ని వినిగుంపులు గుంపులుగా తరలి వచ్చారు ఆ చుట్టుపట్ల వున్న పౌరులు అందరూ.

వారందర్నీ చూడగానే చటుక్కున ప్లేటు మార్చేశాడు ఆగంతకుల నాయకుడు. తమ ఆయుధాల్ని భవంతి చాటున దాచేసి వారితో కలిసిపోయాడు.

"మాటలతో కాలక్షేపం చేస్తే చేజారిపోతారు వాళ్లు... పదండి... పరిగెత్తండి..." అని రెచ్చగొడుతూ షాడో బృందం అనుసరించిన మార్గం వైపు తిప్పాడు.

నూటపది కేజీల బరువున్న అహూజాను అతి ప్రయత్నము మీద మోస్తూ ఫర్లాంగు దూరమే ప్రయాణించ గలిగాడు షాడో. ఒక మెయిన్ రోడ్డును క్రాస్ చేస్తుండగా అతని చెవులకు చేరింది వెనుకనుంచి వస్తున్న జన ఘోష.

ఏదో ఒకటి చేసి వెంటనే తలదాచుకోకపోతే ప్రమాదంలో పడకతప్పదని అతను అనుకుంటుండగానే ఇంకో దిశ నుంచి ముంచుకు రానే వచ్చింది మరో క్రొత్త డేంజర్.

రొటీన్‌గా నైట్ బీట్‌కి బయలు దేరిందొక పోలీస్ జీప్. ఆ ఏరియాను ఆనుకుని వున్న నైట్ రెస్టారెంట్ ఒక దాని దగ్గిర ఆగి టీ తాగుతున్నారు అందులోని నైట్ బీట్ పోలీస్ అధికారులు.

ఉన్నట్లుండి వినవచ్చిన బాంబు మ్రోత, దాన్ని అనుసరించి స్టార్ట్ అయిన రణగొణ ధ్వనుల్ని ఆలకించి సైరన్ మ్రోగించుకుంటూ అటుకేసి వచ్చారు.

"హేయ్... వాటీజ్ దట్? వాట్ యూవార్ డూయింగ్ దేర్?? స్టాప్... స్టాప్..." అని కమాండ్ చేస్తూ జీప్ ని ఆపి క్రిందికి దూకాడొక ఇన్స్ పెక్టర్ షాడోని అతని భుజం మీది ఆకారాన్ని గమనించి.

"కొంపలు అంటుకున్నాయి... పెనం మీద నుంచి సరాసరి నిప్పుల్లో పడ్డాం... ఇప్పుడు ఏమిటి మన కర్తవ్యము??" అటూ ఇటూ చూస్తూ ఆందోళనగా అడుగుతున్న శ్రీకర్ పాదాల మీద ఒక్కతన్ను తన్ని ఎదురుగా వున్న సందులోకి దూరాడు షాడో.

"స్టాప్... స్టాప్ దేర్... స్టాప్..." అని అరుస్తూ అటుకేసి దూకాడు ఆ ఇన్స్పెక్టర్ కూడా.

అతనితోపాటు జీప్ లో వున్న కానిస్టేబుల్స్ కూడా కదలటాన్ని భుజంమీది నుంచి గమనించేసరికి వేపాకు నమిలినట్లు చేదుగా తయారయింది షాడో నోరు.

ఏ క్షణంలోనయినా మెయిన్ రోడ్డును చేరుకోవచ్చు వెనుక వస్తున్న జనసందోహం. దానికి ఈ పోలీసులు కూడా జత కలిస్తే యిక చెప్పటానికి ఏముంటుంది??

"ఆలోచిస్తూ కూర్చుంటే అన్నీ అనుమానాలే వస్తాయి... ముందుకు పద రాజూ! మెలికవేసి తప్పించుకునే మార్గం ఏదయినా కనిపించకపోతుందా?" ధైర్యం చెపుతూ షాడో ప్రక్కనే పరుగుతీస్తున్న ముఖేష్ పాదాలు వున్నట్లుండి ఆగిపోయాయి.

పట్టినపట్టు వదలకుండా సందుల్ని, గొందుల్ని సర్వే చేస్తున్నట్లున్నారు రెస్ట్ హౌస్ దగ్గిర మజ్దూర్ గ్యాంగ్ మెంబర్ రెచ్చగొట్టి రోడ్డు మీదికి తెచ్చిన పౌరులు అంతకుమించి మంచి సమయం మరేదీ దొరకదన్నట్లు అప్పుడే వచ్చారు వాళ్ళు షాడో బృందం అనుసరిస్తున్న సందు చివర వున్న ఖాళీ స్థలంలోకి.

“అయిపోయింది... మన పని ఖతం అయిపోయింది... పోలీసుల చేతికి చిక్కి కటకటాల వెనక్కి పోవటమో, వీళ్ళ చేతుల్లో చావు దెబ్బలు తిని హాస్పిటల్ పాలు అవటమో ఏదో ఒకటి జరిగి తీరుతుంది” నిరాశగా అంటూ ఒక ప్రక్కగా నిలబడబోయి తేలుకుట్టినట్లు ఎగిరి ముందుకు దూకాడు శ్రీకర్.

అటునుంచి కూడా ఇంకేదో ప్రమాదం ఎదురు పడనే పడిందనుకుంటూ కార్నర్ చేయబడిన పెద్దపులిలా బెల్టు వెనుక వుండే రివాల్వర్ మీద చేయి వేశాడు షాడో.

“బంగారంలాంటి మెయిన్ రోడ్డును వదిలి ఈ సందులోకి వచ్చారు... టాంగా ఏదైనా కావాలా సార్?” ముఖమంతా నోరు చేసుకొని నవ్వుతూ ఒక ఇంటి చాటునుంచి బయటికి వచ్చాడొక వృద్ధుడు.

రివాల్వర్ బయటికి లాగి అతనికేసి తిప్పుదామన్న కోరికను బలవంతంగా అణుచుకుంటూ కనులు చిట్లించి చూశాడు షాడో.

వృద్ధుడు వదిలి వచ్చిన ఇంటి చాటున వుంది ఇంకో చిన్న సందు. ఆ సందు మొదట్లో నిలబెట్టి కనిపిస్తోంది పెద్ద టాంగా.

రెండో ఆలోచన చేయలేదు షాడో. రివాల్వర్ మీదిచేతిని తొలగించి అటుకేసి దూకాడు. భుజంమీది అహూజాను టాంగాలోకి దొర్లిస్తుండగా

కనిపించారతనికి మరి కొంతమంది వ్యక్తులు... టాంగాకు కట్టబడిన గుర్రాన్ని కదలకుండా పట్టుకొని చిరునవ్వుతో చూస్తోందొక బర్మా డాల్.

"అయ్యబాబోయ్... వీళ్ళు వాళ్ళే... మనం టాక్సీ దిగగానే జంతికలున్నాయంటూ వచ్చిన పెద్ద మనుషులే వీళ్ళు" ఆందోళనగా అంటున్న శ్రీకర్ నోటిని చటుక్కున మూసి టాంగాలోకి నెట్టాడు వృద్ధుడు.

"పొట్టకూటి కోసం రకరకాల వేశాలు వేయకతప్పదు సార్... వాటిల్లో ఈ టాంగా గాంగ్ వేషం కూడా ఒకటి. అనవసరమైన సందేహాలతో టైమ్ వేస్ట్ చేశారంటే మీతో పాటు మేముకూడా దెబ్బలు తినాల్సి వస్తుంది" అంటూ ఛెంగున ఎగిరాడు టాంగా మీదికి.

అదే సమయంలో టాంగా అశ్వాన్ని వదిలిపెట్టి తను కూడా అతని ప్రక్కకు చేరిందా అందాల బొమ్మ.

కొరడా ఝుళిపించాల్సిన అవసరం లేకుండానే నాలుగు కాళ్ళ సవారీ ప్రారంభించిందా అశ్వం... కన్ను మూసి కన్ను తెరిచేటంతలో వారిని ఆ ప్రదేశం నుంచి దూరంగా తీసుకెళ్ళిపోయింది.

* * * *

చక్రూ సిటీకి ఉత్తర దిశలో వుండే ఒక బద్దుడి ఆలయం ముందు టాంగాను ఆపించి అహూజాని భుజంమీదికి ఎత్తుకున్నాడు షాడో.

"థేంక్యూ వెరీమచ్ మై ఫ్రండ్...థేంక్యూ వెరీమచ్..." అంటూ టాంగా వృద్ధుడికి కృతజ్ఞతలు తెలియచేసుకొని ఆలయ ప్రాంగణంలోకి పోయాడు.

"నీ పేరేమిటి సుందరీ? నీ అంత అందగత్తెను ఇంత వరకూ నేను చూడలేదు..." టాంగా మీది నుంచి దిగకుండా అలాగే కూర్చుని వున్న సుందరిని ప్రశ్నిస్తూ, వాలెట్‌ని తీసి కొన్ని కరెన్సీ నోట్లను ఆమెకు అందించబోయాడు శ్రీకర్.

"పేర్లు తెలుసుకున్నందువల్ల ఒరిగేదేమీ వుండదు. మీ పనేదో మీరు చూసుకోండి" అతని ముఖంలోకి చూడను కూడా చూడకుండా డబ్బుని అందుకొని వృద్ధుడికి అందిస్తూ అన్నదామె.

"నువ్వు చెప్పినా చెప్పకపోయినా మేము చేయబోయేది అదే బేబీ... డోన్ట్ యూ వర్రీ..." అంటూ ఆలయప్రాంగణంలోకి పరిగెత్తాడు శ్రీకర్.

పడిపోవటానికి సిద్ధంగా వున్న ఒక చెక్కల మండపం మధ్యలో అహూజాని పడుకోబెట్టి అతని కోసమే ఎదురుచూస్తున్నాడు షాడో.

"లైటర్ వెలిగించు గురూ! క్విక్..." అంటూ అహూజా ప్రక్కన మోకరించి కూర్చుని నాడి పట్టుకున్నాడు శ్రీకర్.

ఫెయింట్‌గా కొట్టుకుంటున్నది అది... ఏ క్షణంలో నైనా ఆగిపోవచ్చనే అనుమానాన్ని కలిగిస్తోంది.

క్షణం కూడా ఆలస్యం చేయకుండా రక్తపు మరకలతో అసహ్యకరంగా ఆగుపిస్తున్న అతని షర్టును చించి గుండెల మీది మజిల్స్‌అన్నిటినీ మసాజ్ చేశాడు శ్రీకర్. మెదడుకు రక్తాన్ని తీసుకుపోయే కెరోటిడ్ వెస్సల్స్ మీద అతని చూపుడు వేళ్ళు పడగానే చిన్నగా శబ్దం చేసి కనులు విచ్చాడు అహూజా...

లైటర్‌ని పట్టుకొని ఆత్రుతగా తన ముఖంలోకే చూస్తున్న షాడోని గమనించేసరికి వెయ్యి ఏనుగుల బలం వచ్చినట్లు నవ్వాడతను. భుజాలను నొక్కుతున్న శ్రీకర్ చేతుల్ని ఆసరాగా చేసుకొని లేచి కూర్చున్నాడు.

"అనవసరంగా హైరానా పడకు మై ఫ్రెండ్... నీకు తగిలిన దెబ్బలు సామాన్యమైనవి కావు. అతిగా ఎగ్జయిట్ అయ్యావంటే చటుక్కున ఆగిపోతుంది నీ గుండె..." అతన్ని గట్టిగా పట్టుకొని పడుకోబెట్టటానికి ట్రై చేస్తూ హెచ్చరించాడు శ్రీకర్.

"నేను... షాడో సాబ్‌తో మాట్లాడాలి... మాట్లాడిన తరువాత గుండె ఆగిపోయినా సరే.... ముందు మాట్లాడాలి" ఎంతో ప్రయత్నం మీద గొంతును స్వాధీనంలోకి తెచ్చుకుంటూ అన్నాడు అహూజా.

లైటర్‌ని ముఖేష్ చేతికి అందించి అతని ప్రక్కన బాసిపట్టు వేసుకు కూర్చున్నాడు షాడో.

"వాటీజ్ ఇట్ అహూజా?" అనునయంగా అడిగాడు భుజం మీద చేయి వేస్తూ.

"షాడో సాబ్... మీకు మీకు బాంబేలో నివశించే సైంటిస్ట్ మాధుర్ తెలుసుకదా?" ప్రశ్నించాడు అహూజా.

శరవేగంతో ఆలోచించాడు షాడో... అటువంటి పేరు గల సైంటిస్టులెవరూ గుర్తుకు రాలేదతనికి.

ఎండిపోయిన పెదవులను నాలుకతో తడుపుకుంటూ అతని ముఖంలోకే చూస్తున్నాడు అహూజా... సైంటిస్ట్ మాధుర్ ఎవరో తనకు తెలియదని తల అడ్డం తిప్పితే ఆశ్చర్యంతో తిరిగి స్పృహ కోల్పోయేటట్లుంది అతని వాలకం.

"ఎస్ మై ఫ్రెండ్! మాధుర్ ఎవరో నాకు తెలుసు... ప్లీజ్ కంటిన్యూ" ముఖంలో ఎటువంటి భావాలు ప్రస్ఫుటము కాకుండా జాగ్రత్తపడుతూ ప్రాంప్ట్ చేశాడు షాడో.

గుండెల మీది నుంచి పెద్ద బరువు దిగిపోయినట్లు తేలికగా నిట్టూర్చాడు అహూజా.

"వారం రోజుల క్రితం ఒక రాత్రివేళ నా రెస్టారెంట్ కొచ్చాడతను... నేను భారతీయుడినేనని తెలియగానే తన నెవరో తరుముకొస్తున్నారని, తల దాచుకునేందుకు సహాయము చేయమని అర్థించాడు..."

"అసలు విషయం ఏమిటో అర్థంకాకపోయినా అతని ముఖాన్ని చూసి జాలి కలిగి నా రెస్టారెంట్‌లో ఆశ్రయం ఇచ్చాను... ఇచ్చిన రెండు రోజులకు తెలిసింది సాబ్... అతన్ని తరుముతున్నది సామాన్యమైన ప్రమాదం కాదు – బ్లాక్ విడో గాంగ్‌కి చెందిన దాదాలు..."

ఊపిరి బిగపట్టి వింటున్న షాడో అరిచేతులకి చెమట్లు పట్టాయి ఆ మాటల్ని వినేసరికి.

బర్మాదేశంలోని ప్రతి పట్టణంలోను, ప్రతి పల్లెలోను పాతుకుపోయి వున్న రౌడీ గాంగ్ ఆ బ్లాక్ విడో... పెద్ద పెద్ద పోలీస్ ఆఫీసర్లు కూడా ఆ పేరు వినబడితే తలలు ప్రక్కకు తిప్పుకొని తమకేమీ పట్టనట్లు పోతారట.

షాడో మనసులో మెదలటం ప్రారంభించిన ఆలోచనల్ని గమనించకుండా తన మానాన తను చెప్పుకుపోయాడు అహూజా.

"సైంటిస్ట్ మాధుర్‌ని తరుముతున్నది బ్లాక్ విడో గ్యాంగ్ మెంబర్స్ అని తెలియగానే ఏం చేయాలో తెలియలేదు నాకు... ఒక రోజంతా ఆలోచించి రంగూన్‌లో వున్న మీ ఫ్రెండ్ ఫాక్స్ మనుష్యుల్ని కలుసుకున్నాను– మీకు కబురు పంపించాను..."

"అదే పెద్ద తప్పు అయిపోయింది షాడో సాబ్! నా కదలికల్ని పసికట్టి నన్ను కూడా వెన్నంటి వచ్చారు బ్లాక్ విడో రౌడీలు... నా రెస్టారెంట్‌ని ధ్వంసం చేసి మాధుర్‌ని కిడ్నాప్ చేశారు...నన్ను కూడా బంధించేవాళ్ళేగాని ఆఖరి క్షణంలో తెలివిగా తప్పించుకొని నా రెస్ట్ హౌస్‌కి పారిపోయాను" నీరసంగా వెనక్కి వాలి శ్రీకర్‌ని ఆనుకుంటూ వణుకుతున్న చేతిని ఎత్తి షాడో భుజం మీద వేశాడు అహూజా.

"తను బంధింపబడటం అంటూ జరిగితే భారతదేశానికి పెద్ద ప్రమాదం ముంచుకు వస్తుందనీ, పట్టుబడటంకంటే ప్రాణాలు తీసుకోవటమే మంచిదనీ అన్నాడు ఆ మాధుర్ ఆశ్రయం కోరే సమయంలో... ఈ మాట చెప్పటానికే మీకు కబురు పంపించాను సాబ్... అవసరమైన ట్రబుల్‌ని కలిగించాను..." అంటుండగానే కంపించింది అతని కంఠం... స్నానం చేసినట్లు చెమటలతో తడిసిపోయింది శరీరం...

“ఆ మజ్దూర్ రాక్షసుడు కొట్టిన దెబ్బలు సామాన్యమైనవి కావు… వెంటనే మెడికల్ ఎయిడ్ యిప్పించక పోతే ఖతత్ అయిపోతాడు” అతన్ని క్రిందికి వాలుస్తూ ఆందోళనగా అన్నాడు శ్రీకర్.

పాంటు జేబులో చేతులు పెట్టుకొని లేచి నిలబడుతూ ముఖేష్ వైపు చూశాడు షాడో.

“ముందితన్ని ఏదైనా హాస్పిటల్లో చేర్చి ఆ తరువాత ఆలోచిద్దాం… ఆ మాధుర్ ఎవరో నాకు కూడా గుర్తుకు రావటం లేదు” లోగొంతుకతో అన్నాడు ముఖేష్.

రెండో ఆలోచన చేయకుండా అహూజాని చేతుల్లోకి ఎత్తుకొని ఆలయం బయటికి దారితీశాడు షాడో.

పరుగులాంటి నడకతో ఆ వీధి చివరికి పోయి చుట్టూ చూశాడు శ్రీకర్. మూసి వున్న ఒక ఇంటి తలుపుల్ని దబదబా బాది ఇంటి యజమానిని నిద్రలేపాడు.

వెనుకగా వస్తున్న తన స్నేహితులు అక్కడికి వచ్చే సమయానికి లభించింది అతనికి కావల్సిన ఇన్ఫర్మేషన్.

“ఇక్కడికి రెండు ఫర్లాంగుల దూరంలోనే వుందిట పెద్ద నర్సింగ్ హోమ్…పదండి…త్వరగా పదండి…” అంటూ వారిని తొందర పెట్టి అటుగా తీసుకుపోయాడు.

నర్సింగ్ హోమ్ మెయిన్ గేటును సమీపించగానే అహూజాని అతనికందించాడు షాడో. పాంటు జేబులోని వాలెట్ ని అతని పై జేబులో పెట్టాడు.

పది నిమిషాల్లో చేతులు వూపుకుంటూ తిరిగివచ్చి ఖాళీ వాలెట్ ని అతనికి ఇచ్చేశాడు శ్రీకర్.

"వారం రోజులదాకా మాట్లాడలేడు అహూజా. ప్రాణాలకు ప్రమాదం ఏదీ లేదుగాని మామూలు మనిషి అయ్యే సరికి చాలా కాలం పడుతుంది" నర్సింగ్ హోమ్ ప్రహరీ గోడను ఆనుకొని సిగరెట్ కాలుస్తున్న షాడోతో చెప్పాడు.

కందిరీగల్లా ముసురుకుంటున్న ఆలోచనల్ని దూరంగా నెట్టటానికి విఫల ప్రయత్నం చేస్తూ గోడను వదిలి ముందుకు అడుగు వేశాడు షాడో.

మాథుర్ ఎవరోగాని చాలా ఇంపార్టెంట్ పర్సనే అయివుంటాడు... అతన్ని బంధించటానికి బ్లాక్ విడో గాంగ్ ప్రయత్నాలు చేస్తున్నారని తెలిసి రంగంలోకి దిగింది స్పెషల్ బ్రాంచి... ముక్కుకు సూటిగా పోవటమే ముందు వెనుకలు చూసుకోవటం తెలియని ఆ డిటెక్టివ్‌కి అహూజా కూడా తమకు శత్రువే అనిపించి వుంటుంది. అదే అపోహకు గురై వారి ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వకుండా ప్రాణాల మీదికి తెచ్చుకున్నాడు అహూజా... పరిస్థితుల్ని జటిలం చేసి తను నోరు విప్పి మాట్లాడలేని పొజిషన్లో ఇరుక్కున్నాడు... అతను రంగూన్‌లో వుండే ఫాక్స్ రిప్రజెంటేటివ్‌ని కల్సుకుని తనకు కబురు పంపించటాన్ని గురించి తెలుసుకున్నందువల్లే ఢిల్లీలో తమ బంగ్లా మీద ఎటాక్ చేశారు బ్లాక్ విడో

మెంబర్లు... అందులో సందేహం ఏమీ లేదు... మజ్దార్ సాబ్ ఏర్పాటు చేసుకున్న హెడ్ క్వార్టర్స్ మీద దాడి చేసింది కూడా వారే అయి వుండాలి లెక్క ప్రకారం...

ఇంత గందరగోళం చెలరేగటానికి కారకుడు సైంటిస్ట్ మాధుర్.

అసలు అతనెవరు?

అతను పట్టుబడితే తమ దేశానికి వచ్చే ప్రమాదం ఏమటి?

“అర్థంకాని విషయాల్ని గురించి మెదడు పాడు చేసుకున్నందువల్ల ప్రయోజనం ఏమీ వుండదు రాజూ... మన ప్రశ్నలకు సమాధానం లభించాలంటే మనం కూడా ఆ మాధుర్‌ని వెతికి పట్టుకోవాలి... ముందు వెనుకలు చూసుకుండా మన మనిషిని చిత్రహింసలు పెట్టిన ఆ స్పెషల్ బ్రాంచి వాళ్ళ కంటే ముందుగా ఆ పని చేసేయాలి...” అహూజాని హింసించే సమయంలో మజ్దార్ ముఖంలో కదలాడిన రాక్షసత్వాన్ని గుర్తుకు తెచ్చుకొని పళ్ళు కొరుకుతూ సలహా యిచ్చాడు ముఖేష్.

అహూజాని ఎడ్మిట్ చేసిన హాస్పిటల్‌కి రెండు ఫర్లాంగుల దూరంలో కనిపించిన ఒక టెలిగ్రాఫ్ ఆఫీసుకేసి అడుగులు వేస్తున్నాడు షాడో. ఢిల్లీ కి కబురు పంపి హెడ్ క్వార్టర్స్ ని కాంటాక్ట్ చేయాలని అతని వుద్దేశ్యం.

ముఖేష్ మాటలతో మారిపోయిందది. టెలిగ్రాఫ్ ఆఫీసు దగ్గిరే కనిపించిన ఒక టాక్సీని సమీపించి ముందుసీట్లో నిద్రపోతున్న డ్రయివర్‌ని లేపాడు. ఒక ఏరియా పేరు చెప్పి వెనుక సీట్లో కూర్చున్నాడు.

కమ్మటి నిద్ర చెడకొట్టినందుకు అతని మీద విరుచుకుపడబోయి, అతని ముఖంలోని సీరియస్‌నెస్‌ని చూచి భయపడ్డాడు టాక్సీ డ్రయివర్. నోరు విప్పకుండా ఇంజన్ స్టార్ట్ చేసి టాక్సీని ముందుకు దూకించాడు.

* * * *

"అయ్యా... బాబూ... ధర్మం చేయండి... కళ్ళు లేని ఈ కబోది పక్షికి కొంచెం సహాయం చేసి పుణ్యాన్ని సంపాదించుకోండి" ఎడమ చేతిలోని పొడుగాటి చేతి కర్రను నేలకు తాటిస్తూ, కుడిచేతిలోని సత్తు పళ్ళాన్ని ముందుకు జాచి రాగయుక్తంగా అడిగాడు యున్ యన్.

పొద్దు పొడిచి అప్పటికి రెండు గంటలు కూడా పూర్తి కాలేదు. మంజిల్ ఏరియాలోని మెయిన్ రోడ్డు మీద పోతున్న పౌరులు కొందరు జాలిగా చూస్తూ తోచినంత చిల్లర తీసి అతని సత్తు పళ్ళెంలో పడేస్తున్నారు.

"పొద్దు పొడవటం ఆలస్యం...రోడ్డు మీద ప్రత్యక్షం అవుతాడు... వేరే పనేమీ లేదు కాబోలు..." తమలో తాము అనుకుంటూ అతన్ని దాటి ముందుకు పోయారు కొంతమంది.

ఆ మాటల్ని వినేసరికి ఎర్రగా కందిపోయింది యున్ యున్ వదనం. కుడి చేతిలోని సత్తు పళ్ళేన్ని క్రిందపెట్టి చేతికర్రను బిగించి పట్టుకుంటూ వారిని అనుసరించ బోయాడు.

"తొందర పడుతున్నావ్ బ్రదర్... వాళ్ళ జోలికి పోయావంటే నువ్వు కళ్ళులేని కబోదివి కాదని అందరికి తెలిసిపోతుంది. ఎన్నో ఏళ్ళుగా చేస్తూ వస్తున్న

బిజినెస్ క్షణంలో మూలన పడిపోతుంది" లోగొంతుకతో అన్నాడు షాడో ఒక కరెంట్ పోల్ చాటునుంచి.

మెడమీద ఎవరో లాగిపెట్టి గుద్దినట్లు ఉక్కిరి బిక్కిరి అవుతూ చివ్వున అతనికేసి తిరిగాడు యున్ యున్. గుడ్డి వాడిలా నటించటానికి గట్టిగా మూసుకొని వున్న కళ్ళను తెరిచి "అయ్యబాబోయ్ మీరా? మీరిక్కడికి ఎందుకొచ్చారు షాడో సాబ్?" అంటూ ముందుకు రాబోయాడు.

"ఆ గుడ్డివాడికి రెండు నోట్లు యివ్వు శ్రీకర్... ఇవాల్టికి అడుక్కోవటం మానేసి హాయిగా ఇంటికి వెళ్ళి పొమ్మని చెప్పు..." చటుక్కున ప్రక్కకు తిరుగుతూ శ్రీకర్‌కి ఆర్డర్ యిచ్చాడు షాడో.

ఆ మాటల్లో ప్రతిధ్వనించిన అర్జెన్సీని గమనించి తెరిచిన కళ్ళను తిరిగి గట్టిగా మూసేసుకున్నాడు యున్ యున్.

"ధర్మ ప్రభువులు... రెండు నోట్లు యిస్తున్న ధర్మ ప్రభువులు చల్లగా వుండాలి. మీరు అన్నట్లే ఇంటికి వెళ్ళి పోతాను సాబ్... మైగాంగ్ ఏరియాలో వున్న షింటో ఆలయం దగ్గిరికి పోయి దణ్ణం పెట్టుకొని మరీ పోతాను..." రాగయుక్తంగా అంటూ, శ్రీకర్ అందించిన నోట్లను తీసుకున్నాడు. చేతికర్రను నేలకు తాటిస్తూ వీధి చివరికి పోయి అదృశ్యం అయ్యాడు.

"వీడు ఎవరు గురూ? మనకి కావాల్సిన మనిషేనా??" ఆశ్చర్యంగా షాడో ముఖంలోకి చూస్తూ అడిగాడు శ్రీకర్.

సమాధానం యివ్వలేదు షాడో. అక్కడికి వంద గజాల దూరంలో వున్న టాక్సీస్టాండ్ కేసి అడుగులు వేసి,ఒక టాక్సీ డ్రయివర్‌కి మైగాంగ్ ఏరియాలోని షింటో ఆలయం అడ్రసు యిచ్చాడు.

** ** **

"అయ్యబాబోయ్... అహూజా పని అయిపోయిందా? ఆ బ్లాక్ విడోగాళ్ళు అతని రెస్టారెంట్‌ని నాశనం చేసేశారా?" విపరీతమైన ఆందోళనతో కంఠం వణుతుండగా అన్నాడు షింటో ఆలయం వెనుక భాగం ఒక చిన్న పాకలో కూర్చున్న యున్ యున్.

కళ్ళులేని కబోది వేషాన్ని మార్చేసి, అత్తర్లు, ఆగరొత్తులు అమ్మే ఆకారంలోకి వచ్చేసాడతను. పదిహేను సంవత్సరాల వయస్సుండే తన కూతురు తెచ్చిన వేడివేడి చాయ్ కప్పుల్ని అందుకొని షాడో బృందానికి అందించాడు.

చాయ్‌ని సిప్ చేస్తూ అతని ముఖంలోకి నిశితంగా చూశాడు షాడో.

తను చేసే రకరకాల వ్యాపారాల అజాపజా చూడటానికి అనేక రకాల వ్యక్తుల్ని రిక్రూట్ చేసి బర్మా దేశం నలుమూలలకు పంపించాడు గంగారాం. చక్రూ సిటిలో ఈ యున్ యున్‌ని నియమించాడు.

పగటి సమయాల్లో విచిత్రమైన వేషాలతో వూరంతా తిరుగుతాడతను. రాత్రిపూట తన బాస్‌కి సంబంధించిన పనులు చేస్తాడు.

చక్రూ సిటీకి సంబంధించినంత వరకూ ఫాక్స్‌కి గాని అతని కుడి భుజం వంటి సిమోగాకు గాని తెలియని విషయాలు ఏవైనా వుంటే అవి ఖచ్చితంగా తెలిసి తీరుతాయి యున్ యున్‌కి.

"అహూజా రెస్టారెంట్‌లో తల దాచుకున్న సైంటిస్ట్ మధుర్ జాడలు మాకు కావాలి బ్రదర్... అతను ఏమైయాడో, ఎక్కడికి తీసుకుపోబడ్డాడో తెలియాలి...." ఖాళీ అయిన చాయ్ కప్పును క్రింద పెడుతూ చెప్పాడు షాడో.

"అయ్యబాబోయ్... నా కొంపలు ముంచకండి షాడో సాబ్... ఆ బ్లాక్ విడోగాళ్ళకు అడ్డం పడి ప్రాణాలతో యివతలికి వచ్చిన వాళ్ళు ఎవరూ లేరు... దయచేసి యింకేదైనా పని చెప్పండి సంతోషంగా చేస్తాను..." విపరీతమైన ఖంగారుతో అన్నాడు యున్ యున్.

"సైంటిస్ట్ మాధుర్ని బ్లాక్ విడో అపహరించిందని నేను అనలేదు... అతనికి, ఆ గాంగ్‌కి విరోధం వుండి వుండవచ్చనే మాట కూడా నా నోటి వెంట రాలేదు. నీ అంతట నువ్వు సంబంధం అంటగట్టి మాట్టాడటంలో వుద్దేశ్యం ఏమిటి?" చటుక్కున ముందుకు వంగి అతని షర్టును పట్టుకుంటూ వెంటనే అడిగాడు షాడో.

బిక్కముఖంతో తల తిప్పి శ్రీకర్ వంకా ముఖేష్ వంకా చూశాడు యున్ యున్.

ఖాళీ అయిన టీ కప్పుల్ని యింకా చేతుల్లోనే వుంచుకొని సీరియస్‌గా చూస్తున్నారు వాళ్ళు. పెదవి విప్పి ఒక్క మాట కూడా మాట్లాడలేదు.

"నా పీకలు తెగిపోయే వ్యవహారాన్ని గురించి ఆడుగుతున్నారు మీరు.... నన్ను, నా కూతుర్ని సజీవంగా దహనం చేయించే విషయంలో వేళ్ళు పెట్టిస్తున్నారు..." షాడో చేతిలో నుంచి తన షర్టును వదిలించుకునే ప్రయత్నము కూడా చేయకుండా మళ్ళీ తనే అన్నాడు యున్ యున్.

“ఇందులో బలవంతం ఏమీ లేదు బ్రదర్. మర్యాదగా నీ అంతట నువ్వు మాకు కావల్సిన విషయాన్ని బయట పెట్టకపోతే మేమే చేసేస్తాము ఇప్పుడు నువ్వు చెప్పిన పనులన్నిటినీ... బాగా ఆలోచించుకో...” ఉన్నట్లుండి కల్పించుకుంటూ అన్నాడు అంతవరకూ మౌనంగా వున్న ముఖేష్.

బాగా ఆలోచించుకున్నాడు యున్ యున్....

“భారతదేశం నుంచి టూరిస్ట్‌గా వచ్చిన ఒక సైంటిస్ట్ వున్నట్లుండి బ్లాక్ విడో దృష్టిలో పడ్డాడని తెలిసింది నాకు... పారిపోయే మార్గం కనిపించక అహూజా రెస్టారెంట్ పోయాడని కూడా వినవచ్చింది. సంగతి ఏమిటో తెలుసుకుందామని చీకటి పడిన తర్వాత అక్కడికి పోయాను... అప్పుడే ఎటాక్ జరిగింది రెస్టారెంట్ మీద... సైంటిస్ట్ కాళ్ళు చేతులు కట్టేసి ఒక బ్లాక్ టొయోటా కారులో ఇతరీన్ నది వద్దుకు తీసుకుపోయారు వాళ్ళు... అక్కడ వున్న రెఫ్యూజీ కాంప్‌లో దాచిపెట్టారు...” తనంతట తనే గబగబా చెప్పాడు వారికి కావాల్సిన విషయాల్ని .

ఇతరీన్ నది ఒడ్డున వుండే రెఫ్యూజీ కాంప్ పేరు వినేసరికి చలిగాలి వీచినట్లు జలదరించింది షాడో శరీరం.

రెండు సంవత్సరాల క్రితం సడన్‌గా బర్మాదేశంలో ప్రబలింది ఒక విచిత్రమైన అంటువ్యాధి. దాని బారిన పడిన వారందరూ నెలరోజులు కూడా గడవక ముందే రబ్బర్ బెలూన్ల మాదిరి ఉబ్బిపోయి చూడరానంత భయంకరంగా అగుపించసాగారు. అదుపుతప్పి అది దేశమంతా అల్లకల్లోలం చేయకముందే

ముందు జాగ్రత్తలు తీసుకుంది బర్మా ప్రభుత్వం. వ్యాధిగ్రస్తులందర్నీ వెతికి పట్టుకొని ఇతరీన్ నది వద్దకు చేర్చి వైద్యం చేయించటం మొదలు పెట్టింది.

కాలు తగిలినా, వేలు తగిలినా, ఆఖరికి ముఖంలో ముఖం పెట్టి మూడే మూడు మాటలు మాట్లాడినా బ్రహ్మరాక్షసి పట్టుకున్నట్లు అంటుకునే ఆ వ్యాధి పేరు చెపితే చాలు దూరంగా పారిపోతారు అందరూ...

అటువంటి భయంకరమైన ప్రదేశంలోకి మాధూర్‌ని తీసుకుపోవటం ఏమిటి?

"ఆలోచనలతో టైమ్ వేస్ట్ చేయటంకంటే అక్కడికి పోయి అటో ఇటో తేల్చుకోవటం చాలా మంచిది..." ఉన్నట్లుండి షాడో ఆలోచనలకు అడ్డు వచ్చాడు ముఖేష్.

గాఢంగా నిట్టూర్చి తల వూపాడు షాడో యున్ యున్ షర్టును వదిలేసి పాక బయటికి వెళ్ళిపోయాడు.

"చూశావా... కనీసం కృతజ్ఞతలు కూడా తెలియచేయకుండా వెళ్ళిపోతున్నాడు..." తండ్రి ప్రక్కనే నిలబడి అవతలకి వెళ్ళిపోతున్న అతన్ని చూస్తూ అన్నది యున్ యున్ కుమార్తె.

దుస్తుల్లో వున్న బీడీనొకదాన్ని తీసి వెలిగించుకుంటూ తల వూపాడు యున్ యున్.

"పెద్ద రౌడీల మాదిరి పోజు పెట్టి నిన్ను అనవసరంగా బెదిరించారు... ఎదురు తిరిగి రెండు అంటిస్తే వదిలిపోయేది తిక్క..." ముక్కును ఎగబీలుస్తూ మళ్ళీ అన్నదామె.

బీడీ పొగల్ని పాక పై కప్పు కేసి వదులుతూ చిన్నగా నవ్వి తల అడ్డంగా తిప్పాడు యున్ యున్.

"ఎదురు తిరిగి అతన్ని రెండు అంటించే మొనగాళ్ళు నాకు తెలిసినంతవరకూ ఎవరూ లేరు తల్లీ... అతని చిరునవ్వును చూసి మోసపోయావు నువ్వు. నవ్వు మాని తీక్షణంగా చూశాడంటే భస్మమైపోతాం... ఎముకలు కూడా మిగలవు" అన్నాడు.

"అంత మొనగాడా...! మన బాస్ గంగారాం సాబ్ కంటె భయంకరమైన మనిషా?"

"నువ్వు చిన్నపిల్లవు తల్లీ... ఇటువంటి విషయాల్లో యింకా నీకు అనుభవం లేదు. మన బాస్ గంగారాం సాబ్ భయంకరమైన మనిషే! కాదని అనను. అతన్ని బొమ్మలా ఆడించే మనిషి ఇంకొకతను వున్నాడు. అతని పేరు నీకు తెలుసు..."

"అది వేరే విషయం డాడీ! గంగారాం సాబ్‌ని అటూ ఇటూ పరిగెత్తించగల మనిషి ఒక్క షాడోనే అని నువ్వే చెప్పావు. ఆ షాడోని గురించి కాదు గదా మనం మాట్లాడుకుంటోంది...?"

"పిచ్చిపిల్లవు నువ్వు... వచ్చింది ఆ షాడోనేనమ్మా... వంటరిగా కూడా కాదు... అతను తల వూపితే చక్రూ సిటీ నంతా వంటి చేతులతో తగలబెట్టగల తన జతగాళ్ళు ముఖేష్, శ్రీకర్‌లతో సహా వచ్చి వెళ్ళాడు. ఇప్పుడు చెప్పు... నేను భయపడటంలో అసందర్భం ఏమైనా వుందా?" వచ్చింది షాడో అని తెలిసేసరికి అవాక్కయి పోయిందా పిల్ల. తన చేతులతో తనే స్వయంగా అతనికి చాయ్

తయారుచేసి యిచ్చిన విషయం గుర్తుకువచ్చి పట్టరాని సంతోషంతో పరవశమైపోయింది.

* * *

"ఎవరు...?? ఈ వేళప్పుడు వచ్చి తలుపులు తట్టేది ఎవరు...?" విసుగ్గా అడుగుతూ ముఖద్వారం ప్రక్కనే వున్న చిన్న కిటికీలోనుంచి తల బయటికి పెట్టాడు ఇతరీన్ నది వద్దున వుండే రెఫ్యూజీ కాంప్ నైట్ వాచ్‌మన్...

అప్పటికి సరిగ్గా రాత్రి ఏడు గంటలు అయింది సమయము. కాంప్ మొదట్లో గుడ్డిగా వెలుగుతున్న ఎలక్ట్రిక్ బల్బు కాంతిలో అస్పష్టంగా అతనికి కనిపించారు ముగ్గురు డాక్టర్లు.

ఎంతో దూరం నుంచి వస్తున్నట్లు, అంతకు ముందు రాత్రి అంతా నిద్రలేనట్లు నలిగి వడిలిపోయి వున్నాయి వారి వదనాలు. దుమ్ము కొట్టుకొని వున్న దుస్తుల మీద తెల్లటి ఓవర్ కోట్లు ధరించారు వాళ్లు. కొత్తగా కొన్నారు కాబోలు భుజాల మీద స్పష్టంగా కనిపిస్తున్నాయి చక్కటి స్టెతస్కోప్స్.

"గవర్నమెంట్ ఎమర్జెన్సీ ఆర్డర్స్ యిచ్చింది... ఇక్కడి పేషెంట్స్‌ని ఒకసారి పరీక్షచేసి రిపోర్ట్స్ పంపాలి తలుపులు తీయి..." వచ్చిన ముగ్గురిలోకి యంగ్‌గా కనిపిస్తున్న కుర్ర డాక్టర్ గుర్రుగా అన్నాడు.

"పెద్ద పెద్ద మొత్తాలతో జీతాలు తీసుకోమంటే సంతోషంగా తీసుకుంటారు... కాస్తంత చీకటి పడిన తర్వాత పని చేయమంటే మాత్రం ఎక్కడా లేని విసుగంతా మీలోనే కనిపిస్తుంది" తనలో తనే కోపంగా అనుకుంటూ తలుపులు తెరిచి చేతిని ముందుకు జాచాడు వాచ్‌మన్...

“ఇక్కడ వుండే పెద్ద డాక్టరుగారు రెండు రోజులు శలవు పెట్టి ఎక్కడికో పోయారు. అనుమతి పత్రాలు చూపించందే ఎవర్నీ లోపలికి రానీయవద్దని చెప్పారు. ఏవి మీ కాగితాలు?” అంటూ.

భుజం మీది స్టెతస్కోపును ప్రక్కనే వున్న డాక్టర్‌కి అందించి ఒక అడుగు ముందుకు వేశాడు కుర్ర డాక్టర్.

“అనుమతి పత్రాలు కావాలా? ఇవిగో... ఇటు చూడు...” అంటూ కుడి చేతికి పైకి ఎత్తాడు.

అప్రయత్నంగా తలను ఆ చేతికేసి తిప్పాడు వాచ్‌మన్. తిప్పిన మరుక్షణం పిడుగులా ముఖం మీద పడిందొక దెబ్బ.

“చచ్చిపోయాను బాబోయ్.... చచ్చిపోయాను...” అని అరుస్తూ చేతులతో ముఖాన్ని కప్పుకొని మోకాళ్ళ మీద వాలిపోయాడతను.

మరో అరుపు అతని నోటివెంట బయటికి రాకముందే ఛెంగున మీదికి దుమికి మోకాలితో మెడ మీద పొడిచాడు కుర్ర డాక్టర్.

లావుపాటి కొండరాయి మెడకు గుద్దుకున్నట్లు అనుభూతి చెందుతూ స్పృహ తప్పి బోర్లా పడిపోయాడు వాచ్‌మన్.

క్షణం కూడా ఆలస్యం చేయకుండా అతని చేతులు పట్టుకుని ఒక మూలకు లాగేశాడు కుర్ర డాక్టర్. ముఖ ద్వారాన్ని మూసి బోల్టులు బిగిస్తూ మిగిలిన వారి వైపు చూసి నవ్వాడు.

“ఎందుకా వెర్రి నవ్వు? చడీ చప్పుడు లేకుండా పని పూర్తి చేయాలని చిలక్కి చెప్పినట్లు చెప్పి తీసుకువచ్చాం... ఎదుటి మనిషి అరిచి కేకలు పెట్టకుండా

దెబ్బ వేయటం చేతకాలేదని నవ్వుతున్నావా? అతని అరుపు ఎవరికైనా వినబడి వుంటే??" కోపంగా అంటూ ముందుకు అడుగు వేశాడు డాక్టర్ వేషంలో వున్న ముఖేష్.

"దెబ్బ పడగానే వాడు అలా అరుస్తాడని నేను ఏమైనా కలగన్నానా? ఏదో ఒక విధంగా పని పూర్తి చేసినందుకు సంతోషించ కూడదా??" గుర్రుగా అడుగుతూ అతన్ని ఫాలో అయ్యాడు కుర్ర డాక్టర్ గా వచ్చిన శ్రీకర్.

చటుక్కున చేతిని ఎత్తి వారి ఆర్గ్యుమెంట్స్‌కి ఫుల్‌స్టాప్ పెట్టాడు షాడో. పది అడుగుల దూరంలో వున్న మరో తలుపును తెరిచి ముందుకు చూడమని సైగ చేశాడు.

ముఖేష్ భయపడినట్లే అవతలి ప్రక్కన వున్న కాంపౌండ్ లోకి వినిపించింది వాచ్‌మన్ అరిచిన అరుపు.

వరుసల్లో కట్టబడి వున్న రేకుల షెడ్లలోనుంచి ఒకరొకరుగా వచ్చి వరుసగా నిలబడుతున్నారు అంటువ్యాధి పీడితులు.

లావుపాటి మర్రి చెట్ల మాదిరి తయారైన వారి శరీరాల్ని, వికృత రూపాన్ని సంతరించుకున్న వారి ముఖాలని గమనించి అప్రయత్నంగా ఒక అడుగు వెనక్కి వేశాడు శ్రీకర్.

"రోట్లో తల పెట్టి రోకటి పోటుకు వెరవటం దేనికి రాజూ? ముందుకు పోదాం..." షాడోతో అంటూ వాచ్‌మన్ ఎబోడ్ లోనుంచి అడుగు బయటికి వేశాడు ముఖేష్. మౌనంగా నిలబడి వున్న ఆ అవతారాలను సమీపించి చిరునవ్వు నవ్వాడు.

“ఎవరు మీరు? ఎందుకు వచ్చారు??” కనుబొమ్మల్లో నుంచి చూస్తూ కరుకుగా ప్రశ్నించాడు ఒక మహాకాయుడు.

“రెండు మూడు రోజుల క్రితం మా బంధువు ఒకతను ఇక్కడికి తీసుకు రాబడ్డాడు... అతన్ని చూడటానికి వచ్చాం...” తడుముకోకుండా సమాధానం యిచ్చాడు ముఖేష్.

“రెండు మూడు రోజుల క్రితమే కాదు. రెండు మూడు నెలల క్రితం కూడా ఎవరూ యిక్కడికి తీసుకు రాబడలేదు...” వెంటనే వినవచ్చింది ఇంకో కంఠం.

చటుక్కున అటుకేసి చూసిన ముఖేష్ కనులకు కనిపించాడు మరో మహాకాయుడు.

అక్కడి వారందరికీ నాయకుడి మాదిరిగా వున్నాడతను... అడ్డు నిలబడిన వారందర్నీ రఫ్‌గా ప్రక్కకు నెడుతూ ముఖేష్ ముందుకు వచ్చాడు.

“బాగా ఆలోచించుకొని చెప్పండి... తీసుకురాబడిన వ్యక్తి మాకు అత్యంత సన్నిహితుడు... అతన్ని కలుసుకోవటానికి ఏమైనా చేస్తాం మేము... డబ్బు కావాలన్నా యిస్తాము...” ఓవర్ కోటును ప్రక్కకు తొలగించి పాంటు జేబులో నుంచి వాలెట్ ని తీస్తూ అన్నాడు ముఖేష్.

వేగంగా చేతిని జాచి దాన్ని లాక్కున్నాడా మహాకాయుల నాయకుడు. అందులోని నోట్లను తడిమి చూస్తూ ఆలోచనలో పడ్డాడు.

“అతిగా ఆలోచించి శ్రమ పడవద్దు... ఆ డబ్బంతా తీసుకోండి...మా మనిషిని చూపించండి...” ధైర్యం చేసి మరో అడుగు ముందుకు వేస్తూ ప్రాంప్ట్ చేశాడు ముఖేష్.

మరో పదిక్షణాలు ఆలోచించి తల వూపాడతను.

"రండి చూపిస్తాను..." అంటూ వెను తిరిగి అక్కడికి వంద అడుగుల దూరంలో వున్న ఒక రేకుల షెడ్ వైపు దారి తీశాడు.

"వీళ్ళ అవతారాలు భయంకరమైనా మనస్సులు మాత్రం మణిపూసలు. ఇంత తేలికగా మన పని పూర్తి అవుతుందని నేను అనుకోలేదు." అతని వెనకాలేబయలు దేరుతూ భుజం మీది నుంచి షాడోతో గుసగుసలాడాడు శ్రీకర్.

అంతకు ముందు వరకూ ఎంతో ప్రశాంతంగా వున్న షాడో అంతరంగం అల్లకల్లోలం కావటం మొదలు పెట్టింది కారణం సరైనది లేకుండానే.

ఇటీజ్ టూ ఈజీ...

ఎంత డబ్బు యిచ్చినా, ముక్కు ముగం తెలియని వారికి అంత రెడీమెడ్‌గా సహాయ పడాలని వాళ్ళు అనుకోవటంలో తిరకాసు ఏదో వుండి తీరాలి... ఏమిటది??

షాడో ఆలోచనలు ఒక్క కొలిక్కి రాకముందే రేకుల షెడ్‌ని సమీపించి తలుపుల్ని బార్లా తెరిచాడు ఆ మహా కాయుడు.

"లోపల పడుకొని వున్నాడు మీకు కావాల్సిన వ్యక్తి...వెళ్ళి చూడండి..." తను గుమ్మం బయటే వుండి చేయి వూపాడు చీకటితో నిండివున్న లోపలి భాగం వైపు.

"చీకటి దట్టంగా వుంది బ్రదర్... కాస్త ముందు నడిచి దారి చూపించాలి." అతని వెనుక నుంచి అర్థించాడు శ్రీకర్.

“మీరు యిచ్చిన డబ్బు యిక్కడితో సరిపోయింది. డబ్బుతో బాటు నా అడుగులు కూడా ఆగిపోతాయి... ముందుకు పడవు...” వంకరగా నవ్వుతూ అన్నాడు అతను.

“డబ్బే ప్రధానం అనుకుంటే యింకా కొంచెం యిస్తాము బ్రదర్. దారి చూపించు...” అంటూ తన వాలెట్‌ని బయటికి తీశాడు శ్రీకర్.

“వద్దు... వద్దు... డబ్బు విషయం నవ్వుతూ అన్నాను... మీరు లోపలికి వెళ్ళండి... మరేం పరవాలేదు...” గబగబా అన్నాడతను... అంటూ కొంచెం ఆందోళనగా రెండు అడుగులు వెనక్కి వేశాడు.

అతనితో పాటు కదిలాడు శ్రీకర్. భుజం మీది స్టెతస్కోపును అతని కుడిచేతికి చటుక్కున మెలిపెట్టి తాడుతో కట్టి లాగినట్లు రేకుల షెడ్ ద్వారం దగ్గిరికి లాగాడు బలవంతంగా.

చెవి కోసిన మేకలా కీచుగా అరిచి క్రిందికి జారిపోయాడు. మహాకాయుడు. “రండిరోయ్... నన్ను కాపాడండిరోయ్...” బిగ్గరగా కేక పెట్టి వేగంగా అవతలికి దొర్లాడు.

అంతవరకూ దూర దూరంగా నిలబడి వారివంకే చూస్తున్న అక్కడి వ్యాధి గ్రస్తులందరిలోను ఒక్కసారిగా వచ్చింది చలనం.

“కొట్టండి... చంపండి... కాళ్ళు చేతులు విరగతీసేయండి...” అని అరుస్తూ ముందుకు దూకారు.

ఆలోచించుకునే వ్యవధి లేదు... అక్కడి నుంచి అవతలికి పరిగెత్తే అవకాశం అంతకన్నా లేదు. చేయికి చేయి తాకినా, వారి పిడికిళ్ళు తమ ముఖాల్ని

ఏ కొంచెం స్పృశించినా అంతు తెలియని ఆ భయంకర వ్యాధి గురి కావటం తప్పని సరి....

"జాగ్రత్త గురూ.... జాగ్రత్త... బీ మోస్ట్ కేర్ ఫుల్" అని తన వారిని హెచ్చరిస్తూ మహాకాయుడి చేతికి చుట్టి వున్న స్టెత్‌ని గిర్రున తిప్పాడు శ్రీకర్. దగ్గరికి వచ్చిన యిద్దరు వ్యక్తుల గుండెల మీద లాగిపెట్టి తన్నాడు కుడి పాదంతో.

అతని మాదిరిగానే తమ స్టెతస్కోపుల్ని కూడా వడిశెలల మాదిరి గిర్రున తిప్పుతూ గుంపుగా వచ్చిన వారందర్నీ వెనక్కి నెట్టారు షాడో, ముఖేష్.

"దారి చూపించరా నాయనా అని బ్రతిమాలుకుంటే పెళ్ళికొడుకు మాదిరి పోజు పెట్టాడు వీళ్ళ నాయకుడు... అందుకు కారణం ఏమిటో తెలుసుకోవాలి... తన్ను గురూ... లాగిపెట్టి ఒక కిక్ యివ్వు..." అంటూ తన స్టెత్‌ని ఒక వ్యాధిగ్రస్తుడి మెడకు చుట్టి షాడో కేసి లాగి వదిలాడు శ్రీకర్.

తూలుతూ వచ్చిన అతని నడుముమీద ఎగిరి తన్నాడు షాడో తన కుడి బూటుకాలితో.

గింగిరాలు తిరుగుతూపోయి చీకటి షెడ్ ద్వారం మీద పడ్డాడతను. పూర్తిగా లోపలికి పోను కూడా పోలేదు... ఒక చేయి ద్వారబంధాన్ని దాటి అవతలి ప్రక్కన వున్న గచ్చును తాకింది.

అంతే...

గుండెలు జలదరించేలా శబ్దం చేస్తూ బ్రద్దలై పోయింది అక్కడ నిక్షిప్తమైవున్న లాండ్ మైన్ ఒకటి.

నిట్టనిలువుగా పైకి లేచిన మంటలతోపాటు గిరగిరా తిరుగుతూ గాలిలోకి ఎగిరింది పగిలిపోయిన ద్వారం... రాక్షస హస్తం వెదజల్లినట్లు నాలుగు ప్రక్కలకు చెదిరిపోయాయి షెడ్ పైన వున్న రేకులు.

గచ్చుమీద పడిన చేయి పడినంతవరకూ కత్తితో నరికినట్లు కట్ అయిపోగా భీకరంగా అరిచి స్పృహ కోల్పోయాడు షాడో తన్నిన వ్యాధిగ్రస్థుడు.

ఆ దృశ్యాన్ని చూసి కీసర బాసరగా అరుస్తూ చెల్లా చెదురు అయిపోవాలి అక్కడి వారందరూ లెక్క ప్రకారం.

అలా జరగలేదు సరికదా... రెట్టించిన క్రోధంతో పట్టుదలగా ముందుకు దూకారు వాళ్ళు.

అంతకు ముందు మాదిరిగా కొట్టమనో, చంపమనో, కాళ్ళు చేతులు విరగతీసేయమనో అరవలేదు.

"చింపండి...వాళ్ళ దుస్తుల్ని చింపి మన వ్యాధిని వారికి కూడా అంటించండి. మన మధ్యకు వచ్చి మనల్నే హింసిస్తున్నందుకు తగిన శిక్షను విధించండి" అని కేకలు పెడుతూ కమ్ముకున్నారు.

చెమటలు పట్టేశాయి స్నేహితుల అరిచేతులు ఆ కేకలను వినగానే.

"అన్నంతపనీ చేస్తారు వీళ్ళు. ఆ తర్వాత విచారించి ప్రయోజనం వుండదు కమాన్ గురూ! లెటజ్ గెట్ ది హెల్ అవుటాఫ్ హియర్..." అంటూ దూరంలో కనిపిస్తున్న ప్రహరీ గోడవైపు తిరగబోయిన శ్రీకర్ భుజం తట్టి క్రిందినుంచి లేవకుండా అలాగే పడుకొని వున్న మహాకాయుడిని చూపించాడు షాడో.

అతని ఆలోచనను అర్థం చేసుకొని మహాకాయుడి కేసి దూకాడు శ్రీకర్.

అటూ ఇటూ చూసి ప్రేలుడు అదటుకు ఎగిరిపడిన ఒక పొడుగాటి టేకు కర్రను క్రిందినుంచి అందుకున్నాడు షాడో. రెండు చేతులతో నూ దాన్ని బిగించి పట్టుకొని గిర్రున తిప్పుతూ వ్యాధిగ్రస్తులను ఒక్క అడుగుకూడా ముందుకు వేయకుండా అడ్డుకున్నాడు.

విరిగి పడిన షెడ్ గోడల మీదినుంచి ఒక ఇనుప చువ్వను తను తీసుకొని శ్రీకర్ కి కాపలా నిలబడ్డాడు ముఖేష్.

తను చేయబోతున్న దేమిటో మహాకాయుడికి అర్థం అయ్యేలోగా బూటుకాలితో అతని మెడమీద తన్ని స్పృహ తప్పించేశాడు శ్రీకర్. తన ఓనర్ కోటును క్రిందపరిచి అతన్ని దాని మీదికి దొర్లించి చాపలా చుట్టాడు.

"గివ్ మీ ఫైవ్ మినిట్స్ ... ఐదు నిముషాలు చాలు" అంటూ ఆ శరీరాన్ని అతి ప్రయత్నం మీద భుజం మీదికి ఎత్తుకొని ప్రహరీ గోడవైపు పరిగెత్తాడు.

అది చూసి కాంపౌండ్ దద్దరిల్లి పోయేటట్లు అరుస్తున్న వ్యాధిగ్రస్తుల్ని ఖచ్చితంగా ఒక ఐదు నిమిషాలు కదలకుండా నిలబెట్టారు షాడో ముఖేష్. ఐదు నిమిషాల తరువాత గిరుక్కున వెనుతిరిగి తాము కూడా ప్రహరీ కేసి పరిగెత్తారు.

"పట్టుకోండి... వాళ్ళని పట్టుకోండి..." అని కేకలు పెడుతూ తోడేళ్ళ గుంపు మాదిరి వారిని అనుసరించారు వ్యాధిగ్రస్తులు.

వాళ్ళు కాంపౌండ్ వాల్ని చేరుకునేసరికి, గోడ మీది నుంచి అవతలికి దూకి చీకట్లలో కలిసిపోయారు స్నేహితులు. ఇతరిన్ నది వడ్డున రెడీగా వుంచిన బల్ల కట్టు మీద మహాకాయుడిని పడుకోబెట్టి, అవతలి వడ్డుకు బయలుదేరారు.

కాంపౌండ్ వాల్ మీది నుంచి అవతలికి దూకి తాము కూడా నదిని సమీపించారు వృధ్ధిగ్రస్తులు.

బలంగా వీస్తున్న గాలివల్ల అల్లకల్లోలంగా ఎగసిపడుతున్న నదిలోని అలల్ని చూసేసరికి ఆగిపోయాయి వారి పాదాలు. నది మీదినుంచి వచ్చే నీటిగాలి తమ శరీరాలకు సోకనంత దూరంగా నిలబడి, చేతులకు అందిన రాళ్ళు రప్పల్ని బల్లకట్టు మీదికి విసిరారు.

ఎన్ని రాళ్ళు విసిరినా, ఎన్ని తిట్లు తిట్టినా కొంచెం కూడా ఆగలేదా వాహనం. తన మీదికి చేరిన వారిని నిరభ్యంతరంగా అవతలి వడ్డుకు చేర్చింది.

* * *

"....మీరు ఎంత ప్రయత్నించినా నా నోటి వెంట ఒక్క మాటను కూడా పలికించలేరు... కాదు కూడదని నన్ను హింసించటానికి చూస్తే అవకాశం దొరికిన మరుక్షణం అంటుకుంటాను మిమ్మల్ని. జీవితాంతం నా మాదిరిగా బాధపడతారు..." తనకు దగ్గిరిగా నిలబడిన ముఖేష్ వైపు చూస్తూ గుర్రుగా అన్నాడు మహాకాయుడు... అంటూనే ఖాండ్రించి అతని మీద ఉమిశాడు.

ముఖేష్ వెనుకే నిలబడి వున్నాడు శ్రీకర్. మహా కాయుడి ముఖంలోని ఫీలింగుల్ని జాగ్రత్తగా అబ్జర్వ్ చేస్తున్నాడు. అతను ఉమ్మివేయటానికి రెడీ అవుతుండగానే ముఖేష్ చేతిని పట్టుకొని బర్రున వెనక్కి లాగేశాడు.

తను చేసిన ప్రయత్నం విఫలం అవటాన్ని గమనించి బాధపడలేదా మహాకాయుడు. వినోదంగా చూస్తూ విచిత్రంగా నవ్వాడు.

“నా మాటలు ఇప్పుడు బాగా అర్థం అయివుండాలి మీకు నేను ఎంత ప్రమాదకరమైన మనిషినో యిప్పుడు తెలిసి వుండాలి” అప్రయత్నంగా వెలువడ్డాయి గర్వంతో కూడిన ఆ మాటలు అతని నోటివెంట.

“యువార్ కరెక్ట్ బ్రదర్! నువ్వు ప్రమాదకరమైన మనిషివే ననటంలో అసందర్భం ఏమీ లేదు. కానీ స్పృహ లేని సమయంలో నీ కాళ్ళు చేతుల్ని కదలకుండా కట్టిపడేశామన్న సంగతిని మర్చిపోయి మాట్లాడుతున్నావు... నాలుగు రోజులు తిండి తిప్పలు లేకుండా చేస్తే నీ అంతట నువ్వే దారికి వస్తావు...” అతని ముఖంలోకి నిశితంగా చూస్తూ అన్నాడు శ్రీకర్.

“మాకు ఆకలిదప్పులు వుండవు. నాలుగు రోజులు కాదు – నాలుగు వారాలయినా ఏమీ కాదు...” సగర్వంగా సమాధానం యిచ్చాడతను.

ఆ మాటల్లో అసత్యం ఏదీ లేదని గ్రహించి గాఢంగా నిట్టూర్చాడు షాడో.

వారికి అంటుకున్న వ్యాధి యొక్క ప్రత్యేకతే అది!!

ఆకలి వుండదు. దప్పిక వుండదు... అన్నం నీళ్ళు లేకుండా ఎంత కాలమయినా అలాగే వుండగలరు. ఉండి ఉండి ఎప్పుడో బెలూన్ మాదిరి ఠప్ మని ఎగిరిపోతారు.

తనకు ఎప్పుడో ఒకప్పుడు చావు తప్పదని ఖచ్చితంగా తెలిసిన మనిషి అతను. అటువంటి వాడిని అతని యిష్టానికి వ్యతిరేకంగా మాట్లాడించటం ఎలా??

షాడో మనస్సులో మెదలుతున్న ఆలోచనల్ని గ్రహించి చిన్నగా నవ్వుతూ వెనుతిరిగాడు శ్రీకర్.

“ఎక్కడికి? ఎక్కడికి పోతున్నావ్ యూ బ్లడీ యిడియట్??” ఉలిక్కిపడి అతని చేతిని పట్టుకుంటూ అడిగాడు ముఖేష్.

“ఎప్పుడో పూర్వజన్మలో చేసిన పాపానికి ప్రతి ఫలంగా విరుగుడు లేని వ్యాధిని కొని తెచ్చుకున్నాడు ఈ పెద్దమనిషి. చేసిన తప్పులకు పశ్చాత్తాపపడితే వచ్చే జన్మలోనయినా ఆరోగ్యకరమైన పుటక లభిస్తుందని తెలియక ఇప్పుడు కూడా యింకా అవే పాపపు పనుల్ని కంటిన్యూ చేస్తున్నాడు. ఇటువంటి వాళ్ళని దేవుడు ఒక కంట కనిపెడుతూనే వుంటాడని మరిచిపోయి మారాం చేస్తున్నాడు. ఇతన్ని దారిలోకి తీసుకొచ్చే మార్గం ఒకటి ఇప్పుడే గుర్తుకు వచ్చింది... ఒక పావుగంట వెయిట్ చేయండి...” అంటూ వచ్చిన దారినే వెనక్కి పరిగెత్తాడు శ్రీకర్.

“ఎక్కడికి వెళుతున్నాడతను? ఏం చేయబోతున్నాడు?” పెదవుల మీది చిరునవ్వు చెరగకుండా జాలిగా అడిగాడు మహాకాయుడు.

లాగిపెట్టి అతని ముఖం మీద గుద్దాలన్న కోరికను అతి ప్రయత్నం మీద అదుముకొని తల ప్రక్కకు తిప్పుకున్నాడు ముఖేష్.

నదిని దాటిన తరువాత ఆ భారీ శరీరంతో సహా సిటీకి దగ్గిర్లో వున్న ఒక పాడుబడిన మసీదును చేరుకున్నారు వాళ్ళు. మసీదు మధ్యలో వత్తుగా పెరిగిన పచ్చిగడ్డి మీద ఆ భారీ ఆకారాన్ని పడుకోబెట్టి స్పృహ వచ్చేదాకా వెయిట్ చేశారు. స్పృహ రాగానే రెండే రెండు ప్రశ్నలు వేశాడు శ్రీకర్.

రెఫ్యూజీ కాంప్ లోకి తీసుకురాబడిన సైంటిస్ట్ మాధుర్ ఏమయ్యాడు? అతని కోసం వెతుక్కుంటూ వచ్చిన వారిని లాండ్ మైన్ పెట్టబడిన షెడ్ లోకి పంపి ప్రాణాలు తీయమని చెప్పింది ఎవరు??

సమాధానం యివ్వానికి ఫ్లాట్‌గా రెఫ్యూజ్ చేశాడతను... యూ కెన్ గోటు హెల్ అండ్ ట్రై దేర్ అని ఇంగ్లీషులో అనకపోయినా, అదే అర్థం వచ్చే మాటలు చాలా వుపయోగించాడు.

ఏం చేస్తే అతని గర్వం అణుగుతుంది? ఎలా ప్రశ్నిస్తే అతని నోటివెంట లభిస్తాయి తమ ప్రశ్నలకు సమాధానాలు??

ముఖేష్ మనసులో మెదులుతున్న సందేహాలకు సమాధానాలు లభించక ముందే గడిచి పోయాయి ఇరవై నిముషాలు.

మరో పది నిముషాల తరువాత విపరీతమైన ఆయాసంతో రొప్పుతూ రోజుతూ అక్కడ ప్రత్యక్షం అయ్యాడు శ్రీకర్.

ఎక్కడికో పోయి ఎవరినో బ్రతిమాలుకొని ఒక పెద్ద ప్లాస్టిక్ బక్కెట్‌ని సంపాదించాడు. దాని నిండా నీటిని నింపి జాగ్రత్తగా అక్కడికి తీసుకువచ్చాడు.

“నన్ను బెదిరించేటందుకు కొత్త కొత్త మార్గాలేవయినా తెలుసుకు వచ్చావా??” వెక్కిరింపుగా అడుగుతూ బక్కెట్ లోని నీటిని చూసి మసీదు గోడలు దద్దరిల్లి పోయేటట్లు అరిచాడు మహాకాయుడు.

“వద్దు... వద్దు... ఆ నీటిని నా మీద పోయొద్దు... వద్దు...” అంటూ పది అడుగుల దూరం దొర్లుకుంటూ పోయి ఒక గోడ అడ్డం వచ్చి ఆగిపోయాడు.

"మనం బల్లకట్టు మీద వుండగా తెలిసింది గురూ ఈ రహస్యం. వీళ్ళకి నీళ్ళంటే చచ్చేటంత భయం. మంటల్లో నిలబడమన్నా నిలబడతారుటగాని, ఒక్క నీటిబొట్టు వంటి మీద పడినా తట్టుకోలేరుట... పది రూపాయలు తీసుకొని ఈ బక్కెట్‌ని యిచ్చిన ఆసామీ మాటల మధ్యలో చెప్పాడు. నా ఫైండింగ్ యదార్థమేనని అంగీకరించాడు..." ముఖేష్‌తో అంటూ బక్కెట్‌ని ఎత్తి పట్టుకొని మహాకాయుడి దగ్గిరికి జరిగాడు శ్రీకర్.

"వద్దు... మీకు దణ్ణం పెడతాను... వద్దు..." చేతులను కాళ్ళను కదలకుండా బంధించి వుంచిన తాళ్ళను వదిలించుకోవటానికి విఫల ప్రయత్నం చేస్తూ మరింత కీచుగా అరిచాడతను.

"ఆల్‌రైట్ బ్రదర్... ఈ నీళ్ళు నీ మీద పడకుండా వుండాలంటే మా ప్రశ్నలకు సమాధానాలు చెప్పెయ్... త్వరగా... త్వరగా..." బక్కెట్‌ని అటూ ఇటూ ఊపుతూ బెదిరించాడు శ్రీకర్.

అంతకు ముందు వరకూ ప్రదర్శించిన గాంభీర్యం అంతా మంచులా మటు మాయం అవుతుండగా నోరు విప్పాడు మహాకాయుడు.

సైంటిస్ట్ మాథుర్ ఎవరో తనకు తెలియదుగాని, అరవై సంవత్సరాల వయసుండే ఒక ఇండియన్ని పట్టుకొని కాంప్‌లోకి తీసుకు వచ్చారట నల్లటి దుస్తులు ధరించిన బ్లాక్ విడో గాంగ్ మెంబర్లు. అక్కడి డాక్టర్‌కి లంచం పెట్టి అవతలికి పంపించి ఒక రోజంతా అక్కడే వున్నారట... ఆ తరువాత అతన్ని వెంటబెట్టుకొని వెళ్ళి పోతూ చీకటి షెడ్‌లో ప్రేలుడు పదార్థాన్ని పెట్టి వ్యాధిగ్రస్తులందరికీ గంజాయి నింపిన సిగరెట్లు సరఫరా చేశారట... తమ కోసం

ఎవరైనా వెతుక్కుంటూ వస్తే ఆ షెడ్ లోకి పంపి హతమారిస్తే రెండు నెలలకు సరిపడా గంజాయిని సరఫరా చేస్తామని వాగ్దానం చేసి మరీ వెళ్ళిపోయారట....

“ఆల్‌రైట్ బ్రదర్... చక్కటి భాషలో బహురమ్యంగా చెప్పావు మాకు కావల్సిన విషయాల్ని... ఇంకొక్క మాట కూడా చెప్పి మరికొంచెం సహాయం చెయ్యి.... ఎక్కడికి తీసుకుపోయారు?” సాలోచనగా అడిగాడు శ్రీకర్.

“ఆ విషయం మాకు ఎలా తెలుస్తుంది? ఏవో నాలుగు గంజాయి సిగరెట్లకోసం ఆశపడి వాళ్ళు చెప్పినట్లు చేశాము. అంతే...” శ్రీకర్ చేతుల్లో వున్న నీళ్ళ బక్కెట్ మీది నుంచి చూపులు తిప్పకుండా చెప్పాడతను.

“బాగా ఆలోచించు బ్రదర్...నాలుగు సిగరెట్లు కోసం ఆశపడి ప్రాణాలు తీసే లాండ్‌మైన్స్ పెడుతుండగా చూసి సహించిన వాడివి మరీ అంత అమాయకంగా నిలబడతావని నేను అనుకోను... త్వరగా ఆలోచించి తొందరగా గుర్తుకు తెచ్చుకో...” అంటూ బక్కెట్‌ని ముందుకు వంచాడు శ్రీకర్.

“ఆలోచిస్తాను... ఆలోచిస్తాను... ముందు ఆ బక్కెట్‌ని అవతలికి తీయి...” అని అరుస్తూ అవతలికి జరగటానికి విఫల ప్రయత్నం చేసి, గాఢంగా నిట్టూర్చాడు మహాకాయుడు.

“మీ వంటి మొండి ఘటాలు కొన్ని తమను తరుముకు వస్తాయని అనుకుంటూనే వున్నారు వాళ్ళు. అందుకే ఆ సైంటిస్ట్‌ని ముందుగా మా కాంప్ లోకి తీసుకు వచ్చారు... మాకు ఇన్‌స్ట్రక్షన్స్ యిచ్చిన తరువాత సరాసరి స్వాంపీ ద్వీపానికి వెళ్ళిపోయారు. ఈ మాట వాళ్ళు నాకు చెప్పలేదు. వాళ్ళల్లో వాళ్ళు అనుకుంటుంటే విన్నాను...” మెల్లగా చెప్పాడతను.

పైకి ఎత్తి పట్టుకున్న బక్కెట్‌ని క్రిందికి దించుతూ షాడో వంక చూశాడు శ్రీకర్.

“చక్రూ సిటీలోకి వచ్చేదాకా బ్లాక్ విడోని గురించి కాని సైంటిస్ట్ మాధుర్‌ని గురించిగాని మనకు తెలియదు. మాయమైన సైంటిస్ట్ కోసం మనం వెతుక్కుంటూ వస్తామని బ్లాక్ విడోకి కూడా తెలిసే అవకాశం లేదు... మరి వాళ్ళు ఎవరిని మభ్యపెట్టటానికి ఈ ఎత్తు ఎత్తినట్లు? మనం కాక మరింకెవరైనా ఇన్వెస్టిగేషన్‌లో పాలు పంచుకుంటున్నారా?” తను కూడా షాడో వైపు తిరుగుతూ అన్నాడు ముఖేష్.

అహుజాని హింసించటానికి ఐరన్ రాడ్‌ని పట్టుకొని రాక్షసుడిలా నిలబడిన స్పెషల్ బ్రాంచి ఆఫీసర్ మజ్దూర్ ముఖం కనుల ముందు మెదిలి చలిగాలి వీచినట్లు జలదరించింది షాడో శరీరం.

తన అనుచరులతో కలిసి అతను బ్లాక్ విడోని క్లోజ్‌గా ఫాలో అవుతూ అక్కడికి వస్తే ఇప్పుడు??

వేపాకు నమిలినట్లు చేదుగా తయారయింది అతని నోరు ఆ మాట అనుకోగానే.

“మనం వచ్చిన పని అయిపోయింది... బక్కెట్‌ని అవతల పారేయ్” అని శ్రీకర్‌ని హెచ్చరిస్తూ వెనుతిరిగాడతను.

రెండు అడుగులు కూడా వేయకముందే పాడుపడిన మసీదు దద్దరిల్లిపోయేటట్లు వినవచ్చిందొక అరుపు.

“వెతకండి... ముందా మసీదులో వెతకండి... పొండి... తొందరగా పొండి....”

మసీదు గోడలకు తగిలి ఆ అరుపు ప్రతిధ్వనించటం ఆగిపోకముందే అక్కడ ప్రత్యక్షమయ్యారు అరడజను మంది ఇండియన్ స్పెషల్ బ్రాంచికి చెందిన డిటెక్టివ్స్.

ఒంటరిగా రాలేదు వాళ్ళు. వెంటచక్రూ సిటీకి చెందిన పోలీస్ ఆఫీసర్లను. పాతికమంది కానిస్టేబుల్స్‌ని తీసుకువచ్చారు.

వారందరి చేతుల్లో వున్న రైఫిల్స్‌ని , రివాల్వర్స్‌ని చూసి చీమలు పాకినట్లు కంపరమెత్తింది షాడో శరీరం.

“కమాన్ ముఖేష్! కమాన్ శ్రీ... కమాన్...” అని తనవారిని హెచ్చరిస్తూ ప్రక్కకు తిరిగి సగం విరిగిపోయిన ఒక ప్రహరీగోడ మీదినుంచి అవతలికి దూకాడు.

అందరికంటే ముందుగా పరిగెత్తుకొస్తున్న స్పెషల్ బ్రాంచి డిటెక్టివ్స్ కంట పడలేదు ఆ దృశ్యం అసలు విషయాన్ని వారు గ్రహించేలోగా ఆ ప్రదేశానికి దూరంగా వెళ్ళిపోవచ్చనే షాడో ఆశ నిరాశే అయింది.

డిటెక్టివ్స్‌ని చూడగానే వారి కంటే బిగ్గిరిగా అరుస్తూ విరిగిపోయిన ప్రహరీవైపు తల వూపాడు మసీదులో వుండిపోయిన మహాకాయుడు.

“అటుగా పోయారు... నన్ను బంధించి హింసించటానికి తీసుకొచ్చిన దుర్మార్గులు అటుకేసి పారిపోయారు. అని హెచ్చరించాడు వారందర్నీ.

అరుపులతో, కేకలతో ఆ చుట్టుపట్ల వున్న భవనాలన్నింటినీ ప్రకంపింప చేస్తూ ప్రహరీని దాటి ముందుకు బయలుదేరారు ఆ డిటెక్టివ్స్. తమ దగ్గర వున్న వైర్‌లెస్ సెట్ ద్వారా పట్టణంలో వున్న మరికొంతమంది పోలీసు అధికారులకు మెస్సేజి పంపిస్తూ వారిని అనుసరించారు వెంట వచ్చిన పోలీస్ సిబ్బంది.

* * * *

"...లాభం లేదు గురూ... మసీదులో వదిలి పెట్టి వచ్చిన దొంగరాస్కెల్ మన గుట్టు రట్టు చేశాడు... ప్రాణాలతో ఈ సిటీలోంచి బయట పడతామనే నమ్మకం నాకు లేదు" విపరీతమైన ఆయాసంతో ఒక కరెంట్ పోల్ దగ్గర ఆగిపోతూ అన్నాడు శ్రీకర్.

ముఖం మీది నుంచి కనులలోకి జారుతున్న స్వేదబిందువుల్ని అరచేత్తో అద్దుకుంటూ వెనక్కి చూశాడు షాడో.

చినికి చినికి గాలివాన అయినట్లు దాదాపు నాలుగు వందలమంది పోలీసులు, ప్రజలు అందరూ కలిసి చేజ్ చేస్తున్నారు వారిని... మోటార్ వెహికల్స్ అడుగు పెట్టలేని ఆ యిరుకు సందుల్లో పట్టిన పట్టు వదలకుండా పరుగులు తీస్తూ వస్తున్నారు.

శ్రీకర్ మాటల్లో అసత్యం ఏమీ లేదు. పట్టుబడితే ప్రాణాలతో వదిలి పెట్టరు చక్రూ సిటీ పోలీసులు.

"ఎందుకొచ్చిన గోల ఇది? సైంటిస్ట్ మాధుర్ ఎవరో నీకు తెలియదు. నీకు తెలిసిందేదో స్పెషల్ బ్రాంచి వాళ్ళకు చెప్పి చేతులు దులుపుకోరాదూ?" ఉన్నట్లుండి సలహా యిచ్చింది షాడో అంతరాత్మ.

ఇంత గోల జరిగిన తర్వాత తమ మాట వింటారా వాళ్ళు? ఏదో ఒక మెలిక పెట్టి తప్పు తన మీదికి తోస్తే?

ఆరిపోయిన సిగార్‌ని నోటిలోనుంచి తీయకుండా కనుబొమ్మల మధ్యలోనుంచి గుర్రుగా తమ వంక చూస్తున్న కులకర్ణిగారి ముఖం కనుల ముందు మెదిలి అంతరాత్మ సలహాను పెడచెవిన పెట్టి చుట్టూ చూశాడు షాడో.

రెండు ఫర్లాంగుల దూరంలోకి వచ్చేసింది తరుముకువస్తున్న గుంపు... దాన్ని తాము నిలబడిన ప్రదేశంలో ఆపేయకపోతే లాభం లేదు. తమ అరుపులతో ఆ చుట్టు పట్ల వున్న పౌరులందర్నీ నిద్రలు లేపుతూ పెనుతుఫాను వస్తున్న ఆ జనాల్ని ఆపటం ఎలా?

"ప్రపంచమంతా కట్ట కట్టుకొని ఎదురు వచ్చినా వంటి చేత్తో ఎదిరించగల మొనగాళ్ళు అలా నీళ్ళు కారిపోతున్నారేమిటి? మళ్ళీ టాంగా అవసరం వచ్చిందా?" ఉన్నట్లుండి వారిని పలుకరించిందొక కంఠం.

అదిరిపడి ప్రక్కకు దూకారు ముఖేష్, శ్రీకర్. చటుక్కున క్రిందికి వంగి బూటు ప్రక్కన బిగించి ఉన్న డాగర్ ని బయటికి లాగాడు షాడో.

"ఆగు గురూ... ఆగు... డాగర్‌ని విసరకు... ఎవరో కాదితను... మనకు లిఫ్ట్ యిచ్చిన టాంగా తాత..." క్రింద కనిపించిన లావుపాటి పలుకురాయిని అందుకుంటూ, ఆ కంఠం వినిపించిన వైపు చూసి చిన్నగా షాడోని హెచ్చరించాడు శ్రీకర్.

అండర్ హేండ్ త్రోలో ముందుకు విసరబోతున్న డాగర్‌ని అతిప్రయత్నం మీద ఆపుకొని లేచి నిలబడ్డాడు షాడో.

"ఏం సార్! టాంగా కావాలా?" తన మీద జరుగబోయిన ఎటాక్ ప్రయత్నాన్ని గమనించనట్లు నటిస్తూ ఒక యింటి చాటునుంచి ముందుకు వచ్చాడు ఆ వృద్ధుడు.

"కావాలని అనక ఏం చేస్తారు? మన టాంగాలో ఎక్కకపోతే యిక్కడి నుంచి అవతలికి పోయే మార్గం ఏది వీళ్ళకి?" మాటలో మాటగా అంటూ అతని వెనుకే ప్రత్యక్షం అయింది అంతకుముందు టాంగాలో కనిపించిన బర్మా డాల్.

చెంపమీద లాగిపెట్టి కొట్టినంత అవమానం ఫీల్ అవుతూ చివ్వున షాడో కేసి తిరిగాడు శ్రీకర్.

తన మనసులోని మాటను బయటికి చెప్పే అవకాశం అతనికి లభించలేదు. ఉన్నట్లుండి పది అడుగులదూరంలో వున్న ఒక రేకుల ఇంటిని చూపించాడు షాడో.

రెండు అంగల్లో ఆ ఇంటి ముఖద్వారం దగ్గిరికి పోయి గాలిని గట్టిగా పీల్చాడు ముఖేష్.

ఘాటుగా సోకిందతని నాసికాగ్రానికి కిరోసిన్ వాసన. చట్ట విరుద్దంగా కిరోసిన్‌తోపాటు పెట్రోల్‌ని కూడా స్టాక్ చేసి అక్కడ అమ్మబడుతోంది కాబోలు తలుపు సందుల్లోనుంచి బయటికి వస్తోంది ఆ స్మెల్ కూడా.

రెండో ఆలోచన లేకుండా భుజంతో రెండే రెండు గుద్దులు గుద్దాడతను ముఖద్వారాన్ని.

మూడో దెబ్బ వేయాల్సిన అవసరం లేకుండానే పటపటమని శబ్దాలు చేస్తూ విరిగి వెనక్కి పడిపోయాయి తలుపులు.

క్షణం కూడా ఆలస్యం చేయకుండా లోపలికి పోయి గోడల వెంబడి నిలబెట్టిన డబ్బాలన్నిటినీ బయటికి విసిరేశాడతను.

బయటికి వచ్చిన డబ్బాల్ని నేలకేసి బాది వాటిలోని కిరోసిన్‌ని, పెట్రోల్‌ని సందు నిండా పోశాడు శ్రీకర్.

"గెట్ బాక్ ఎవ్రీ బడీ... గెట్ బాక్..." అని కమాండ్ చేస్తూ ఒక పెట్రోల్ కాన్‌కి లైటర్ తో నిప్పు ముట్టించి అవతలికి దూకాడు షాడో.

గప్పుమని పది అడుగుల ఎత్తుకు లేచాయి అగ్ని జ్వాలలు. నల్లటి పొగల్ని వెలువరుస్తూ దగ్గిర్లోకి వచ్చేసిన జనాన్ని ఒక్క అడుగు కూడా ముందుకు వేయికుండా నిలబెట్టేశాయి.

నోరు తెరుచుకు చూస్తున్న టాంగా తాతవైపు, ఆ బర్మా పిల్ల వైపు సగర్వంగా చాసి పెద్ద పెద్ద అడుగులతో ఆ ప్రదేశాన్ని దాటి ఒక మెయిన్ రోడ్డు మీదికి పోయాడు శ్రీకర్.

సందులొని మంటలు సందుకు అటూ యిటూ వున్న కట్టడాలకు అంటుకోకుండా జాగ్రత్తలు తీసుకోవటంలో బిజీ అయిపోయింది వారిని తరుముకు వచ్చిన గుంపు.

మంటలు ఒకింత శాంతించిన మరుక్షణం ముందుకు వచ్చారు వారిలో కొంతమంది... అప్పటికే అటుగా వచ్చిన ఒక టాక్సీని ఎక్కి సముద్రతీరం వైపు వెళ్ళిపోయారు స్నేహితులు. వారికెవరికీ కనిపించలేదు.

* * * *

"స్వాంపీ ద్వీపానికి వెళ్ళాలా? ప్రభుత్వం నడిపే మోటార్ లాంచి ఉదయం ఎనిమిది గంటలకు వెళ్ళిపోయింది... మీరు రేపు వెళ్ళాల్సిందే.." సముద్రతీరంలో వున్న చిన్న పల్లెలో టీ షాపును నడుపుకునే బర్మీయుడు ఒకతను అన్నాడు.

నిద్రలేక ఎర్రబడిన కనుల్ని అరిచేతులతో రుద్దుకుంటూ ఫర్లాంగు దూరంలో కనిపిస్తున్న సముద్రం కేసి చూశాడు షాడో.

సముద్రతీరానికి సరిగ్గా యాభై కిలోమీటర్ల దూరంలో వుంటుంది మహాకాయుడు వారికి చెప్పిన స్వాంపీ ఐలెండ్.

ఎప్పుడో యాభై సంవత్సరాల క్రితం రంగూన్ నగరంతో పోటీచేసే పట్టణం ఒకటి ఆ ద్వీపంలో వుండేదిట... ఒకసారి పెద్ద పెనుతుఫానుకు గురై సమూలంగా తుడిచిపెట్టుకు పోయింది అది ... కొండలు గుట్టలతో గ్రామీణ ప్రజలు కొంతమందే మిగిలిపోయారు అక్కడ. బయటి ప్రపంచంతో సంబంధం లేకుండా తమ బ్రతుకులు తాము బ్రతుకుతున్నారు.

వారిని అలా వంటరిగా వదలటం యిష్టంలేక రోజుకు ఒకసారి పెద్ద మోటార్ లాంచీని అటూ ఇటూ తిప్పుతూ వుంటుంది ప్రభుత్వం. ఆ ద్వీపం తమకు చెందినదేనని బయటి ప్రపంచానికి చెపుతూ వుంటుంది.

అప్పటికి మధ్యాహ్నం పన్నెండు గంటలు దాటింది సమయం... ప్రభుత్వం నడిపే మోటార్ లాంచి కోసం ఎదురుచూస్తూ కూర్చుంటే పుణ్యకాలంకాస్తా గడిచి పోతుంది... స్పెషల్ బ్రాంచి వాళ్ళకి తమ జాడలు మళ్ళీ ముంచుకు వచ్చేస్తుంది ప్రమాదం.

“చేపలు పట్టే పడవలు ఏవీ లేవా యిక్కడ? వాటిలో మమ్మల్ని అక్కడికి తీసుకుపోగల వాళ్ళు ఎవరూ మమ్మల్ని అక్కడికి తీసుకుపోగల వాళ్ళు ఎవరూ లేరా??” అతిగా మాట్లాడటం ప్రమాదకరమని తెలిసి కూడా విధిలేక అడిగాడు షాడో.

“స్వాంపీ ద్వీపందాకా పోగల పడవలు ఏవీ ఇక్కడ లేవు...ఇందాక ఒక గంట క్రితం ఒక కొత్త మోటార్ బోటు వచ్చింది. అది ఎవరిదో నాకు తెలియదు. పోయి అడిగి చూడండి...” సలహా యిచ్చాడు టీ బంక్ ఓనర్.

అతనికి థాంక్స్ చెప్పి వెనుతిరిగాడు షాడో. బంక్ గోడలకు ఆనుకొని కునికిపాట్లు పడుతున్న స్నేహితులిద్దర్నీ బలవంతంగా లేపి సముద్రతీరం దగ్గిరికి తీసుకు పోయాడు.

ఒక పెద్ద రాతిగుట్ట చాటున, వడ్డుకు వంద గజాల దూరంలో లంగరు వేయబడి వుంది బంక్ యజమాని చెప్పిన మోటార్ బోటు. ఎగసిపడుతున్న ఆలల్లో వుయ్యాలలు వూగుతోంది.

“మనలాంటి వాళ్ళెవరో సైట్ సీయింగ్‌కి వచ్చి వుంటారు... వాళ్ళని వెతికి పట్టుకొని బ్రతిమాలుకోవటానికి చాలా సమయం పడుతుంది...” అనబోతూ మాటల్ని మధ్యలోనే మ్రింగేశాడు శ్రీకర్.

సైట్ సీయింగ్‌కి వచ్చిన వాళ్ళు ఎవరూ ఆ బోటు దగ్గిర లేరు... తీరం మీద వున్న కొబ్బరి తోటల్లోకి షికారుకు పోయినట్లు... వంటరిగా, ఖాళీగా వుంది ఆ బోటు....

అతనికి వచ్చిన ఆలోచనే తమకు కూడా వచ్చినట్లు పట్టుదలగా ముందుకు కదిలారు షాడో, ముఖేష్. నడుములవరకూ వచ్చిన సముద్రపు నీళ్ళల్లో అడుగులు వేస్తూ, బోటును సమీపించి పైకి చేరుకోబోయారు.

"రండి... రండి... టాంగా సర్వీస్‌ని వదిలేసి మోటార్ బోట్ కంపెనీ పెట్టాము. గంటకు వంద ఇస్తే ఎక్కడికయినా తీసుకుపోతాము..." బోటు మధ్యభాగంలో వున్న కాబిన్ లోనుంచి బయటికి వస్తూ అన్నాడు టాంగా తాత.

అతని వెనుకే ప్రత్యక్షం అయిన బర్మా యువతిని చూడగానే నీళ్ళల్లోకి జారి వెనక్కి వెళ్ళిపోవటానికి ప్రయత్నించాడు శ్రీకర్. షాడో కుడిచెయ్యి తన భుజం మీద పడి కదలకుండా పట్టుకోవటంతో విధిలేక ఆగి పోయాడు.

* * * *

"...దగ్గిరికి వచ్చేశాం. ఇంకో అరగంటలో ద్వీపాన్ని చేరుకుంటాం..." బోటును జాగ్రత్తగా నడుపుతూ తన ప్రక్కనే నిలబడి వున్న షాడోతో అన్నాడు టాంగా వృద్ధుడు.

నిద్రపోయి ఎంతకాలం అయిందో గుర్తుకు తెచ్చుకోవటానికి ప్రయత్నిస్తున్నాడు షాడో. ఆ మాటలకు మౌనంగా తల వూపాడు.

"తుఫాను దెబ్బకు ఇక్కడ వుంటే పట్టణం కొట్టుకు పోయిన తర్వాత దట్టమైన అడవి పుట్టుకొచ్చింది... ఆడవితోపాటు రకరకాల విషపు జీవులు, చిన్న చిన్న క్రూర జంతువులు కూడా వచ్చి చేరాయి..." మళ్ళీ తనే అన్నాడతను.

ఆ మాటలకు కూడా తల వూపి వూరుకున్నాడు షాడో.

“అడవి తప్ప జనసంచారం ఏమంత పెద్దగా వుండని ఈ దరిద్రపు ప్రదేశంలోకి మీరు పోవాలని అనుకోవటం దేనికో తెలుసుకోవచ్చా??” సూటిగా అసలు విషయంలోకి వచ్చేశాడు వృద్ధుడు.

సముద్ర తీరం దగ్గిర వున్న గ్రామాన్ని చేరుకోగానే టీ బంక్‌లో సిగరెట్ల కోసం విచారించాడు షాడో. అవి దొరక్క పోవటంతో రెండు బీడీ కట్టల్ని తీసుకున్నాడు. సముద్రంలో దిగి, బోటును సమీపించేటప్పుడు వాటిని గురించి మరిచిపోవటం వల్ల తడిసి ఎందుకూ పనికి రాకుండా పోయాయవి.

పట్టిన పట్టు వదలకుండా బోటు పై భాగంలో ఒక రేకు మీద ఎండబెట్టాడు వాటిని. పూర్తిగా అరకపోయినా ఒక బీడీని తెచ్చుకొని లైటర్‌తో వెలిగించుకుంటూ వృద్ధుడి వంక చూశాడు.

“అతిగా మాట్లాడుతున్నానని అనుకోకండి... రెండు సంవత్సరాల క్రితం ఒకసారి ఈ ద్వీపానికి వచ్చి అడవి నంతా కలియ తిరిగాను... మీ పనేమిటో చెపితే చేతనయినంత సహాయము చేస్తాను” మెల్లిగా అన్నాడు వృద్ధుడు.

ఎక్కడో చక్రూ సిటీలో వీధుల వెంట తిరుగుతూ మోసాలు చేసి పొట్ట పోసుకునే అతని మాటల్లో అంతకు ముందు వరకూ కనిపించిన ఒక విధమైన యాస మాయమై బాగా చదువుకున్న వాడిలా అనిపించటంతో అప్రయత్నముగా ముడిపడింది షాడో నొసలు.

తడిసి పోవటం వల్ల వెగటు కలిగిస్తున్న బీడీని అలాగే పట్టుకొని మౌనంగా వుండిపోయాడతను. వృద్ధుడి మాటలకు సమాధానం చెప్పలేదు.

రెట్టించి అడిగే ప్రయత్నం ఆ వృద్ధుడు చేయలేదు. తను కూడా సైలంట్ అయి, బోటును నడపటంలో బిజీగా మారిపోయాడు.

* * * *

"రండి సార్... రండి...రండి...బయటి నుంచి వచ్చిన వాళ్ళు బస చేయాలంటే నా ఇంటికే రావాలి... నేను తప్ప మిమ్మల్ని ఆదరించేవాళ్ళు ఇంకెవరు లేరు. ఈ స్వాంపీ ద్వీపంలో ... రండి... రండి..." తాషామార్బా వంటి గొంతుకతో బోటు దిగిన షాడోకి ఎదురు వచ్చాడు సన్నగా, పొడుగ్గా వున్న వ్యక్తి ఒకతను.

"ఇక్కడి గ్రామస్థులకు తెలియకుండా పరాయి వారెవరూ ద్వీపంలోకి రాలేరు. అతని ఆతిథ్యాన్ని స్వికరించి మెల్లిగా కబుర్లలోకి దింపటం చాలా మంచిది" బోటును తీరంలో వున్న ఒక ఇసుక గుట్ట దగ్గిరికి పోనిచ్చి లంగరేస్తూ లోగొంతుకతో అన్నాడు వృద్ధుడు.

ఉలికిపాటును కప్పి పెట్టుకోవటానికి ప్రయత్నిస్తూ అతనికేసి చూశాడు షాడో. తాము అటుకేసి ఎందుకు వచ్చారో అతనికి చెప్పలేదు. చెప్పినట్లుగానే వుంది అతని సలహా....

"అతిగా ఆలోచించటం వల్ల తలనొప్పి రావటం తప్ప మరేమీ జరగదు... పదండి..." లంగరు వేయటం పూర్తిచేసి అతనితోపాటు కదులుతూ అన్నాడు వృద్ధుడు.

అతనితో పాటు తిరిగే బర్మా డాల్ ప్రక్కనే నడుస్తున్న శ్రీకర్‌కి కనులతోనే సైగ చేశాడు షాడో... వారిద్దరినీ ఒక కంట కనిపెట్టి వుండమని.

వినేవారందరికీ చెవుడు వున్నట్లు పెద్ద గొంతుకతో మాట్లాడుతూ వారందర్నీ తన ఇంటికి తీసుకుపోయాడు ఎదురు వచ్చిన వ్యక్తి. విశాలంగా వున్న రెండు గదుల్ని వారికి చూపించి, భోజనాలు ఏర్పాటు చేసే కార్యక్రమంలో మునిగిపోయాడు.

తమకు ఇవ్వబడిన గదిలోని చాప మీద కూర్చుని పాంటు జేబులో చేయి పెట్టాడు షాడో బీడీల కోసం. పెట్టిన చేయి ఖాళీగా తిరిగి వచ్చిన తర్వాత గాని గుర్తుకు రాలేదతనికి, బీడీలన్నీ బోటు పై భాగంలోనే వుండిపోయినట్లు.

గదిలోకి అడుగుపెడుతూనే చెరొక మూలా చాపల్ని ఆక్రమించుకొని గాఢ నిద్రపోతున్న స్నేహితుల్ని డిస్టర్బ్ చేయటం యిష్టంలేక, మెల్లిగా తలుపు తెరుచుకొని బయటికి వచ్చాడతను.

ఇంటికి ఎడమ భాగంలో వున్న ద్వారంలో నుంచి ఒక చిన్న వీధిని చేరుకొని ముందుకు సాగాడు సిగరెట్లు అమ్మే దుకాణాన్ని వెతుకుతూ.

వంద గజాల దూరం పోయిన తర్వాత అతన్ని పలుకరించాడు ఒక ఇంటి ముందు కూర్చుని వున్న గ్రామస్థుడు.

"సిగరెట్ల కోసమేనా సార్? మీ ముఖం చూస్తే అందుకే అనిపించింది... ఇక్కడ బీడీలు తప్ప అవి దొరకవు. అంతగా కావాలంటే గ్రామం బయట వుండే పూజా తాత అమ్ముతాడు... ధర మాత్రం చాలా ఎక్కువ..."

ప్రాణం లేచి వచ్చినట్లు అనిపించి అటుకేసి అడుగులు వేశాడు షాడో. మసక చీకట్లు ముసురుకుంటున్న సమయంలో గ్రామం బయట వంటరిగా వున్న ఒక చెక్కల కట్టడాన్ని సమీపించి తలుపులు తట్టాడు.

"లోపలికి రావచ్చు... గడియ తీసే వుంది" వెంటనే వినవచ్చింది సమాధానం.

ఓరగా వేసి వున్న తలుపుల్ని లోపలికి తోయబోతుండగా ఝల్లుమంది షాడో శరీరం... కంటికి కనిపించని ప్రమాదం ఏదో ముందు పొంచి వున్నదనే ఫీలింగ్ మెల్లిగా అతని మనస్సులోకి అడుగుపెట్టి పెరిగి పెద్దది కాసాగింది.

గడపను దాటి లోపలికి వేయబోతున్న పాదాన్ని వెనక్కి తీసుకొని అలాగే నిలుచుండిపోయాడతను.

"గడియ తీసే వుందని చెబితే వినబడటం లేదా? లోపలికి రారేమిటి?" మరోసారి వినవచ్చిందా కంఠం.

లోపలికి వెళ్ళాలనే ఆలోచనను విరమించుకున్నాడు షాడో. ప్రక్కకు తిరిగి ఆ కట్టడం వెనుక భాగంలోకి పోయాడు.

బార్లా తెరిచి వున్నాయి వెనుక భాగంలోని పెరటి తలుపులు. అడుగులో అడుగు వేస్తూ లోపలికి పోయిన అతని కనులకు వెంటనే కనిపించారు ముందు గదిలో ఒక బీరువాను చాటు చేసుకొని నిలబడిన ఇద్దరు ఆగంతకులు.

ఆ కట్టడంలో వుండాల్సిన పూజారి తాత ఏమైపోయాడో ఆలోచించదలుచుకోలేదు షాడో.

"హల్లో! నా కోసమేనా ఎదురు చూస్తోంది మీరు?" చిన్నగా అడిగాడు వారిని.

అదిరిపడి అతని వైపు తిరిగారు వారిద్దరూ. తిరుగుతూనే చేతుల్లో వున్న లావుపాటి కర్రలను పైకి ఎత్తి మీదికి దుమికారు.

వెనుక గది గుమ్మానికి రెండు చేతులను బిగించి పెట్టి ఫెడీమని తన్నాడు షాడో ఒకతని ముఖంమీద. పాదాలు నేలకు ఆనిన మరుక్షణం ముందుకు వంగి రెండో వ్యక్తి కుడిచేతిని తన ఉక్కు పిడికిలితో బిగించి లాగాడు.

పళ్ళు పటపటమని కొరుకుతూ ఎడమ చేతిని అతని కనుల మీదికి జాచాడు ఆ వ్యక్తి.

తలవంచి ఆ చేతిని తప్పించుకున్నాడు షాడో. వంచిన తలను ఎత్తకుండా అతని గుండెల మీద పొడిచాడు.

చెక్కల కట్టడం అదిరిపోయేటట్లుగా అరిచి వెనక్కి పడ్డాడతను. చేతిలోని కఱ్ఱను క్రిందికి వదిలేశాడు.

గాలిలో వుండగానే మెరుపులా కదిలి ఆ కఱ్ఱను చేజిక్కించుకున్నాడు షాడో. రెండు చేతులతోను బిగించి పట్టుకొని ఎడాపెడా విసరటం మొదలు పెట్టాడు.

ఎంత హఠాత్తుగా ప్రారంభమయిందో అంతే హఠాత్తుగా అంతం అయిందా పోరాటం.

కఱ్ఱ దెబ్బలకు పగిలి నెత్తురును వెలువరుస్తున్న తలల్ని అదుముకుంటూ లేచి నిలబడ్డారు వాళ్ళు. నిలబడినట్లే నిలబడి బయటికి పరిగెత్తారు.

అయాచితంగా లభించిన ఆ అవకాశాన్నీ వదులుకోదలచలేదు షాడో. క్రరను మరింత గట్టిగా బిగించి పట్టుకొని వారిని వెన్నంటాడు.

ప్రాణభయం వారి పాదాలకు విపరీతమైన వేగాన్ని ప్రసాదించినట్లుంది. కన్నుమూసి కన్ను తెరిచేటంతలో కట్టడానికి వంద గజాల దూరంలో వున్న అడవిలోకి పోయి అదృశ్యం అయినారు వాళ్ళు.

"మిమ్మల్ని వదిలి పెడతానని అనుకోవటం మీ భ్రమ. నన్ను దొంగ దెబ్బ తీయాలని మీ తెలివి తక్కువతనం..." అనుకుంటూ అడవిలోకి ఎంటరయినాడు షాడో. అరగంట పాటు ఆ పొదలన్నిటినీ గాలించాడు.

"అనవసరమైన శ్రమ యిది... కన్ను పొడుచుకున్నా ఏమీ కనిపించని చీకటి అలుముకుంది... ఈ చీకట్లో తచ్చట్లాడి కొత్త ప్రమాదాల్ని కొనితెచ్చుకోకు..." అని అంతరాత్మ ఎత్తిపోడవటం ప్రారంభించేసరికి ఓటమిని అంగీకరించి వెనుతిరిగాడు – మరో పది నిముషాల తరువాత.

తిరిగి ఇంకోసారి చెక్కల కట్టడం దగ్గిరికి వచ్చి అక్కడ వుండాల్సిన వూజా తాతను వెతికి పట్టుకుంటే తన మీద దాడి చేసిన వారి వివరాలు తెలియవచ్చనే ఆశ అతనికి కొత్త వుత్సాహాన్నిచ్చింది.

ఆ ఆలోచనలతోనే వడివడిగా అడుగులు వేస్తూ, బూటు కాలిక్రింద ఏదో మెత్తగా తగిలేసరికి ఎగిరి అవతలికి దూకాడు.

అవతలికి దూకిన అతని తొడలకేసి గురిగా పడగను విసిరింది బూటు క్రింద పడి తోక నలిగిన బర్మా త్రాచు.

అరచేతులు చెమటలతో నిండిపోతుండగా, మరో గంతు వేసి దెబ్బనుంచి తప్పించుకున్నాడు షాడో. బూటు ప్రక్కన బిగించివున్న డాగర్‌ని బయటికి తీస్తూ మరో అడుగు వెనక్కి వేశాడు.

జర్రున జారాయి పాదాలు. జరుగుతున్న దేమిటో అతనికి అర్థం అయ్యేలోగా తల్లక్రిందులుగా పల్టీ కొట్టి ఒక పెద్ద గోతిలో పడిపోయాడు. డాగర్ ని వదిలేసి చేతుల్ని తల చుట్టూ చుట్టుకున్నా ప్రయోజనం లేక పోయింది. గోయి అడుగు భాగంలో వున్న ఒక బండ రాయికేసి పొడుచుకుంది తల. ఠంగున శబ్దం చేసింది.

కనుల ముందు రంగు రంగుల నక్షత్రాలు ప్రత్యక్షం అవుతుండగా స్పృహ కోల్పోయాడతను.

పడగను వేగంగా వూపుతూ గోతి అంచుకు వచ్చి అరగంట సేపు మాటు వేసిందా తాచు... అరగంట దాటినా తన శత్రువులో కదలిక కనిపించక పోయేసరికి వెనుతిరిగి పొదల్లోకి వెళ్ళిపోయింది.

* * * *

రెండు గంటలు గడిచిన తరువాత స్పృహ తెలిసి కనులు విప్పాడు షాడో.

పలుగు పెట్టి పొడిచినట్లు పోటెత్తిపోతున్న తలను తడుముకుంటూ గోతిలో నుంచి పైకి వచ్చి చుట్టూ చూశాడు.

ఆకుల మాటున చేరి రొద పెడుతున్న కీటకాలు తప్ప ఇంకేవీ లేవు ఆ పొదల మధ్య. అతన్ని బెదిరించిన తాచుపాము మాటువేసిన జాడలు కూడా కనిపించలేదు.

పాంటు జేబులోని హేండ్ కర్చిఫ్‌ని పోటెత్తుతున్న తలకు కట్టుకొని వెనుతిరిగాడతను. వడివడిగా అడుగులు వేసి వూజా తాత చెక్కల కట్టడం దగ్గిరికి

వచ్చాడు. ఎంతోసేపు వెతకాల్సిన అవసరంలేకుండానే కనిపించాడు పూజా తాత – కట్టడానికి పది అడుగులు అవతలగా వున్న పెద్ద పొద చాటున.

అతని నోరు మూయించటానికి లావుపాటి కర్రలతో తలమీద మోదారు కాబోలు తల పగిలి అనంత విశ్వంలో కలిసిపోయాయి అతని ప్రాణావాయువులు.

సిగరెట్లు కావాలంటే అక్కడికి వెళ్ళమని చెప్పిన గ్రామస్థుడి ముఖం కనుల ముందు మెదిలి అప్రయత్నముగా బిగుసుకున్నాయి షాడో పిడికళ్ళు.

తమ మీద నిఘా వేయటానికే నియమించబడి వుంటాడతను. తనంతట తను బయటికి రాకపోయినట్లయితే, ఏదో ఒక మిష మీద బయటికి రప్పించి పూజా తాత దగ్గిరికి పంపించి వుండేవాడు... అతన్ని పట్టుకొని రెండు అంటిస్తే??

ఆ ఆలోచన మనస్సులో ప్రవేశించగానే వేగంగా గ్రామం వైపు బయలుదేరి, రెండే రెండు నిముషాల్లో ఎగిరి ఒక పొదచాటుకు డైవ్ చేశాడు షాడో.

ఎవరిని పట్టుకొని రెండు అంటించాలని బయలుదేరాడో, ఆ గ్రామస్థుడే ఎదురుగా వస్తున్నాడు పరుగు లాంటి నడకతో. నీడ కదిలినట్లు వేగంగా కదిలిన షాడోని చూడకుండా చెక్కల కట్టడం దగ్గిరికి పోయి, జీవంలేని పూజా తాతను చూశాడు. అక్కడ ఏం జరిగిందో అర్థంకానట్లు తల విదిలిస్తూ, అంతకు ముందు షాడోని ఎదిరించి పారిపోయిన వ్యక్తులు అనుసరించిన మార్గంలో పరుగు ప్రారంభించాడు.

పాములుగాని, తేళ్ళుగాని కాళ్ళక్రింద పడితే ప్రాణాలు పోతాయనే విషయాన్ని విస్మరించి తను కూడా పరుగెత్తాడు షాడో, వంద అడుగుల వెనుకగా

అతన్ని అనుసరించాడు అరగంట తరువాత ఒక పెద్ద మర్రిచెట్టు వంటి వృక్షం క్రింద నిలబడి పెద్దగా ఈల వేశాడు ఆ గ్రామస్థుడు.

చెట్టు కొమ్మల్లో నుంచి భూతాల మాదిరి అతని ముందుకు దూకారు పాతిక మంది ఆగంతకులు.

"ఏమైంది? నేను పంపిన వ్యక్తిని పట్టుకున్నారా?" వారిని అడిగాడతను.

తమ వెనుక తలలు వంచుకొని నిలబడిన ఇద్దరు సహచరుల్ని అతనికి చూపించి బర్మా భాషలో యిష్టం వచ్చినట్లు తిట్టారు ఆగంతకులు.

అంతా ఓపికగా విని తల విదిలించాడు గ్రామస్థుడు.

"వచ్చిన వాళ్ళు సామాన్యమైన మనుష్యుల్లా కనిపించటం లేదు... మీ నుంచి తప్పించుకున్న యువకుడు అతిగా ఆలోచించి నన్ను మీ మనిషిగా గుర్తించక ముందే అతన్ని అతని సహచరులతో సహా బంధించాలి..." అన్నాడు.

మర్రి చెట్టువంటి ఆ వృక్షం వెనక్కి పోయి ఒక వైర్‌లెస్ సెట్‌ని యాక్టివేట్ చేశాడు వారిలో ఒకతను. ఎవరితోనో కొద్దిసేపు మాట్లాడి ఇవతలికి వచ్చాడు.

"నీవు చెప్పినట్లే చేయమని బాస్ అన్నారు... ఆ విదేశీయులందర్నీ బంధించి కొండ మీదికి తీసుకు రమ్మన్నాడు... అరగంటలో వస్తాం మేము. నువ్వు వెళ్ళిపో..." అన్నాడు గ్రామస్థుడితో.

తృప్తిగా తలవూపి వెనుతిరిగాడు అతను. ఎంత వేగముగా అక్కడికి వచ్చాడో అంతే వేగంగా గ్రామంలోకి బయలుదేరాడు.

ఒకే ఒక గుద్దుతో అతని తల పగలగొట్టాలన్న కోరికను అతి ప్రయత్నం మీద అదుముకొని అతనికంటే వేగంగా వెనక్కి పరుగుతీశాడు షాడో. ఇరవై

అయిదు నిముషాల్లో తాము బస చేసిన ఇంటిని సమీపించి, తమ గదిలోకి వెళ్ళాడు.

చటుక్కున లేచి కూర్చున్నారు చాపల మీద పడుకొని వున్న అతని స్నేహితులు యిద్దరూ.

“ఎక్కడికి పోయావ్ గురూ? తలకు ఆ కట్టేమిటి?” అని అడుగబోయి అతను చూపులతోనే వారించటంతో ఆగిపోయాడు శ్రీకర్.

లోగొంతుకతో జరిగింది వారికి వివరించాడు షాడో.

“ఏ నిముషంలోనైనా ఎటాక్ జరుగవచ్చు... మనం కనిపించకపోతే మనతో వచ్చిన టాంగా తాతను పట్టుకుంటారు వాళ్ళు” అంటూ ముఖేష్‌కి సైగ చేశాడు.

తమ కదలికల సవ్వడి ఇంటి యజమానిగాని, అతని కుటుంబానికిగాని వినిపించకుండా అడుగులు ఎత్తి ఎత్తి వేస్తూ బయటికి వచ్చారు వాళ్ళు. నిద్రపోతున్న టాంగా తాతను, బర్మా డాల్‌నీ బలవంతంగా లేపి తీసుకువచ్చారు .

ఇంటి వెనుక వున్న పెద్ద గడ్డి వామి చాటుకు వాళ్ళు వెళ్ళటం, పెద్ద పులుల మాదిరి నల్లటి దుస్తులు ధరించిన ఆగంతకులు పాతిక మంది ఆ ఇంటిని చుట్టు ముట్టడం ఒకేసారి జరిగింది.

* * * *

“అయ్యబాబోయ్ నాకేం చెలియదు... చీకటి పడగానే తినటానికి రొట్టెల్ని అందించి నేను ఇవతలికి వచ్చేశాను... వాళ్ళు ఏమైపోయారో, ఎక్కడికి వెళ్ళారో

కొంచెం కూడా తెలియదు నాకు...” చేతులు జోడించి మోకాళ్ళ మీద వాలిపోతూ గొల్లుమన్నాడు ఇంటి యజమాని.

ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు అతన్ని ఇంటి వెనక్కి లాక్కువచ్చిన ఆగంతకులు.

“వచ్చిన వాళ్ళు సామాన్యులు కాదని మనవాడు చెప్పనే చెప్పాడు. పూజా కట్టడం దగ్గిర జరిగిన గోలను సంకేతంగా భావించి అడ్రసులు మార్చేసి వుంటారు... గ్రామమంతా వెతకండి...పదండి...” ఇంటి యజమానిని వెనక్కి నెడుతూ తన వారందర్నీ హెచ్చరించాడు ఒకతను.

రెండవసారి చెప్పాల్సిన అవసరం లేకుండా జట్లు జట్లుగా చీలి గ్రామంలోని ఇళ్ళ మీద పడ్డారు వారందరూ. నిద్రలు పోతున్న వారిని బలవంతంగా లేపి ప్రశ్నలతో వేధించుకు తినసాగారు.

“వీళ్ళు ఎవళ్ళోగాని ఇటువంటి పనుల్లో మంచి ట్రయినింగ్ పొందినట్లుంది వరస చూస్తుంటే...” వారి ఎఫిషియన్సీని చూసి మెచ్చుకుంటూ అన్నాడు శ్రీకర్.

అతన్ని నోరు మూసుకోమని సైగ చేసి, గడ్డి వామి చాటునుంచి కదలబోయాడు షాడో.

చటుక్కున అతని చేయి పట్టుకుని ఆపేశాడు టాంగా వృద్ధుడు.

“బ్లాక్ విడో మెంబర్లు వాళ్ళు... ఎదుటికి పోతే ఏం జరుగుతుందో నాకంటే నీకే ఎక్కువగా తెలుసు...” అన్నాడు అతని తల వంక సాభిప్రాయంగా చూస్తూ.

"ఏం జరుగుతుందోననే భయంతో ఇక్కడే కూర్చుంటే చేతికి అందివచ్చిన అవకాశం జారిపోతుంది. ఇంకొద్ది సేపట్లో వాళ్ళు వట్టి చేతులతో వెనక్కి పోయి వారి బాస్‌కి రిపోర్ట్ చేస్తారు.. ఆ బాస్ ఎక్కడ వున్నాడో ముందు గానే తెలుసుకోవాలి... అందుకు వాళ్ళల్లో ఒకరిని పట్టుకొని రెండు తగిలించాలి..." అసహనంగా అన్నాడు షాడో.

"రెండు తగిలించేటప్పుడు అతను పెద్దగా అరిచి గోల చేస్తే?" ఎదురు ప్రశ్న వేశాడు వృద్ధుడు.

తలకు కట్టిన హేండ్ కర్చీఫ్‌ని తడుముకుంటూ ఆలోచనలో పడ్డాడు షాడో. నిజమే... తను ఏదో ఒక విధముగా ఎవరినో ఒకర్ని పట్టుకు వచ్చి ప్రయోజనం ఏముంటుంది?

అవతలి మనిషి అరిచి కేకలు పెట్టకుండా ఇంటరాగేట్ చేయటం ఎలా?

తీవ్రమైన ఆలోచనతో ముడుతలు పడిన అతని ముఖాన్ని చూసి నవ్వుతూ తన ప్రక్కనే వున్న యువతికి సైగ చేశాడా వృద్ధుడు.

వెంటనే కదిలిందామె. గడ్డి వామి దగ్గిర్నించి వీధిలోకి వెళ్ళి పది నిమిషాల్లో తిరిగి వచ్చింది.

ఆమె వెనుకే అరుదెంచాడు ఒక అగంతకుడు.

"ఎక్కడ? ఎక్కడున్నావ్ సుందరీ? ఏమైపోయావ్? ఆత్రంగా అడుగుతూ సూటిగా వచ్చి వృద్ధుడి చేతుల్లో ఇరుక్కున్నాడు.

ఎదుటి ప్రమాదాన్ని గుర్తించి అరవటానికి అతను నోటిని తెరువకముందే మెరుపులా కదిలి అతని మెడ మీద పడింది వృద్ధుడి కుడి చేయి.

సన్నగా శబ్దం చేసి తల వాల్చేశాడతను. స్పృహను కోల్పోయి క్రిందికి జారిపోయాడు.

రెండు క్షణాల్లో అతని దుస్తుల్ని వూడతీసి తను ధరించాడా వృద్ధుడు. సోయలేని ఆగంతకుడిని గడ్డి వామిలోకి నెట్టి బయటికి కనపడకుండా జాగ్రత్తలు తీసుకున్నాడు.

"మిమ్మల్ని పట్టుకోవటానికి వచ్చిన వారందరి కంటే పెద్ద పర్సనాలిటీలు మీవి. మారువేషం వేస్తే చిటికెలో దొరికిపోతారు... అనుమానం రాకుండా వారితో కలిసి అడవిలోకి బయలుదేరతాను నేను... నిశ్శబ్దంగా నన్ను అనుసరించండి" అంటూ షాడో సమాధానం కోసం ఎదురు చూడకుండా వీధిలోకి వెళ్ళిపోయాడు.

సరిగ్గా ఒక గంట తరువాత వట్టి చేతులతో అడవిలోకి బయలుదేరారు బ్లాక్ విడో మెంబర్లు.

అందరికంటే వెనుకగా అడుగులు వేస్తున్న ఆకారాన్ని అనుసరించాడు షాడో బృందం... మర్రి చెట్టు వంటి వృక్షాన్ని సమీపించి వైర్‌లెస్ సెట్‌లో ఎవరితోనో మాట్లాడాడు.

తన సహచరులలో కొందరిని ఆ వృక్షం దగ్గరే వుంచి మిగిలిన వారితో మళ్ళీ నడక ప్రారంభించాడు.

టాంగా వృద్ధుడు అతని వెనుకే బయలుదేరటాన్ని గమనించి, వృక్షం దగ్గిర వున్న వారికి కనిపించకుండా ముందుకు సాగాడు షాడో.

మరో అరగంట సేపు అడవిలో ప్రయాణం చేసి, ఒక పెద్ద కొండ గుట్టను చేరుకున్నాడు బ్లాక్ విడో మెంబర్.

అతనికి కనిపించకుండా వుండటానికి ఒక పొద చాటుకు చేరి తలలు వంచుకున్నారు షాడో బృందం. తిరిగి తలలు ఎత్తేసరికి ఎదుట ఎవరూ కనిపించలేదు... కనీసం అడుగుల చప్పుడు కూడా వినిపించలేదు... కనీసం అడుగుల చప్పుడు కూడా వినిపించకుండా మంత్రం వేసినట్లు మాయమయిపోయారు.

* * * *

"ఇదేదో ఆలీబాబా నలభై దొంగల కథలాగా వున్నది. ఈ కొండ దగ్గిర నిలబడి ఏదైనా మంత్రం చదివితే తప్ప మార్గం కనిపించదేమో" తాము తలలు వంచక ముందు బ్లాక్ విడో మెంబర్లు నిలబడిన ప్రదేశాన్ని కూలంకుషంగా గాలిస్తూ కామెంట్ చేశాడు శ్రీకర్.

"నోరు మూసుకొని చెప్పింది చేయి. నీ అభిప్రాయాలు ఇక్కడ ఎవరికీ అవసరం లేదు..." కోపంగా అంటూ ఎదుట వున్న ఒక కొండరాయి మీద చేయివేసి నుదురు చిట్లించాడు ముఖేష్.

"వాటీజ్ ఇట్ ముఖేష్? వాట్ హేపెన్డ్?" వెంటనే అతని ప్రక్కకు పోతూ ప్రశ్నించాడు షాడో.

"శ్రీకర్ మాటల్లో అసత్యం ఏమీ లేదు. ఆలీబాబా కథలోని గుహ వంటిదే ఈ కొండ మధ్యలో వుంది... దీనిలోకి పోయే మార్గాన్ని కొన్ని ఎలక్ట్రానిక్ పరికరాలు మానిటర్ చేస్తున్నాయి... వాటి వైబ్రేషన్స్ ఈ రాతిలో స్పష్టంగా కనిపిస్తున్నాయి..." అంటూ షాడో చేతిని ఆ కొండరాతికి ఆనించాడతను.

అస్పష్టంగా చేతికి తగులుతున్న వైబ్రేషన్స్‌ని గమనించి తల వూపాడు షాడో.

"ఈ గుట్ట దగ్గిరికి వచ్చినవాళ్ళు ఏదో సిగ్నల్‌ని ఇచ్చి, ఆ పరికరాల్ని యాక్టివేట్ చేసి వుంటారు... గివ్ మీ సమ్ టైమ్...." అంటూ తన ఎడమ చేతికి వున్న రిస్ట్ వాచిని వూడదీసి అడుగు భాగంలోని డయల్‌ని అటూఇటూ తిప్పాడు ముఖేష్.

కొండరాయి దగ్గిర మోకరించి కూర్చుని, రాతిలో నుంచి వస్తున్న వైబ్రేషన్స్‌ని అబ్జర్వ్ చేస్తూ డయల్ వెనుక భాగంలో వున్న ఒక మినీ వైర్‌లెస్ సెట్‌ని కదిలించటం మొదలు పెట్టాడు.

పది నిమిషాల తరువాత వినవచ్చిందొక విచిత్రమైన శబ్దం. ఆ శబ్దాన్ని అనుసరించి కిరకిరమంటూ ప్రక్కకు తొలగింది కొండగుట్టలో పది అడుగుల చదరపు రాయి.

ఆశ్చర్యపడేందుకుగాని, ముఖేష్ చూపించిన ప్రతిభను అభినందించేందుకుగాని వ్యవధి లేకపోయింది.

కొండరాయి ప్రక్కకు జరిగిన మరుక్షణం వేటకుక్కల్లా వచ్చి వారిని కమ్ముకున్నారు పాతికమంది బ్లాక్ విడో మెంబర్లు. చేతుల్ని విరిచి పట్టుకొని లోపలికి తీసుకుపోయారు.

* * * *

"వెల్... వెల్... షాడో... ది గ్రేట్ సీక్రెట్ ఏజెంట్ మిస్టర్ షాడో.... ఇటీజ్ ఎ ప్లెజర్ మిస్టర్ షాడో.. రియల్లీ ఇటీజ్ ఎ ప్లెజర్..." ఎంతో కాలం తరువాత

ఆప్తమిత్రుడిని చూసినంత సంతోషంగా అంటూ ఎదురు వచ్చిన ఒక పెద్ద పర్సనాలిటీని గమనించి నొసలు ముడివేశాడు షాడో.

ఎక్కడో విన్నట్లుంది ఆ కంఠం... ఆ కదలికల్ని కూడా ఎప్పుడో చూసినట్లు అనిపిస్తోంది...

"గుర్తుపట్టలేదా మిస్టర్ షాడో? నన్ను అప్పుడే మర్చిపోయావా?" అంటూ హేండ్ కర్చిఫ్‌తో ముఖాన్ని తుడుచుకుంది ఆ పర్సనాలిటీ...

"మైగాడ్! ఇయాన్ చూ!"

అప్రయత్నంగా వెలువడిందా పేరు షాడో నోటివెంట.

నడుము మీద చేతులు వేసుకొని విచిత్రంగా నవ్వాడు ఇయాన్ చూ.

చైనీస్ సీక్రెట్ ఏజన్సీలో షాడోతో సరిసమానమైన రాంక్ గల ఏజెంట్ అతను... తను స్వయంగా చేతులుపెట్టకుండా, ఇతరులచేత తన పనులు పూర్తి చేయించుకోవటంలో స్పెషలిస్ట్.

"సైంటిస్ట్ మాథుర్ ఎప్పుడయితే నీ ఫ్రండ్ అహూజా రెస్టారెంట్‌లో తలదాచుకున్నాడో అప్పుడే నువ్వు నన్ను వెతుక్కుంటూ వస్తావని అనుమానించాను మిస్టర్ షాడో... ముందు జాగ్రత్తకోసం ఒక మనిషిని ఢిల్లీ పంపి నిన్ను ఖతం చేయటానికి ప్రయత్నించాను..." అంటూ ఒకసారి చిటికె వేశాడు ఇయాన్ చూ.

కొండ గుట్ట ముందున్న బండరాయి ప్రక్కకు జరిగినట్లే షాడోకి పది అడుగుల దూరంలో వున్న ఒక ఇనుపరేకు నిశబ్దంగా ప్రక్కకు జరిగింది.

నెత్తురు ఓడుతున్న అవయవాలతో తల్లక్రిందులుగా వ్రేలాడుతూ అతనికి కనిపించాడు ఆ రేకు వెనుక వున్న గదిలోని వ్యక్తి ఒకతను.

“బజూకాను ప్రయోగించి నిన్ను మట్టుబెట్టి రమ్మని నేను పంపిన ఇడియట్...చెప్పిన పనిని విజయవంతంగా నెరవేర్చనందుకు, నిన్ను రెచ్చగొట్టి బర్మా రప్పించినందుకు ఫలితం అనుభవిస్తున్నాడు...” అంటూ యింకో సారి చిటికె వేశాడు ఇయాన్ చూ.

మూసుకుంటున్న రేకు తలుపు వైపు చూసి తల విదిలించాడు షాడో.

జరుగుతున్న కథకు సూత్రధారి ఇయాన్ చూ అని తెలిసింది... అంతవరకూ బాగానే వుంది కాని, అతను సైంటిస్ట్ మాధుర్‌ని కిడ్‌నాప్ చేయటంలోని అంతర్యం ఏమిటి?

షాడో ఆలోచనలను గమనించినట్లు విచిత్రంగా నవ్వి అక్కడ వున్న సోఫాలకేసి చేయి వూపాడు ఇయాన్ చూ.

“టేక్ యువర్ సీట్స్ మై ఫ్రెండ్స్... ప్రాణాలు పోగొట్టుకోబోయే ముందు కొద్దిపాటి విశ్రాంతి తీసుకోండి...” అంటూ వారిని తీసుకువచ్చిన మెంబర్లకు సైగ చేశాడు.

పెద్ద పెద్ద అడుగులు వేస్తూ ఒక ప్రక్కకు పోయి, రెండు నిమిషాల తర్వాత సన్నగా పొడుగ్గా వున్న మధ్య వయస్కుడు ఒకతన్ని వెంటబెట్టుకు వచ్చారు యిద్దరు మెంబర్లు.

“మైగాడ్! సైంటిస్ట్ మాధుర్ అతనే... కంప్యూటర్ టెక్నాలజీలో అపూర్వమైన పరిశోధనలు చేస్తున్న మన సైంటిస్ట్...” అతన్ని చూడగానే అప్రయత్నంగా అన్నాడు ముఖేష్.

తమ బాధలన్నిటికీ మూలకారకుడైన ఆ సైంటిస్ట్ మాధుర్‌ని పరీక్షగా చూసి తల విదిలించాడు షాడో.

సో... కంప్యూటర్ టెక్నాలజీలో అపరిమితమైన తెలివితేటలు అతనికి వుండవచ్చు... ఇయాన్ చూ వంటి స్టార్ ఏజెంట్స్ దృష్టిని ఆకర్షించేటంత గొప్పతనం ఏముంది అతనిలో?

ఈ సారి కూడా అతని ఆలోచనల్ని పసికట్టి మరింత బిగ్గరిగా నవ్వాడు ఇయాన్ చూ.

"మీ దేశంలో వున్న వారి గొప్పతనం మీకే తెలియదు మిస్టర్ షాడో. సైంటిస్ట్ మాధుర్ విషయంలో కూడా అదే జరిగింది..." అంటూ తన కుర్చీ ప్రక్కన వున్న ఒక కంప్యూటర్‌ని అతనికి చూపించాడు.

"ఎంత దూరంలో వున్న ప్లాస్టిక్ ఎక్స్‌ప్లోజివ్స్ నైనా సిగ్నల్స్ పంపి పేల్చి వేయగల విచిత్ర సాధనం యిది... దీన్ని కనిపెట్టి మీ మిలిటరీ అధికారులకు అందించాలని మాధుర్ చేసిన ప్రయత్నాలను విఫలం చేసింది మీ స్పెషల్ బ్రాంచి. అటువంటి అభ్యంతరకరమైన పరిశోధనలు చేయవద్దని ఆదేశించింది. తన ప్రయోగాలను గుర్తించి గౌరవించకపోగా అవమానించి పంపిననందుకు బాధపడి బర్మా వచ్చేశాడు మీ సైంటిస్ట్. తను కూడబెట్టుకున్న డబ్బుతో ఎంతో కష్టపడి ఈ పరికరాన్ని రూపొందించాడు. దీని శక్తిని ప్రత్యక్షంగా చూపించి స్పెషల్ బ్రాంచి వారిని వప్పించాలని మాత్రమే అతని ఆశయం."

"తను తయారుచేసిన ఈ సూపర్ కంప్యూటరుతో ఇతను భారతదేశం బయలుదేరకముందే బ్లాక్ విడో గాంగ్ ద్వారా మేము తెలుసుకున్నాం ఈ

విషయాన్ని. విమానాశ్రయానికి బయలుదేరుతున్న మాధుర్‌ని అటకాయించి కంప్యూటర్‌ని స్వాధీనం చేసుకోగలిగాం. ఆ సందడిలో తెలివిగా తప్పించుకొని మీ అహుజా దగ్గిర ఆశ్రయాన్ని పొందాడు ఇతను...” జరిగిన విషయాలన్నిటినీ వివరంగా చెపుతూ మళ్ళీ నవ్వాడు ఇయాన్ చూ.

“పరిశోధనలు చేయవద్దని శాసించిన స్పెషల్ బ్రాంచి, కంప్యూటర్ నిర్మాణం పూర్తి అయిందని తెలుసుకొని ఈ కంప్యూటర్‌తో సహా మాధుర్‌ని అరస్ట్ చేయటానికి బర్మాలో అడుగుపెట్టింది... అహూజా పంపిన కబురు అందుకొని నువ్వు వచ్చావు.”

“మీ అందర్నీ ప్రక్కదారి పట్టించి నా పంతం నెరవేర్చుకున్నాను మిస్టర్ షాడో... ఇంకో వారం రోజుల్లో మీ దేశాన్ని అల్లకల్లోలం చేస్తాను...” జరుగుతున్న దేమిటో మీ అధికారులు గమనించలేక తలలు పగలగొట్టుకుంటున్న సమయంలో సరిహద్దుల్ని దాటతాయి మా సైన్యాలు. మా చిరకాల వాంఛితాన్ని నెరవేరుస్తాయి.”

మెరుస్తున్న కనులతో అతను చెపుతున్న మాటల్ని విని తల వూపాడు షాడో. తల వూపాడుగాని, అతను భారత దేశంలో అల్లకల్లోలాలు ఎలా సృష్టిస్తాడో అర్థం చేసుకోలేకపోయాడు.

“ఇటీజ్ వెరీ సింపిల్ మిస్టర్ షాడో... వెరీ వెరీ సింపిల్...” అంటూ కంప్యూటర్ వెనుక వున్న ఒక అట్టపెట్టెను తెరిచి చూపించాడు ఇయాన్ చూ.

చూడగానే ఆకర్షించే అందమయిన బర్మా డాల్ ఒకటి వుంది ఆ పెట్టెలో. ప్లాస్టిక్‌తో తయారుచేయబడిన ఆ బొమ్మ మధ్యలో ఎవరికీ తెలియని విధంగా ఎక్స్‌ప్లోజివ్స్‌ని ప్రతిక్షేపించాడు ఇయాన్ చూ.

“బొమ్మల్ని అభిమానించే మీ దేశీయులు అతిచౌకగా అమ్మబడే ఇటువంటి బర్మా డాల్స్ ఎగబడి కొంటారు... ఇవి మీ దేశం నలుమూలలకు చేరుకోగానే ఈ కంప్యూటర్ సాయంతో విధ్యంసకాండను మొదలు పెడతాను...” అంటూ తన పధకాన్ని పూర్తిగా వివరించాడు.

ఆ మాటలు పూర్తి కాకముందే స్నానం చేసినట్లు తడిసిపోయింది షాడో శరీరం చమటలతో.

ఎంతో సింపిల్‌గా కనిపిస్తున్న ఆ పధకం ఆచరణలోకి వస్తే మరెంత దారుణంగా తయారవుతుందో వూహించుకునేసరికి దాహం వేస్తున్నట్లు ఎండుకుపోయింది అతని గొంతు.

“నువ్వు మనిషివి కాదు... రాక్షసుడివి...” అప్రయత్నంగా వెలువడిందా మాట అతని నోటి వెంట

“థేంక్యూ వెరీ మచ్ మిస్టర్ షాడో. థేంక్యూ...” అంటూ కుర్చీలోనుంచి లేచి తన పాంటు జేబులో నుంచి రివాల్వర్ నొకదాన్ని బయటికి తీశాడు ఇయాన్ చూ.

“నిన్న హతమార్చాలని ప్రయత్నించి ఎంతోమంది మా ఏజెంట్లు ప్రాణాలు పోగొట్టుకున్నారు. వారిలా తప్పులు చేయదలచుకోలేదు నేను... దీపం వుండగానే

ఇల్లు చక్క బెట్టుకోవాలన్న మీ ఆర్యోక్తి ప్రకారం అవకాశం లభించినప్పుడే నిన్ను చంపి నా దారికి అడ్డు తొలగించుకుంటాను....” అంటూ ట్రిగ్గర్‌ని నొక్కాడు.

ఎదురుచూడని ఆ పరిణామానికి విస్తుబోయినా వెంటనే తేరుకుని సోఫాలోనుంచి క్రిందికి దొర్లాడు షాడో.

దొర్లుతూనే బూటు మీదికి చేతిని పోనిచ్చాడు డాగర్ కోసం.

ఎక్కడ వున్నదది!

తాచుపాము కాటు పడకుండా తప్పించుకునే ప్రయత్నంలో గోతిలో పడినప్పుడు అక్కడే జారిపడి పోయింది.

ఆ విషయాన్ని మరిచిపోయినందుకు తనను తానే నిందించుకుంటూ డిస్పరేట్‌గా ఇంకో ప్రక్కకు దొర్లిన అతని కేసి రివాల్వర్‌ని తిప్పి మళ్ళీ ట్రిగ్గర్ నొక్కాడు ఇయాన్ చూ....

అయిపోయిందనుకున్నాడు షాడో తన పని....

“రాజూ... మైగాడ్... రాజూ...” విపరీతమైన ఆందోళనతో కంపించిపోతూ ఆవేదనగా అరిచాడు ముఖేష్.

అగ్నికణంలా వచ్చి షాడో తొడలో దిగబడింది బుల్లెట్....

అది చూసి బిగ్గరిగా నవ్వుతూ ఇంకోసారి రివాల్వర్‌ని ఎయిమ్ చేశాడు ఇయాన్ చూ.

మెరుపుకంటే వేగంగా కదిలింది షాడో చేయి. తన పథకాన్ని వివరిస్తూ బర్మా డాల్ వున్న అట్టపెట్టెను సోఫా దగ్గిరే వదిలేశాడు అతను....

ఆ పెట్టెలో చేయిపెట్టి బొమ్మను బయటికి తీశాడు షాడో. శరీరంలోని శక్తినంతా కూడ గట్టుకొని అతనికేసి విసిరాడు.

అదే సమయంలో నిప్పుల్ని కురిపించింది ఇయాన్ చూ చేతిలోని రివాల్వర్. సూటిగా వచ్చి గాలిలోకి ఎగిరిన బర్మా డాల్‌లో దిగబడింది బుల్లెట్.

కంప్యూటర్‌తో నిమిత్తం లేకుండా ఆ బుల్లెట్ వేడిమికి తనంతట తానే యాక్టివేట్ అయింది అందులోని ప్లాస్టిక్ ఎక్స్‌ప్లోజివ్.

చెవులు చిల్లులు పడే శబ్దం...కనులు మిరుమిట్లు గొలిపే వెలుగు...

పదిక్షణాలపాటు స్తంభించి పోయింది కాలం ఆ గదిలో....

అందరికంటే ముందుగా తేరుకున్నాడు శ్రీకర్. తన వెనుక నిలబడిన బ్లాక్ విడో మెంబర్ గుండెల మీద తలతో గుద్ది అతని చేతిలోని రివాల్వర్‌ని లాక్కున్నాడు...

"పట్టుకోండి... పట్టుకోండి... చంపండి..." అని కేకలు పెడుతూ అతన్ని అటకాయించటానికి ప్రయత్నించారు మిగిలిన వారు.

నిర్దాక్షిణ్యంగా రివాల్వర్‌ని వారికేసి తిప్పాడు శ్రీకర్.

దబ్ దబ్ మని శబ్దం చేస్తూ క్రింద పడుతున్న గాంగ్ మెంబర్ల మీదుగా జంప్ చేసి కంప్యూటర్ దగ్గిరికి పోయాడు ముఖేష్. దాన్ని ఒకసారి పరీక్షగా చూసి ప్రక్క భాగంలో వున్న రెండు బటన్స్‌ని నొక్కి ఇవతలకు దూకాడు.

అతని భావాలను అర్థం చేసుకున్నాడు శ్రీకర్. తనకు కొద్ది దూరంలో నిలబడి వున్న టాంగా యువతిని క్రిందికి నెట్టి తను కూడా ఒక సోఫా చాటుకు దొర్లాడు.

సెల్ఫ్ డిస్ట్రకివ్ మెకానిజమ్ చేర్చబడి వుందా కంప్యూటర్‌లో ... ముఖేష్ నొక్కిన బటన్స్ ఆ మెకానిజమ్‌ని యాక్టివేట్ చేశాయి... నిప్పు రవ్వల్ని వెలువరుస్తూ బాంబులా ప్రేలిపోయిందా కంప్యూటర్. ఇయాన్ చూ ఆశను అడియాస చేసేసింది.

అది వెలువరించిన పొగలు ఒకింత చెదిరిపోగానే సోఫా చాటునుంచి లేచి షాడో కోసం చూశాడు శ్రీకర్.

రివాల్వర్ దెబ్బకు స్పృహ కోల్పోయి వుండాల్సిన షాడో అసలు ఆ ప్రదేశంలో లేడు.

అతనొక్కడే కాదు... ఇయాన్ చూ... సైంటిస్ట్ మాధుర్ కూడా కనిపించలేదు.

"గురూ... గురూ..." అని పిలుస్తూ గుహ వెనుక భాగంలో వున్న ఇంకో గదివైపు పరిగెత్తి ఆశ్చర్యంతో మ్రాన్పడి పోయాడు శ్రీకర్.

స్పృహ లేకుండా పడివున్న మరో పాతికమంది బ్లాక్ విడో మెంబర్స్‌తో నిండి వున్నదది. వారందరికీ కొంచెం అవతలగా ఒక కుర్చీలో కూర్చొని తన వెనుక భాగంలోని మరో గదివైపు చేయి చూపించాడు మారు వేషంలో గుహలోకి ప్రవేశించిన టాంగా వృద్ధుడు.

వంటి చేత్తో పాతికమందిని అతను ఎలా పడగొట్టగలిగాడో అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తూ అతను చూపించిన గదిలోకి పోయి మరింత ఆశ్చర్యంతో శిలా విగ్రహంలా నిలబడిపోయాడు శ్రీకర్.

ప్లాస్టిక్ బొమ్మ ప్రేలుడు అదటుకు తన చేతిలోని రివాల్వర్ ఎగిరిపోగా, వెనుతిరిగి పారిపోవటానికి ప్రయత్నించాడు ఇయాన్ చూ....తను కనిపెట్టిన సాధనాన్ని తన దేశ వినాశనానికి వినియోగించబోయాడన్న కక్షతో అతన్ని వెన్నంటాడు సైంటిస్ట్ మాధుర్.

వళ్ళు తెలియని ఆవేశంతొ అతని మీద పడి, వట్టి చేతులతొనే గొంతును నులిమి ప్రాణాలను తీశాడు.

తొడమీది గాయం విపరీతమైన బాధను కలుగచేస్తున్నా లెక్కచేయకుండా అతనితొపాటు కదిలాడు షాడొ. అవసరమైతే చేయి అందించటానికి సిద్ధంగా నిలబడ్డాడు.

ఇయాన్ చూ విగతజీవుడైన తర్వాత తను చేసిన పని అర్థమై విషణ్ణ వదనంతో నిలబడ్డాడు మాధుర్.

“ఆవేశాన్ని అణుచుకొలేకపొయాను.... చేయకుడని తప్పు చేశాను....” అని అంటుండగా పరుగు పరుగున ఆ గదిలోకి వచ్చాడు ముఖేష్

“కమాన్ రాజూ.... క్విక్....ఎప్పటి మాదిరిగానే అంతా అయిపోయిన తరువాత చేరుకున్నాడు మన మజ్దూర్.... గుహ బయట నిలబడి బండరాయిని పగలగొట్టించే ప్రయత్నం చేస్తున్నాడు.... నిన్ను సిగరెట్ల నెపంతో ట్రాప్ లోకి పంపిన గ్రామస్థుడు అతనికి దొరికి పోయాడు....”అంటూ రిపోర్ట్ చేశాడు.

తలకు కట్టుకున్న హేండ్ కర్చిఫ్‌ని తొడకు చుట్టు కుంటూ టాంగా వృద్ధుడికేసి చూశాడు షాడో.

“ఎప్పుడో చెప్పాను నేను.... చేసినదంతా చేసి ఆఖరిక్షణంలో చేతులు ఎత్తే స్వభావం మీలో నుంచి పోనేలేదు. నాతో రండి....” అంటూ ఆ గదిలో నుంచి మరోగదిలోకి తీసుకుపోయాడతను వారందర్నీ.

అక్కడ వున్న ఒక మీటను నొక్కేసరికి కిరకిరమని శబ్దం చేస్తూ ప్రక్కకు తొలిగింది కొండ గుట్ట వెనుక భాగంలో వున్న మరొక బండరాయి.

“సైంటిస్ట్ మాధుర్ ఆవేశ పడకపోయినట్లయితే ఇయాన్ చూ ఈ మార్గం ద్వారానే పారిపోయి వుండే వాడు.... మళ్ళీ ఇంకెవరినైనా పట్టుకొని కొత్త బర్మా డాల్స్‌ని సృష్టించే ప్రయత్నం చేసేవాడు” ఆ ద్వారంలో నుంచి బయటికి వస్తూ అన్నాడు శ్రీకర్.

అతని మాటలు ఎవరు వినిపించుకోలేదు....అడవి మీది నుంచి వీస్తున్న చల్లటిగాలిని గుండెల నిండా పీల్చు కుంటూ గ్రామం వైపు అడుగులు వేశారు.

* * * *

“సో...ఒకళ్ళు చెప్పాల్సిన అవసరం లేకుండానే మీ అంతట మీరే ఇయాన్ చూ రాక్షస పథకాన్ని నాశనం చేసి వచ్చారన్న మాట....అవునా?” సిగార్ పొగను గుప్పు గుప్పున వదులుతూ అన్నారు కులకర్ణి.

అవునని తలలు వూపబోయి ఆఖరి క్షణంలో ఆగి పోయారు స్నేహితులు ముగ్గురూ.

తన అనుమతి లేకుండా బర్మా వెళ్ళినందుకు తిట్టిన తిట్టు తిట్టకుండా రెండు గంటలపాటు ఏకగ్రీవంగా ఫైర్ అయిపోవాల్సిన మనిషి అంత కామ్‌గా

కూల్‌గా సంభాషణ ప్రారంభించటానికి ఏదో కారణం వుండి వుంటుంది.... అదేమిటో తెలుసుకోకుండా పెదవులు విప్పితే తలలు బొప్పెలు కట్టడం ఖాయం.

"దెబ్బలు తిని మంచం ఎక్కిన అహూజా బాగున్నాడా?" మళ్ళీ అడిగాడు కులకర్ణి.

ఈసారి ధైర్యం చేసి తల వూపాడు షాడో.

"వెరీగుడ్... మీకు ఎంతగానో సాయం చేసిన ఆ టాంగావాలా ఎలా వున్నాడు?"

తమ ఎడ్వంచర్‌ని వివరించి చెప్పేటప్పుడు టాంగా వాలా గురించి యధాలాపంగా వివరించటం జరిగింది కాని, ప్రత్యేకంగా చెప్పటం జరగలేదనే విషయం గుర్తుకు వచ్చి షాడో పాదాన్ని బూటు కాలితో తట్టాడు ముఖేష్ జాగ్రత్త పడమని హెచ్చరికగా.

"టాంగా వాలా బాగానే వున్నాడు సార్... మమ్మల్ని తన బోటులో చక్రూ తీరానికి చేర్చి వెళ్ళిపోయాడు..." జాగ్రత్తపడుతూ చెప్పాడు షాడో.

"చక్రూ తీరానికి చేర్చి తను వెళ్ళిపోయాడా, మీరు వెనక్కి కూడా చూడకుండా వచ్చేశారా?"

సిగరెట్ వెలిగించుకునే నెపం మీద తల వంచుకొని ముఖంలోని భావాలు ఆయన కంట పడకుండా తప్పించుకున్నాడు షాడో.

చక్రూ తీరం దగ్గిర టాంగావాలాకు కృతజ్ఞతలు తెలియచేసుకొని వచ్చేశారు తాము... అతను ఏమయిపోయాడో విచారించలేదు.

"సో... ముక్కు ముఖం తెలియని వాళ్ళు ఒకటి రెండు సహాయాలు చేయగానే మీకు అజాగ్రత్తలు ఎక్కువైపోతాయన్న మాట! ఏ కిల్లర్స్ గాంగ్ మెంబరో టాంగా వాలా మాదిరి నటించి మిమ్మల్ని అనుసరించి వస్తే ఏం జరుగుతుందో ఆలోచించారా?" గుర్రుగా చూస్తూ అడిగారు కులకర్ణి.

"ముక్కు ముఖం తెలియని వాళ్ళు ఎన్ని సహాయాలు చేసినా మా వెంట ఎందుకు రానిస్తాము సార్? మమ్మల్ని అనుసరించటం అంత తేలికా??" వెంటనే ఎదురు ప్రశ్న వేశాడు శ్రీకర్ – నోరు వూరుకోక.

"ఓహో! అలాగా!! అయితే నీళ్ళు ఎవరో కొంచెం ఆలోచించుకొని చెప్పండి..." అంటూ కాలింగ్ బెల్ నొక్కారు కులకర్ణి.

నిశ్శబ్దంగా తెరుచుకున్నాయి గది తలుపులు....

మెరుస్తున్న కనులతో, ఉబికి వస్తున్న నవ్వును అదిమిపట్టుకోవటానికి విఫల ప్రయత్నం చేస్తూ లోపలికి వచ్చాడు టాంగావాలా.... అతని వెనుకే అరుగుదెంచింది అతని సహచరురాలైన బర్మా డాల్.

చక్రూ సిటీలో కనిపించినట్లు చినిగిపోయిన దుస్తులు కాదు వారు ధరించింది. ఖరీదయిన మోడ్రన్ డ్రస్.

కనులు చిట్లించి రెండు క్షణాలు పరీక్షగా చూసి చటుక్కున ఛైర్లోనుంచి లేచాడు షాడో. వినయంగా తలవంచి నమస్కరించాడు.

"టాంగావాలా వేగంలో మీకు సహాయ పడమని, వెర్రి మొర్రి వేషాలు వేయకుండా జాగ్రత్తగా చూడమని బర్మాలో వుండే నా ఈ చిన్ననాటి స్నేహితుడికి కబురు పంపబట్టి క్షేమంగా తిరిగి రాగలిగారు మీరు. నా ఫ్రండ్

లేకపోయినట్లయితే ఏం చేసేవారు?" శ్రీకర్ వంక చూస్తూ పర్టిక్యులర్‌గా అడిగారు కులకర్ణి.

అడగటం అయితే అడిగారు గాని, తన ఫ్రెండ్ అక్కడ వున్నా లేకపోయినా వాళ్ళు ఏం చేసే వాళ్ళో ఆయనకు బాగా తెలుసు.

ఆయనకు తెలుసని స్నేహితులకు తెలుసు... వారికి సహాయపడిన ఆయన ఫ్రెండ్‌కీ తెలుసు....


వారికి బాస్ కాబట్టి, బాస్‌లు ఎప్పుడూ తమ క్రింద పని చేసే వారిని విమర్శిస్తూ వుండాలి కాబట్టి అరగంట సేపు ఏకధాటిగా వారిని స్కోల్డ్ చేశారు కులకర్ణి...

"నా ఫ్రెండ్ తో కాస్సేపు మాట్లాడి వస్తాను. ఇక్కడే కూర్చోండి" అని చెప్పి అరగంట తరువాత అవతలి గదిలోకి వెళ్ళారు.

తిరిగి వచ్చేసరికి ఖాళీగా వుంది గది... బుద్ధిగా కూర్చుని వుండాల్సిన ఏజెంట్స్ ముగ్గురూ మాయమై పోయారు అక్కడి నుంచి.

"బ్లడీ ఇడియట్స్... మైండ్ లెస్ బ్రూట్స్..." ఆప్యాయంగా అనుకుంటూ తిరిగి తన స్నేహితుడి దగ్గిరికి వెళ్ళారాయన.

సమాప్తం


BURMA DOLL
MADHU BAABU